



Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!








సంపుటి:58 • సంచిక: 167 • శనివారం 5 అక్టోబర్ 2019 • హైదరాబాద్ ❋ పేజీలు:10+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore


• మోడీజీ... మా విన్నపాలు వినండి



## 22 అంశాలతో ప్రధానికి వినతిపత్రం

- వెనుకబడిన జిల్లాలకు రూ.450 కోట్లివ్వండి
- ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ పునరుద్ధరణ
- హైకోర్టులో జడ్జీల సంఖ్య 42కు పెంచండి
- ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ ఏర్పాటుకు చర్యలు
- కొత్త జిల్లాల్లో జవహర్ నవోదయ స్కూళ్లు
- రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ నిధులివ్వండి
- మిషన్ కాకతీయ, భగీరథలకు సాయం
- బయ్యారం స్టీల్ ప్లాంట్
- జహీరాబాద్‌లో నిమ్స్
- ఎన్ఐడి ఏర్పాటు
- ఎస్సీల వర్గీకరణ
- కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ
- ఉపాధి, విద్యలో బీసీలకు రిజర్వేషన్ల పెంపు
- చట్టసభల్లో ఓ-బీసీలు, మహిళలకు రిజర్వేషన్లు
- వరంగల్, నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్లు
- పీఎంజీఎస్‌వై కింద నిధులివ్వండి
- వరంగల్‌లో గిరిజన వర్సిటీ
- టెక్స్‌టైల్ పార్కుకు వెయ్యి కోట్లు
- వారసత్వ సంపద రామప్పగుడి
- మావో ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రమే రోడ్లు

### మా పథకాలే ప్రాతిపదికగా

# అభివృద్ధి అజెండా!

అనేక రాష్ట్రాలు, విభిన్న వర్గాలతో మిళితమైన మన దేశంలో జాతికి అంతటికీ వర్తించేలా అభివృద్ధి అజెండా రూపొందాల్సిన అవసరం ఉందనే డిమాండ్‌ను జాతీయ స్థాయిలో వినిపించేలా సీఎం కేసీఆర్ కేంద్రంతో మంతనాలు సాగిస్తున్నారు.

### ప్రధాని మోడీకి సీఎం కేసీఆర్ ప్రతిపాదన

### రిజర్వేషన్ల అంశం రాష్ట్రాలకే ఉండాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇప్పుడున్న విధానాలు, పద్ధతులు, చట్టాలను సంపూర్ణంగా అధ్యయనం చేసి, అవసరమైన మార్పులు, సంస్కరణలు తెచ్చే విషయంపై వివిధ రంగాలకు చెందిన నిపుణులు, సీనియర్ అధికారులతో సంప్రదింపులు చేస్తున్న ఆయన కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై కూడా నిర్మొహమాటంగానే తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా అనుకున్న పురోగతి రావడం లేదని అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించిన సీఎం కేసీఆర్ శుక్రవారం ➪ 3వ పేజీలో...



3

## విభజన అంశాలు తేల్చండి

హోంమంత్రి అమిత్ షాకు కేసీఆర్ విజ్ఞప్తి

## రుణాలు మరింత చౌక

దశాబ్దం కనిష్టానికి బ్యాంకుల వడ్డీరేట్లు 6

ఆర్బీఐ రెపో రేటు ఐదోసారి తగ్గింపు

పావుశాతం కోత

వినియోగదారులకు శుభవార్త: ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్




నీ చేతిలోని ప్లాస్టిక్ సంచి... యమపాశమే రూపం మార్చి! వాడితే ఇంకా ఆదమరచి... ఊపిరి తీస్తుంది కర్కశించి!!

GO GREEN | SAY NO TO PLASTIC

సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ...

ఆంధ్రప్రభ




# బస్సులు బంద్

## ముఖ్యమంత్రి సీరియస్

చర్చల కమిటీ రద్దు • నేటి సాయంత్రం 6గంటల దాకా గడువు

విధుల్లో చేరని వారు ఉద్యోగులే కాదు: ప్రభుత్వం అల్టిమేటమ్

ఢిల్లీ నుంచి రాగానే ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మెపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమ్మె చట్ట విరుద్ధమని, ఈ రోజు సాయంత్రం (శనివారం) ఆరు గంటల్లోగా ఆయా డిపోలలో రిపోర్టు చేసిన వారిని మాత్రమే ఇకపై సంస్థ ఉద్యోగులుగా గుర్తిస్తామని, విధుల్లో చేరని వారిని తమంతట తాముగా ఉద్యోగాలు వదిలిపెట్టినట్లుగా భావించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన సీఎం కేసీఆర్ సమ్మెపై త్రిసభ్య కమిటీ సభ్యులతో చర్చించారు. మూడు రోజులుగా ఆర్టీసీ జేఏసీ నేతలతో జరిపిన చర్చల వివరాలను కమిటీ ఛైర్మన్, సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేష్‌కుమార్ సీఎంకు వివరించారు. ఆర్టీసీ విరమణకు చివరిదాకా ప్రయత్నించామని, కానీ జేఏసీ నేతలు సమ్మె వైపే మొగ్గు చూపారని చెప్పడంతో కేసీఆర్ ఆగ్రహానికి లోనయ్యారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ సమ్మెకు మద్దతివ్వరాదని, ఇప్పటికే పీకల్లోతు నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించే బాధ్యత కార్మికులదని, అలా కాకుండా సమ్మె చేయాలని నిర్ణయించడం చట్ట విరుద్ధమని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. గడువులోగా విధుల్లో చేరి బాధ్యతలను నిర్వర్తిస్తున్న కార్మికులకు పూర్తిస్థాయిలో రక్షణ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, విధుల్లో చేరని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి ఉద్యోగంలో తీసుకోబోమని సీఎం తేల్చి చెప్పారు. ఇకపై కార్మిక సంఘాల నాయకులతో ఎలాంటి చర్చలు జరపవద్దని కూడా సీఎం అధికారులను ఆదేశించారు. దీంతో కార్మికులతో చర్చల కోసం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీ కూడా రద్దు అయిపోయింది. ట్రాన్స్‌పోర్టు ➪ 5వ పేజీలో...

## సమ్మె విరమించండి 5

కార్మికులకు మంత్రి అజయ్ విజ్ఞప్తి

## ఎస్మా పేరుతో బెదిరిస్తారా?



5

### ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ.9.50 వరకు; నక్షత్రం: మూల మ.1.19 వరకు; వర్జ్యం: ఉ.11.39 నుండి 1.19 వరకు, రా.11.37 నుండి (ఆదివారం) తె.1.20 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.10 నుండి 7.44 వరకు; రాహుకాలం: ఉ.9.07 నుండి 10.35 వరకు; యమగండం: మ.1.33 నుండి 3.01 వరకు;

### జోరా..!






## తెరాస ఓటమికి కాంగ్రెస్-బీజేపీ కుట్ర

ఉత్తమ్-లక్ష్మణ్ ఫోన్ సంప్రదింపులు

హస్తానికి ఓటమి తప్పదు...

ఈ విషయం పీసీసీ సారథికి తెలుసు

ఎన్నిసార్లో గెలిపించారు.. ఆయనేం చేశారు • మేం ఇప్పటికే రూ.2 వేల కోట్లతో పనులు చేపట్టాం • సైదిరెడ్డిని గెలిపిస్తే ఇక తిరుగే ఉండదు

హుజూర్‌నగర్ రోడ్ షోలో మంత్రి కేటీఆర్

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్:** హుజూర్‌నగర్ శాసనసభా స్థానానికి జరుగుతున్న ఉపఎన్నికల్లో తెరాసను ఓడించేందుకు విపక్ష కాంగ్రెస్, బీజేపీలు కుట్రపన్నుతున్నాయని, ఈ విషయంలో పరస్పర సహకారం కోసం ఆ పార్టీ సారథులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్‌లు తరచూ ఫోన్‌లో సంప్రదింపులు జరుగుతున్నారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. వారెన్ని జిత్తులు వేసినా ప్రజలు తమ పార్టీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో భాగంగా రోడ్డు షోలో ప్రజలను ఉద్దేశించి ఆయన ➪ 2వ పేజీలో...

వెంకటేశ్వర్లు ఔట్



భాస్కరన్ ఇన్



2

## సూర్యాపేట ఎస్పీపై ఈసీ వేటు

వెంకటేశ్వర్లు స్థానంలో భాస్కరన్‌కు బాధ్యతలు


www.homeocare.in

ఇక నాకు ఆస్తమాతో బాధ లేదు

తీవ్రమైన ఆయాసం, దగ్గు, శ్వాసలో పిల్లి కూతలు, శ్వాస ఆగిపోవటం అనే ఆస్తమా లక్షణాలతో 3 సంవత్సరాలు బాధపడ్డాను, హోమియోకేర్ వారి కాన్‌స్టిట్యూషనల్ హోమియోపతి చికిత్సతో చాలా కొద్ది సమయంలోనే పూర్తి ఉపశమనం కలిగింది



సూపర్ స్పెషాలిటీ చికిత్సలు

అలర్జిక్ రైనైటిస్ | సైనసైటిస్ | నాసల్ పాలిప్స్ | ఆస్తమా | అలర్జిక్ బ్రాంకైటిస్ | మైగ్రేన్
అలర్జిక్ జలుబు మరియు దగ్గు | టాన్సిలైటిస్ | అడినాయిడ్స్ | దీర్ఘకాలిక తలనొప్పి

హోమియోకేర్® ఇంటర్‌నేషనల్
వరల్డ్-క్లాస్ హోమియోపతి

ఉచిత కన్సల్టేషన్ 955 000 1199

టోల్ ఫ్రీ 1800-108-1212

## నవరాత్రి శోభ



## లలితాత్రిపుర సుందరి భవానీ అలంకారంలో భద్రకాళీ మాత

**వరంగల్ కల్చరల్, ప్రభన్యూస్:** శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు వరంగల్ మహానగరంలో చరిత్రప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి అమ్మవారు భవాని, లలితాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు.



## కాత్యాయని అవతారంలో అమ్మవారి దర్శనం

**బాసర, ప్రభన్యూస్:** ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం 6 వ రోజు శ్రీ సరస్వతి అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు అమ్మవారికి ఉదయం మల్లె పుష్పార్చన చేసి రవ్వ కేసరి నైవేద్యం సమర్పించారు. ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకోడానికి వివిధ ప్రాతంల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి శివాలయంలో పూజలు చేసారు. అనంతరం ఆలయంలోని అక్షరభ్యాస మంటపంలో తమ చిన్నారులకు పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు.



## హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఆది దంపతులు

**శ్రీశైలం, ప్రభ న్యూస్:** జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.భూకైలాసంగా ప్రసిద్ధి గాంచిన శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ,మల్లికార్జున స్వామివార్ల నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి వివిధ అలంకారాలతో అలంకరించిన శేష వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అసీనులను చేసి అలంకృత అమ్మవారితో పాటు శ్రీశైల పురవీధులలో విహరిస్తు భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు స్వామి అమ్మవార్లను కనులారా వీక్షించి తరించారు.

**కాత్యాయణి అలంకరణలో భ్రమరాంబ**

నవదుర్గ అలంకరణలో అమ్మవారి ఉత్సవ మూర్తి కాత్యాయణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నవదుర్గ రూపాలలో 6వ రూపమైన ఈ దేవి చతుర్భుజాలను కలిగి కుడివైపు అభయ హస్తాన్ని,వరద ముద్రను అలాగే ఎడమ వైపు పద్మాన్ని, ఖడ్గాన్ని ధరించి ఉంటుంది. కాత్యాయణి దేవిని ఆరాధించడం వలన రోగ, శోక భయాలు తొలగిపోతాయని వేదాలు వర్ణిస్తున్నాయి.







### కేసీఆర్ వస్తారు... హామీలిస్తారు

తెరాస అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తే, ఈ నియోజకవర్గంలో నలభై ఏళ్లలో జరగని అభివృద్ధి 4సంవత్సరాల 3నెలల్లోనే చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. పులిచింతలను ముంచింది కాంగ్రెస్ పార్టీ అని, తేల్చేది టీఆర్ఎస్ అని ఆయన అన్నారు. ఈ జోష్ చూస్తే హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డి గెలుపు విజయోత్సవ ర్యాలీగా మారిందని కేటీఆర్ అన్నారు. అభివృద్ధి సంక్షోభం కావాలా, అభివృద్ధి కావాలో హుజూర్‌నగర్ ప్రజలు సుదీర్ఘంగా ఆలోచించుకోవాలన్నారు. హుజూర్‌నగర్‌లో ప్రధాన సమస్యలు త్వరలోనే ఈ నియోజకవర్గానికి రానున్న గులాబీ దళపతి కేసీఆర్ వాటిని పరిష్కరించే విధంగా హామీ ఇస్తారని ఆయన అన్నారు. మీ అమూల్యమైన ఓటు కారుగుర్తుపై వేసి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెరాస ఓటమికి కాంగ్రెస్-బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. ఇప్పటికే రెండు సార్లు హుజూర్‌నగర్ ప్రజలను ఓట్లు వేయించుకొని ఉత్తమ్ మోసం చేశారని, దశాబ్దాల కాలం నుంచి అధికారంలో ఉన్న గత ప్రభుత్వాలు ఈ నియోజకవర్గానికి ఏం చేశాయో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ సమస్యలపై ఏనాడైనా ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిని, జిల్లా మంత్రిని, జిల్లా సమావేశాలకు హాజరై విన్నవించిన దాఖలు ఉన్నాయా ప్రశ్నించారు. జానారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు పదవులు ముఖ్యం తప్ప ప్రజల సమస్యలు వారికి పట్టవన్నారు. నియోజకవర్గంలో టీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటికే రూ. 2వేల కోట్ల ఖర్చు చేసిందని ఆయన అన్నారు. ఈప్రాంతంలో ఏడు దశాబ్దాలుగా పాలించిన నాయకులు ఏనాడైనా రైతుల సంక్షేమం కోసం ఆలోచించిన దాఖలు ఉన్నాయా అని అన్నారు.

**ఆదర్శ పథకాలతో అభివృద్ధి**

కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, అవన్నీ దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆయన అన్నారు. 194 కోట్లతో పంటలకు పెట్టుబడి ఇచ్చిందన్నారు.దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రైతు బంధు ప్రవేశపెట్టడం ఎంతో అద్భుతం అన్నారు. రైతు చనిపోతే తెలంగాణలో బీమా ప్రీమియం ప్రవేశపెట్టి హుజూర్‌నగర్ లోనే రూ. 5లక్షల చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ. 20 కోట్ల నాలుగు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ అందించామన్నారు. గతంలో 9గంటలు, ఆరు గంటలు విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నిరంతర 24 గంటల విద్యుత్ కి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు. రుణమాఫీ విషయంలో 196 కోట్ల 23లక్షల రూపాయలు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రైతులకు అందించినట్లు తెలిపారు. 147కోట్లతో యాదవ్ కులస్థులకు 90లక్షల యూనిట్లను హుజూర్‌నగర్‌లో గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాధీముబారక్, పథకానికి 6వేల 83మందికి 33కోట్ల 43లక్షల రూపాయలు వివాహాలకు అందించినట్లు ఆయన తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ కిట్, ప్రసూతి మహిళలకు మగబిడ్డకు 12వేలు, ఆడ బిడ్డకు 13వేల చొప్పున ఈ నియోజకవర్గంలో 16వేల 5వందల63మందికి నాలుగు కోట్ల ఎనభై లక్షలు అందజేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా 112కోట్ల 70లక్షల తాగు నీరుకు ఖర్చు చేసినట్లు తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడు లేడని రాహుల్ గాంధీ ఎక్కడున్నాడో తెలియదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని ఓటర్లు ఆలోచించి ఓటు వెయ్యాలని కోరారు.






## చిల్లేపల్లిలో రూ.1.2కోట్లు స్వాధీనం

**నేరేడుచర్ల, ప్రభన్యూస్ :** సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద కారులో తరలిస్తున్న కోటి ఇరవై లక్షల రూపాయలు పట్టుకున్నారు. టోల్‌గేట్ వద్ద వాహనాలను శుక్రవారం తనిఖీ చేస్తున్న పోలీసులు మిర్యాలగూడ నుండి మేళ్ల చెర్వువైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో మూడు బస్తాలలో కోటి ఇరవై లక్షల రూపాయల నగదు ఉన్నట్లు గుర్తించారు. కారును, అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అందులో ఉన్న సిబ్బందికిఒకరికి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న గుర్తింపు కార్డు ఉంది. మిగిలిన వారు ప్రైవేట్ వ్యక్తులు కావడం,

**పోస్టల్‌శాఖ నిధులుగా గుర్తింపు.. తిరిగి అప్పగింత**

సెక్యూరిటీ లేకపోవడంతో అనుమానం వచ్చిన తహసిల్దార్ కలీల్ అహ్మద్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం నేరేడుచర్ల ఎస్ఐ యాదవేందర్ రెడ్డి నగదు విషయంపై విచారణ చేశారు. పోస్టల్ డిపార్టమెంట్ సూపరింటెండెంట్ జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఆ నగదు పోస్టల్ శాఖకు సంబంధించిటందని లేఖ పంపారు. కలెక్టర్ నుంచి ఫోన్ ద్వారా తహసీల్దార్‌కు సమాచారం రావడంతో ఆ లేఖ మీద పోస్టల్ సిబ్బంది సంతకాలు తీసుకొని రాత పూర్వక హామీ అనంతరం నగదు విడుదల చేశారు.

# హుజూర్‌నగర్‌లో ఓట్ల చీలిక!

- స్వతంత్రుల పోటీతో మారిన స్వరూపం
- లాభ, నష్టాలపై పార్టీల బేరీజు
- తమకే లాభమంటున్న కాంగ్రెస్, టీఆర్ఎస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజకీయ పార్టీలకు.. స్వతంత్ర అభ్యర్థులు దడపుట్టిస్తున్నారు. ఎక్కువ మంది బరిలో ఉండటంతో తమకంటే తమకే లాభమని బయటికి చెబుతున్నా.. లోనమాత్రం ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్ర ఆందోళనపడుతున్నారు. కులాల వారీగా ఓట్ల శాతంపై లెక్కలు వేసుకుంటున్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, టీడీపీ, బీజేపీతో పాటు మొత్తం 28 మంది బరిలో ఉన్నారు. వీరిలో 15 మంది అభ్యర్థులు స్వంతంత్రులుకాగా మిగిలినవారు వివిధ రాజకీయ పార్టీల గుర్తుపై బరిలో నిలిచారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంటున్నప్పటికీ టీడీపీ, బీజేపీ కూడా దాదాపు 10వేలకు పైగా ఓట్లు సాధించుకుంటాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇక మిగిలిన పార్టీలు కూడా దాదాపు వెయ్యి నుంచి 2వేల ఓట్ల వరకు సాధించుకునే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అభ్యర్థులందరూ స్థానిక సమస్యలనే గురిపెట్టి.. సోషల్ మీడియా వేదికగా కూడా ప్రచారం చేస్తున్నారు. వీరితో ఎవరి ఓట్లకు గండిపడుతుందో అన్న భయం ప్రధాన పార్టీల్లో నెలకొంది. స్వతంత్రులు... టీఆర్ఎస్ ఓటు బ్యాంకునే చీల్చుతారని కాంగ్రెస్.. కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను చీల్చుతారని టీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. బీజేపీ, టీడీపీ కూడా సవాల్‌గా తీసుకున్నాయి. కొంత మంది స్వతంత్రులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. నయానో.. బయానో విదిల్చి మద్దతు కూడగట్టుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు.

**కులాల వారీగా ఓట్ల లెక్కలు..!**

హుజూర్‌నగర్‌లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల నాయకులు తమ పార్టీకున్న సంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు కులాల పరంగా ఓట్ల శాతంపై ఫోకస్ పెట్టారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు సైదిరెడ్డి, పద్మావతిలు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కాగా.. బీజేపీ అభ్యర్థి రామారావు పెరిక, టీడీపీ అభ్యర్థి కిరణ్మయి కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు. స్వతంత్రులు మాత్రం తమ కులానికి చెందిన ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు తమ రెడ్డి సామాజిక వర్గం ఓట్లతో పాటు ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లపై దృష్టి సారించాయి. బీజేపీ నుంచి బీసీ సామాజిక (పెరిక) వర్గం నుంచి పోటీ చేస్తున్న రామారావు పార్టీ ఓట్లతో పాటు బీసీల ఓట్లపై గురిపెట్టారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారు మెజార్టీగా టీఆర్ఎస్‌వైపు ఉన్నారని, ఇప్పుడు ఎటు వైపు మొగ్గు చూపుతారోననే చర్చ జరుగుతోంది. ఇక కమ్మ సామాజిక వర్గం ఓట్లు కూడా ఈసారి మెజార్టీగా టీడీపీ అభ్యర్థికే పడే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక టీడీపీ అభిమాన ఓట్లు కూడా సైకిల్‌కు పడే అవకాశం ఉందని అంటున్నారు. బీసీ, ఎస్సీ ఓట్లను దక్కించుకునేందుకు అందరూ పోటీ పడుతున్నారు. మాదిగలకు మంత్రి వర్గంలో చోటివ్వకుండా కేసీఆర్ రాజకీయ వివక్షత కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. సీపీఎం అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురి కాగా.. ఇప్పుడు ఏ పార్టీకి మద్దతు ఇస్తున్నదనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

**హుజూర్‌నగర్‌లో మేమే గెలుస్తాం**

**పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్**

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని జనసేన పార్టీకి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంత రావుతో పాటు ఆ పార్టీ నేతలు బొల్లు కిషన్, లక్ష్మణ్‌యాదవ్‌లు జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అందుబాటులో లేకపోవడంతో.. నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. పవన్‌తో చర్చించి నిర్ణయం చెబుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కి జనసేన మద్దతు ఇస్తుందనే నమ్మకం ఉందన్నారు. జనసేన మద్దతుతో మరింత బలపడుతుందని, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



## సూర్యాపేట ఎస్పీపై ఈసీ బదిలీ వేటు

### ఎన్నికల ఖర్చు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి నియామకం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. సూర్యాపేట జిల్లా ఎస్పీపై బదిలీ వేటు వేయడంతో పాటు ఉప ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ కోసం పదవీ విరమణ పొందిన ఐఆర్ఎస్ అధికారిబాలకృష్ణన్‌ను ప్రత్యేకాధికారిగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా అధికార పార్టీకి వత్తాసు పలుకుతోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్పంచుల సంఘం నేతలను నామినేషన్లు దాఖలు చేయకుండా పోలీసులే తప్పుడు కేసులు బనాయించి అడ్డుకున్నారని ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని ఎస్పీని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఎలాంటి ఎన్నికల సంబంధ బాధ్యతలు అప్పగించరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన స్థానంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆర్. భాస్కరన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నిష్పక్షపాతంగా చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా ఎస్పీని బదిలీ చేయడం హర్షనీయమని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

## అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

### హుజూర్‌నగర్‌లో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** రాష్ట్రంలో నిరంకుశ పరిపాలన కొనసాగుతోందని, ప్రజల పక్షాన అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జనసమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

## అంతిమ కాంతులు

చెడుపై విజయం సాధించినందుకు గుర్తుగానే కదా విజయదశమి (దసరా) నిర్వహించుకుంటాం. దసరా అంటేనే దశ (పది) చెడు లక్షణాలను హర (సంహారం) తుదముట్టించడమే ఈ పండుగలోని రహస్యం. రావణుడి పది తలలు కూడా ఈ పది చెడు లక్షణాలకు సంకేతం. అందుకే విజయదశమి రోజున రాత్రి మనదేశంలో పలుచోట్ల రావణదహనం పేరిట రాక్షసరాజు బొమ్మను అమర్చి, అందులోని బాణాసంచాను పేల్చి కాల్చేస్తారు. అందులోభాగంగానే ఇదుగో చండీగఢ్ శివార్లలో గురువారం ఈ 221 అడుగుల రావణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భారీ క్రేన్ల సాయంతో తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఆ బొమ్మకు విద్యుద్దీప అలంకరణ కూడా చేశారు. ఈ వెలుగులన్నీ మరో రెండురోజులు. ఆ తరువాత ఆ బొమ్మను దహనం చేస్తారు. ఆ వేడుకను వేలాదిమంది చూసి ఆనందించడం దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఓ భక్తిభావరస ఘట్టం.



## పెట్రోసారస్ వచ్చింది!

దాదాపు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఈ భూమిపై జీవించిన రాకాసిబల్లుల జాతికి చెందినవి, వాటికన్నా 9 కోట్ల సంవత్సరాల ముందు ఈ భూమ్మీద మనుగడ సాగించినవి అయిన పెట్రోసారస్ రాకాసి బల్లుల ప్రతిరూపం ఇది. ఓ కళాకారుడి సృజనతో రూపొందిన ఈ 13 అడుగుల రెక్కల డైనోసార్ అతి భయంకరమైనది. గొర్రెలను, సముద్రంలో తిరిగే భారీ జలచరాలను ఎత్తుకుపోయి, ఇనుపముల్లలాంటి పళ్లతో చీల్చి తినేయడం దీని అలవాటు. కొద్దికాలం క్రితం (క్వీన్స్ లాండ్ లోని వింటన్‌లోవీటి ఆనవాళ్లు... ఆస్ట్రేలియాలోని కొన్ని గొర్రెల పెంపకం సాగే భూముల్లో లభించాయి. పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయి. ఇదిగో ఇప్పుడు ఓ కళాకారుడు వాటి రూపాన్ని ఊహించి ఇలా ఓ కళాఖండాన్ని రూపొందించి ఆస్ట్రేలియాలోని గొర్రెల పెంపక కేంద్రంలో ఇలా ఎగిరేలా ఏర్పాట్లు చేశారు.



## యుద్ధ సన్నాహమే కానీ..

యుద్ధ సన్నివేశాల్లో యుద్ధ ట్యాంకులు ఇలా వరుసకట్టి వెళ్లడం మనం చాలా సినిమాల్లోనూ, ఇరాక్-సంకీర్ణ సేనల యుద్ధంలోనూ చూశాం. ఎప్పుడో దశాబ్దాల క్రితం అఫ్గానిస్తాన్ నుంచి రష్యా బలగాల ఉపసంహరణ సమయంలోనూ ట్యాంకుల క్యూ కట్టడం చాలామందికి గుర్తు. కానీ ఇక్కడ అలా క్యూ కట్టింది ట్రాక్టర్లు. యుద్ధం చేస్తున్నది రైతులు. ప్రభుత్వం తీసుకున్న పర్యావరణ, వ్యవసాయ వ్యతిరేక విధానాలపై ఇలా నిరసన తెలిపారు. ది హేగ్‌లో ఈ నిరసనలతో ప్రపంచం దృష్టిని రైతులు ఆకర్షించారు. ది హేగ్ నగరంలోని హూగెవీన్-మెప్పెల్ ఎ-28 రహదారిపై ఇలా ట్రాక్టర్లతో వారు నిరసనకు దిగారు.



## ఓయ్.. ఫోటో ఎందుకు తీస్తున్నావ్!

మంచుతో కప్పుకుపోయిన ఈ ఇసుకతిన్నెలపై ఆహారాన్వేషణకు ప్రయత్నిస్తూ వింత భంగిమతో కనిపించిన ఈ గుడ్లగూబను చూస్తే... ఏయ్ ఎందుకు నా ఫొటో తీస్తున్నావ్ అని అరుస్తున్నట్లుంది కదూ. ప్రపంచ స్థాయి కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీకోసం వచ్చిన ఎంట్రీల్లో ఇదొకటి. అసలు గుడ్లగూబలు మనిషి కంటబడటమే అరుదు. పైగా ఇంత తీరికగా, ఇంత విభిన్నమైన భంగిమల్లో కనిపించడం మరీ అరుదు. ఇంతకీ అసలు విషయం చెప్పలేదు కదూ... వికీ జౌరాన్ అనే ఫొటోగ్రాఫర్ ఈ అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించాడు.





## మాపైనా మాంద్యం దెబ్బ.. ఉదారంగా సాయమందించండి

# నిధులిస్తే... నిలదొక్కుకుంటాం

- వినూత్న పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచాం
- మాంద్యం నుంచి తేరుకోకపోతే వెనకబడతాం

- సాధారణ పద్దులు ఆపొద్దు.. వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలి
- పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని పూర్తిగా అమలు చేయండి
- ఐఐఎస్ఈఆర్, ఎన్ఐడీ సంస్థలు నెలకొల్పండి
- 12శాతం ప్రత్యేక రిజర్వేషన్లు మాకు అవసరం
- భగీరథ, కాకతీయ పథకాలకు నిధులివ్వండి
- మా సాగునీటి పథకాలకు జాతీయహోదా మరచిపోవద్దు
- హైదరాబాద్ విస్తరణ నేపథ్యంలో రక్షణ సంస్థల అనుమతి ఇప్పించండి
- ప్రధాని మోడీకి సీఎం కేసీఆర్ విజ్ఞప్తి
- రాష్ట్ర స్థితిగతులపై 50 నిమిషాలపాటు ప్రత్యేక భేటీ
- 22 అంశాలపై ఇదివరకు రాసిన లేఖలు, తాజా ప్రతిపాదనలు అందజేత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం ప్రభావం తెలంగాణపై కూడా ఉందని, ఈ పరిస్థితుల్లో ఉదార వైఖరితో ఆదుకోవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రధాని నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ఆర్థికస్థితిగతులు, ప్రతిష్ఠాత్మక పథకాల అమలు, వాటి ప్రగతి, నిధుల అవసరంపై ప్రధానిని కలిసి ప్రత్యేకంగా చర్చించారు. సుమారు 50 నిమిషాల పాటు ఈ ప్రత్యేక సమావేశం జరిగింది. పరిపాలనా పరమైన అంశాలే

**ఇవీ మా వినతులు**

జాతీయ రహదారుల అథారిటీ సహకారంతో ఆదిలాబాద్ జిల్లాలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమను పునరుద్ధరించాలని, తద్వారా వందలాది మంది ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశంపై స్పందించాలని పదేపదే కోరినా, లేఖలు రాసినా ఇప్పటి వరకు స్పందన రాలేదని ప్రధాని ముందు ఆవేదన వ్యక్తంచేశారు. విభజన నేపథ్యంలో ఏర్పడిన తెలంగాణ హైకోర్టులో ప్రస్తుతం జడ్జీల సంఖ్య 24గా ఉందని, దీన్ని 42 కు పెంచాలన్న ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ఈ అంశంపై కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు. విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను మంజూరుచేసి తక్షణమే నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమ రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)ను మంజూరు చేయాలన్నారు.

పారిశ్రామిక, ఐటీ రంగాల్లోనే కాకుండా ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)ని కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పునర్‌విభజన ప్రక్రియ పూర్తయిన అనంతరం హైదరాబాద్‌లో ఎన్ఐడీని విశాఖపట్టణానికి తరలించారని, తిరిగి మరో ఎన్ఐడీని రాష్ట్రంలో నెలకొల్పాలని కోరారు. అన్ని జిల్లాల్లో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని, ఆ ప్రకారం మన రాష్ట్రంలో 23 నవోదయ పాఠశాలలు అవసరమని ప్రధానికి అందజేసిన ప్రత్యేక లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తిచేయాలని, రైల్వే పనులకు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నీతి ఆయోగ్ సిఫారసులకు అనుగుణంగా దేశ ప్రతిష్ఠను పెంచిన మిషన్ కాకతీయ పథకానికి రూ.5వేల కోట్లు, అదే స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన మరో పథకం మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు విడుదల చేయాల్సిందిగా మరో లేఖలో కోరారు. దేశంలోనే అతి పెద్ద ఇనుప ఖనిజ సంపద నెలకొని ఉన్న బయ్యారంలో కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నెలకొల్పాలని, అందుకోసం కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖకు ఆదేశాలు ఇవ్వాలని ప్రధానితో సీఎం కేసీఆర్ అన్నారు. అలాగే జహీరాబాద్ నిమ్జ్ సంస్థకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ అవశ్యమని స్పష్టంచేశారు. తాము పంపిన ఈ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కాకుండా రాష్ట్ర రాజకీయాలపైనా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు విశ్వ సనీయంగా తెలు స్తోంది. మొత్తం 22 అంశా లపై గతం లో రాసిన లేఖల ను ప్రధాని మోడీకి మరోసారి అందజేశారు. దేశం గర్వించదగిన తరహాలో అభివృద్ధి, సంక్షేమ రంగాలను ముందుకు నడిపించి పరిపాలనా పరంగా అగ్రస్థానంలో నిలిచిన తమ రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. ప్రతిష్ఠాత్మకమైన పథకాలను మరింత సమర్ధ వంతంగా అమలు చేసేందుకు ఉదారంగా నిధులు ఇవ్వాలని కోరారు. అలా గే ఆంధ్ర ప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని పార ద ర్శకంగా అమలుచేసి రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజ నాలను పరిరక్షించాలని, అదే సమయంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర మైనందున వెనకబడిన జిల్లాల అభివృద్ధికి వెనువెంటనే నిధులు విడుదల చేయాలని కేసీఆర్ కోరారు. చట్టం సూచించిన ప్రకారం తెలంగాణకు వెనకబడిన జిల్లాల అభివృద్ధి కోటా కింద ప్రతియేటా రూ.450 కోట్లు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. అయితే గత ఐదేళ్లలో నాలుగుసార్లు ఈ నిధులు విడుదలైనప్పటికీ ఇంకా ఒక ఏడాదికి రావలసిన మొత్తం రాలేదన్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గుర్తించి తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలన్నారు.

### రిజర్వేషన్లు పెంపు అవసరం

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీని నెలకొల్పాలని, ఇది ఆ ప్రాంత ప్రజల కల అని, తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ అని పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికీ కొన్ని వర్గాల్లో తీవ్రమైన పేదరికం నెలకొని ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు పెంచేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలన్నారు. ప్రధానంగా ముస్లిం మైనారిటీలు తెలంగాణలో వెనకబడి ఉన్నారని, ఆ కులాలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు మొత్తం 37 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే రాజ్యాంగం పరిధిలో ముస్లిం మైనారిటీలకు కూడా 12 శాతం రిజర్వేషన్లు అందుతాయన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఈ విష యంలో ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీ తీర్మానంచేసి పంపిందని గుర్తుచేశారు. తమ రాష్ట్రం నుంచి పంపిన తీర్మానాలు, ప్రతిపా ద నలు, విజ్ఞప్తులు, లేఖలను పరిశీలించి వాటిపై సానుకూల దృక్ప థం తో నిర్ణయం తీసుకోవాలని ప్రధానితో కేసీఆర్ పునరుద్ఘాటించారు.

ఈ ప్రతిపాదనలతో పాటు రాష్ట్రంలో కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులు, కారిడార్లపైనా దృష్టి పెట్టాలని కేసీఆర్ వాటిపై ప్రత్యేక ప్రతిపాదనలు అందజేశారు. వరంగల్-నాగ్‌పూర్, వరంగల్-హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తే రాష్ట్రం మెరుగైన ఫలితాలు సాధిస్తుందన్నారు. ఇప్పటికే పెట్టుబడులకు కేంద్ర బిందువైన తెలంగాణ రహదారుల విస్తరణ, అభివృద్ధితో ఆర్థికాభివృద్ధివైపు దూసుకుపోతోందన్నారు. వెనకబడిన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ద్వారా రూ.4వేల కోట్లు రాష్ట్రానికి మంజూరు చేయాలన్నారు.

వామపక్షతీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు ఇవ్వాలన్నారు. ఈ ప్రాంతాల్లో ఇప్పుడున్న ప్రకారం 60:40 నిష్పత్తిలో కాకుండా వందశాతం కేంద్ర నిధులతోనే రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ తరహాలో పూర్తి కేంద్ర ప్రభుత్వ వ్యయంతోనే వరంగల్‌లో గిరిజన యూనివర్సిటీని నెలకొల్పాలని విజ్ఞప్తి చేస్తూ కేసీఆర్ మరో ప్రతిపాదనను అందజేశారు. అలాగే వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కు కోసం రూ.1000 కోట్ల మొత్తాన్ని గ్రాంట్‌గా మంజూరు చేయాలని, ఈ నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్ గా పరిగణించాలని కోరారు. స్థానికంగా ఉన్న అత్యంత పురాతన కట్టడం చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని, వరద కాలువలకు సవ రించిన అంచనాల ప్రకారం నిధులు విడుదల చేయాలని ఫలితంగా లక్ష్యానికి మించిన ఆయకట్టు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. తమ రాష్ట్రం తర పున అందించిన అన్ని ప్రతిపాదనలు న్యాయబద్ధమైనవని, ఏ ఒక్క దాన్నీ పక్కన పెట్టకుండా సానుకూల దృక్పథంతో నిర్ణయం తీసుకో వాలని ఈ భేటీ సందర్భంగా కేసీఆర్ ప్రధానితో పదే పదే అన్నారు.



### అమిత్ షా, రాజ్‌నాథ్‌తోనూ భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రత్యేక అజెండాతో ప్రధాని నరేంద్రమోడీని కలిసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అనంతరం హోంమంత్రి అమిత్ షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టం అమలుపై అమిత్ షాకు నివేదికను సమర్పించారు. ఐదేళ్ళు పూర్తయినా నేటికీ పూర్తిస్థాయిలో తమకు ప్రయోజనాలు దక్కడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. షెడ్యూల్ 9, 10లలో పేర్కొన్న సంస్థల విభజన, మానవ వనరుల సమకూర్పు, సకాలంలో నిధుల విడుదల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాల్సిందిగా కోరారు.



### రక్షణశాఖ భూములను ఇవ్వండి

తెలంగాణలో రాజీవ్ రహదారి విస్తరణకు రక్షణ శాఖకు చెందిన భూములు ఇవ్వాలని తెలంగాణ సీఎం కేసీఆర్ రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కోరారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లిన సీఎం కేసీఆర్ రాజ్ నాథ్ కు వినతి పత్రం అందజేశారు. రాజీవ్ రహదారి విస్తరణకు కంటోన్మెంట్ భూములను తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఎం కేసీఆర్ తో పాటు ఎంపీలు కే కేశవరావు, సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.ఈ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా సీఎం కేసీఆర్ హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు.ఈ పర్యటనలో సీఎం కేసీఆర్ వెంట ఎంపీలు కేశవరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, లింగయ్య యాదవ్, బండ ప్రకాష్, సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి అజెండా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీతో ఢిల్లీలోని 7 కళ్యాణ్‌మార్గ్‌లోని ఆయన నివాసంలో జరిగిన భేటీలో దాదాపు ఇవే అంశాలపై విజ్ఞప్తులు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నా, మనదేశంలో ప్రజలు ఇంకా ప్రాథమిక అవసరాలు తీరకుండా ఉన్నారని గతంలో మేధావులతో జరిగిన భేటీలో ప్రకటించిన సీఎం కేసీఆర్ తాజాగా ప్రధానితో సమావేశంలోనూ అనేక అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది.

### ఫెడరల్ స్ఫూర్తి ఏదీ?

మౌలిక సదుపాయాల కల్పన, అనేక రాష్ట్రాల మధ్య జల వివాదాలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచడంలేదని, ఏపీ, తెలంగాణల నడుమ నదుల అనుసంధానానికి సహకరించాలని కోరినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయంలో కూడా అనేక కమిషన్లు, నిపుణులు సూచించిన సంస్కరణలు అమలు కాకుండా, ఫెడరల్ స్ఫూర్తి పూర్తిస్థాయిలో ప్రతిబింబించడంలేదని సీఎం కేసీఆర్ అభిప్రాయంగా ఉంది. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల్లో తెలంగాణ రాష్ట్రం అనేక మైలు రాళ్లను అధిగమించి ఇతర రాష్ట్రాలకు, కేంద్రానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శంగా నిల్చిన తీరు అనేక సందర్భాల్లో ప్రశంసలకు కారణమయ్యాయి. ఈ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయడంతోపాటు, ఇంకా ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ తరహాలో కార్యక్రమాల రూపకల్పన జరగాలని, అనేక



అంశాలు ఉమ్మడి జాబితా అమలులో ఉండటంవల్ల ఒకే శాఖకు చెందిన వేర్వేరు పథకాలు, కార్యక్రమాలు అమలవుతూ అయోమయానికి కారణమవుతున్నాయని తెలంగాణ ప్రభుత్వం మొదటినుంచీ చెబుతోంది. దీంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు వస్తున్నాయని, వీటిని సంస్కరించాల్సిన అవసరం ఉందనేది సీఎం ఆలోచనగా ఉంది.

రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రాలకు అధికారం ఉండాలని గత కొంతకాలంగా సీఎం కేసీఆర్ డిమాండ్ చేస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు వేర్వేరు సామాజిక పరిస్థితులున్నాయని, వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అనేక సందర్భాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ అంశంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం కావాలని ఆయన కోరుతున్నారు. న్యాయ వ్యవస్థ, పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థల్లోనూ మార్పులు రావాలని ఆయన ఆలోచనగా గతంలో జాతీయ స్థాయిలో వినిపించారు. తాజాగా రాష్ట్రంలో ఎస్సీ ఏబీసిడి వర్గీకరణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా ఈ సందర్భంగా ప్రధాని మోడీతో చర్చించారు.

# హైదరాబాద్ జోష్ కేటీఆర్ భేష్

- పరిశ్రమలకు అనువైన వేదిక ఇది
- ఇక్కడ అడుగుపెట్టిన ప్రతీ సంస్థా దూసుకుపోతోంది
- పెట్టుబడులకు ప్రపంచంలోనే మేలైన నగరం హైదరాబాద్
- యువమంత్రి కేటీఆర్ చొరవతోనే ఇదంతా సాధ్యమవుతోంది
- ఇవాంకా సమ్మిట్ సమయంలోనే ఆయన సామర్థ్యం చూశా
- నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ ప్రశంసల వర్షం
- తయారీ యూనిట్‌లకు మమ్మల్నే సంప్రదించండి: కేటీఆర్
- సెమీ కండక్టర్ తయారీ దిగ్గజం మైక్రాన్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం




మైక్రాన్ సంస్థ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** పారిశ్రామిక, ఐటీ సంస్థల ఏర్పాటుకు హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే అనువైన నగరమని, ఇక్కడ అడుగుపెట్టిన ప్రతీ సంస్థ అద్భుతమైన ప్రగతి సాధించాయని నీతిఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) సీఈఓ అమితాబ్ కాంత్ అన్నారు. హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందడానికి యువమంత్రి కేటీఆర్ చొరవ, కార్యదక్షత కారణమని ప్రశంసించారు. భవిష్యత్‌లో హైదరాబాద్ మరింత కీలకంగా మారనుందని జోస్యం చెప్పారు. ఆయన ప్రసంగంలో పలుమార్లు హైదరాబాద్‌ను ప్రస్తుతిస్తూ కేటీఆర్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ఆయన ఈ ప్రస్తావనలు చేసినప్పుడల్లా అటు ప్రేక్షకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేయగా మంత్రి కేటీఆర్ భావోద్వాగానికి గురయ్యారు. ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద సెమీకండక్టర్ తయారీ సంస్థ మైక్రాన్ నగరంలోని నాలెడ్జి సిటీ స్కైవ్యూ టవర్‌లో ఏర్పాటు చేసిన తన గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం మంత్రి కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన అమితాబ్ కాంత్ ప్రసంగిస్తూ పెట్టుబడులు పెట్టడానికి, వివిధ సంస్థలు తమ కేంద్రాలను ఏర్పాటుకు హైదరాబాద్‌ను మించిన మెరుగైన ప్రాంతం ప్రపంచంలో మరోటి లేదన్నారు. పరిశోధన, సేవల అభివృద్ధి, ఇన్నోవేషన్ అంశాలలో ఇక్కడి సంస్థల ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమాణాలున్నా యన్నారు. ట్రిబుల్ ఐటీ, ఐఐటీతో సహాపలు అంతర్జాతీయ విద్యాకేంద్రాల ు ఇక్కడ ఉండటం వల్ల అత్యుత్తమ నైపుణ్యత, నిపుణులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం 18 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న మైక్రాన్‌కు రాబోయే రోజుల్లో భారతదేశమే కీలక కానుందని, అందులో మరీ ప్రధానంగా హైదరాబాద్ పాత్ర కీలకంగా ఉండబోతుందనటంలో అతిశయోక్తి లేదని జోస్యం చెప్పారు. మైక్రాన్ హైదరాబాద్ ను ఎంచుకోవటాన్ని అభినందిస్తూ ఇక్కడికి వచ్చే కంపెనీలను దగ్గరుండి ప్రోత్సహించే సమర్థవంతమైన యువ మంత్రి కేటీఆర్ అని ప్రశంసించారు. గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ పాల్గొన్న గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సమ్మిట్ కోసం మంత్రి కేటీఆర్‌తో కలిసి పనిచేసిన అనుభవంతో ఇలా చెప్తున్నానని, ఆ కార్యక్రమం విజయవంతం కావటంలో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేటీఆర్ గత ఐదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమ రంగాన్ని కదం తొక్కిస్తున్నారని వివరించారు. గత ఐదేళ్లుగా దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని వివరించారు. 30 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి విముక్తి కలిగిందన్నారు. గత ఐదేళ్లలో సాధించిన డాటా విప్లవంతో మరిన్ని అద్భుతాలు జరుగనున్నాయన్నారు. అమెరికా, చైనా, యూరప్ వంటి దేశాలతో పోల్చితే ఇక్కడి మొబైల్ డాటా అత్యంత చౌకగా ఉందన్నారు. ఇక్కడి వందకోట్ల జనాభా ఉపయోగించే మొబైల్ ఫోన్ల వల్ల రానున్న రోజుల్లో డేటా రాంగంలో అపారమైన అవకాశాలు ఏర్పడుతా యన్నారు. డాటా విప్లవం, డిజటలీకరణతో 99.8శాతం పన్ను చెల్లింపు ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. 96శాతం డిజటలైజేషన్ జరిగిందన్నారు. ఏకరీతి పన్నువిధానం తేవటం, ప్రపంచంలోనే అత్యంత చౌకగా 15శాతం కార్పొరేట్ పన్నును నిర్ధారించటం పారిశ్రామిక రంగానికి వరంగా ఉందన్నారు. 600 కేంద్ర ప్రభుత్వ పథకాలు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తు న్నాయన్నారు. రానున్నరోజుల్లో కాగితం లేకుండానే కార్యకలాపాలు జరుగనున్నాయని వెల్లడించారు. 500 మిలియన్ల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ సేవలందాయని అన్నారు.

## ముందుకు రండి ప్రోత్సహిస్తాం

- మైక్రాన్ గ్లోబల్ సెంటర్ ప్రారంభంలో మంత్రి కేటీఆర్ పిలుపు

హైదరాబాద్ సహా రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని, టెక్నాలజీ హబ్ గా మారుతున్న హైదరాబాద్‌ను ఎంచుకున్న మైక్రాన్, సెమీ కండక్టర్ల తయారీ యూనిట్ కూడా పెడితే దగ్గరుండి ప్రోత్సహిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మైక్రాన్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మైక్రాన్ సంస్థ కండక్టర్ల తయారీ యూనిట్‌ను పెట్టాలన్న ప్రతిపాదన ఉంటే ముందు తమనే సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెఫ్ వెరోల్, హెచ్.ఆర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆప్రిల్ ఆరెంజన్, మైక్రాన్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీ మూనీ ,టెక్నాలజీ,ప్రోడక్ట్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ డిబోయర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తూ నగరాన్ని అన్నివిధాలా ముందుంజలో నిలబెడుతున్నామన్నారు. బెంగళూరును మరిచేలా ఇక్కడి సదుపాయాలు, సహకారం ఉంటుందని మైక్రాన్ యాజమాన్యానికి భరోసా ఇచ్చారు.



### ప్రగతిభవన్‌లో వైభవంగా బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ ఏర్పాటైన అనంతరం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బతుకమ్మ పండుగ సంబురాలు శుక్రవారం ముఖ్యమంత్రి అధికార నివాసంలో ఘనంగా జరిగాయి. మహిళా మంత్రులు, వివిధ స్థాయి ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులతో ప్రగతి భవన్‌లో కేసీఆర్ సతీమణి శోభ, కుమార్తె కవిత తదితరులు ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. తీరొక్క పూలు తెచ్చి బతుకమ్మలను అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలతో ఆటలాడారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 5 అక్టోబర్ 2019

## ఆర్టీసీ సమ్మె.. సమ్మెట!

ఈ దసరా పర్వదినం తెలుగు ప్రజలకు చేదు అనుభవాన్ని మిగల్చబోతున్నది. టీఎస్ఆర్టీసీ సమ్మెకి దిగింది. దశలవారీ చర్చలు విఫలమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీనుంచి వచ్చీరాగానే హుటాహుటిన ప్రగతిభవన్‌లో త్రిసభ్య కమిటీతో సమీక్షించారు. పండగవేళ ఆర్టీసీ కార్మికులు సమ్మెకి దిగాలనుకోవడమే సరికాదంటూ సీఎం కేసీఆర్ ఆగ్రహం వెలిబుచ్చారు. సమ్మెపై కఠినంగానే ఉండాలని నిర్ణయించారు. ఇక అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది. ఆర్టీసీ ఉద్యోగులకు శనివారం పెద్ద పరీక్ష ఎదురవుతున్నది. సాయంత్రం ఆరింటిలోగా విధులకు హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వం హుకుం జారీ చేసింది. అలా రిపోర్టు చేయనివారందరూ ఆర్టీసీ ఉద్యోగులుగా పరిగణనలోకి రారు. అంటే ఆటోమేటిక్‌గా వారి ఉద్యోగాలు పోతాయన్న మాట. దీనికి ఆర్టీసీ సిబ్బంది ప్రతిస్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యానికే పెద్దపీట వేసినట్టు దీన్నిబట్టి అర్ధమవుతున్నది. అత్యంత ముఖ్యమైన బతుకమ్మ, దసరా పండుగల సమయాన్ని సమ్మెకు ఎంచుకోవడం పట్ల ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. రెండు మూడు రోజులుగా జరుగుతున్న చర్చలు ఎప్పటికప్పుడు ఆశాజనకంగా కనిపించినా, చివరకు ఉభయ పక్షాలు తమతమ వాదనలకే కట్టుబడి ఉండటంతో చివరిదఫాగా శుక్రవారం మధ్యాహ్నం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. పండుగ రోజుల్లో ఆర్టీసీకి ఎంత డిమాండు ఉంటుందో తెల్సిందే. ఆదాయం కూడా ఎక్కువ వస్తుంది. ఆర్టీసీ సిబ్బంది తమ నిరసనలకు, అసంతృప్తులు వెళ్లబుచ్చుకోవడానికి పండగ సమయాలను ఎంచుకోవడానికి ఇదే కారణం. ప్రజాసేవే పరమార్ధమని ప్రకటనలతో ప్రజలను ఆకర్షించే ఆర్టీసీ సిబ్బంది ప్రజలకు ఎక్కువ అవసరమున్న సమయాలనే సమ్మెలకు ఎంచుకోవడం విషాదమే. ఈ వ్యవహారంలో సహజంగానే రెండు పక్షాలుంటాయి. ఒకపక్షం ఆర్టీసీ సిబ్బంది అయితే, రెండో పక్షం యాజమాన్యం. ఇది రాష్ట్ర ప్రభుత్వంతో ముడిపడి ఉంటుంది. ఇందులో రాష్ట్రప్రభుత్వ ప్రత్యక్షప్రమేయం ఉండదు గాని దాని పర్యవేక్షణ ఉంటుంది. అందుకే ఈ సమ్మె విషయంలో రాష్ట్ర కేబినెట్ సకాలంలో స్పందించి ఒక కమిటీ వేసింది. ఆ కమిటీలో ముగ్గురు ఐఎఎస్ అధికారులున్నారు. ఇది సకాలంలో చేసిన ఏర్పాటు అంటే ఆర్టీసీ సిబ్బంది అంగీకరించకపోవచ్చు. ఎందుకంటే తమ సమస్యలు ఇప్పటికిప్పుడు వచ్చినవి కావన్నది వారి వాదన. 2017 ఏప్రిల్ నుంచి జరగాల్సిన వేతన సవరణ ఇంతవరకు జరగలేదన్నది వారు గుర్తు చేస్తున్నారు. పాత సమస్యలు అలాగే ఉండగా కొత్తగా మరొక సమస్య వచ్చింది. సమస్య అంటే రాష్ట్ర ప్రభుత్వ కోణంలో సమస్య. ఆర్టీసి సిబ్బందికి అది వరం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనేదే ఆ అంశం. టీఎస్ఆర్టీసీ జేఏసీ ప్రధాన డిమాండు ఇదే. అవతల పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కొత్తగా అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడంతో సహజంగానే తెలంగాణా ఆర్టీసీ సిబ్బందిలోనూ అలాంటి ఆశలు చిగురించాయి. అక్కడ సాధ్యమైనది ఇక్కడెందుకు సాధ్యం కాదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీగా ఉన్న సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఆస్తుల పంపకాల వంటి విభజన సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. టీఎస్ఆర్టీసీగా ఆవిర్భవించిన తెలంగాణ రోడ్డు రవాణాసంస్థ ఆరేళ్లు గడిచినా అవే సమస్యల్లో మునిగి తేలుతున్నది. ప్రభుత్వం నుంచి తమ సంస్థకు రావాల్సిన బకాయిల మొత్తం విలువ రెండు వేల కోట్ల రూపాయలు ఉంటుందని, వాటిని చెల్లిస్తే సంస్థకు నష్టాల ఖర్మేందుకని ఆర్టీసీ కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ప్రస్తుత విషయానికొస్తే ఆర్టీసీ కార్మికులు మొత్తం మీద 26 డిమాండ్లు యాజమాన్యం ముందుంచారు. నాలుగైదు మినహా మిగతా వాటిమీద ప్రభుత్వానికి గాని యాజమాన్యానికి గాని పెద్దగా అభ్యంతరాల్లేవని తెలుస్తున్నది. ముందుగా విలీనం అంశాన్ని తేల్చాలని కార్మికసంఘాలు పట్టుబడుతున్నాయి. వారు కోరుతున్నట్టు సంస్థని ప్రభుత్వంలో విలీనం చేస్తే ఉద్యోగులందరూ నేరుగా ప్రభుత్వోద్యోగులు అవుతారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలు వస్తాయి. ట్రెజరీల ద్వారా జీతాలు అందుకునే అవకాశం వస్తుంది. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ఇతర డిమాండ్లన్నీ ఒక ఎత్తయితే, విలీనం డిమాండ్ ఒక్కటే ఒక ఎత్తు. దానిమీద ఆచితూచి అడుగేయాల్సిన అవసరముందని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే రాష్ట్ర ప్రభుత్వ త్రిసభ్య కమిటీ నెల రోజులు సమయం అడిగింది. దాంతో ఇప్పటికిప్పుడు నిర్ణయాలు చేయడం సాధ్యపడదని స్పష్టమైంది. ఆదినుంచీ ఒకవైపు చర్చలు జరుపుతూనే మరోవంక ప్రత్యామ్నాయాల ఏర్పాట్లపై సమీక్షలు జరపడంలోనే ఆ చర్చల భవిష్యత్తు అర్ధమైపోయింది. ఆర్టీసీ బస్సులన్నింటినీ రంగంలోకి దింపి, సిబ్బందిని పూర్తిస్థాయిలో విధుల్లో పెట్టినా పండగ సీజన్‌లో డిమాండుని తట్టుకోవడం అంతంతమాత్రమే అయిన అనుభవాలు గతంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కకపోతే పరిస్థితి ఎంతదారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా చేసే ఎలాంటి ఏర్పాట్లయినా ఏమూలకూ సరిపోవు. ప్రయివేటు స్కూళ్ల బస్సుల్ని రంగంలోకి దింపుతున్నారు. ఈ ప్రయోగం ఏమాత్రం సురక్షితమైనదో వారే ఆలోచించాలి. ఆ బస్సులు సీట్ల సంఖ్యలోను, వేగంలోను ఆర్టీసీ బస్సులతో సరిపోలవన్నది తెల్సిందే. అలాంటి బస్సుల్లో దూరప్రయాణాలు చేయడంలోని ఔచిత్యాన్ని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఏసీ బస్సుల్లో రిజర్వేషన్లు చేయించుకుని, సుఖంగా ప్రయాణించొచ్చని కలలు కన్న ప్రయాణికుల కలలు స్కూలు బస్సులతో కల్లలు కాక ఏమవుతాయి? కాని యాజమాన్యం ముందు ఇంతకన్నా వేరే మార్గం ఇంకేముంటుంది? అస్సలు లేనిదానికన్నా ఏదొక ప్రత్యామ్నా యంలే అని సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. ఆర్టీసీ యూనియన్లు నిదానంగా చర్చల ద్వారా పరిష్కరించుకోదగిన పెద్ద అంశాల మీద వత్తిడి తెచ్చే మార్గాన్ని ఎంచుకున్నదన్న విమర్శలు ఎదుర్కొంటున్నాయి.

ప్రజల కోణం ఇక్కడ ముఖ్యమని ప్రయాణికులు భావిస్తున్నారు. ఎటొచ్చీ ప్రయివేటు వాహన యజమానులు తమకు తోచిన రీతిన ప్రయాణికులను దోచుకునేందుకు ఈ పరిస్థితులు దోహదపడతాయి. పండక్కి ఊళ్లకు వెళ్లేవారికి మాత్రం అగచాట్లే మిగులుతున్నాయి.!



# వినువీధిలో గురువెక్కడ?

మనదేశంలో ఉపాధ్యాయ దినోత్సవం అంటే అందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి గుర్తుకు వస్తుంది. ఎప్పుడు జరుపుకుంటారు అంటే ఠకీమని సెప్టెంబర్ 5 అనేస్తారు. మరి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారో తెలుసా? ఇవాళే 1994 నుంచి ప్రతి ఏడాది అక్టోబర్ 5న వరల్డ్ టీచర్స్ డేను జరుపుకుంటున్నారు ఉపాధ్యాయులు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 100 దేశాలు అంతర్జాతీయ గురుపూజోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.. భవిష్యత్ తరాలకు విద్యా ప్రణాళిక ఎలా ఉండాలి అనే అంశంపై ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టడం, భావి పౌరులను తయారు చేయడానికి భవిష్యత్తు ప్రణాలికలు రూపొందించడం.

1966 అక్టోబర్ 5న పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఉపాధ్యాయుల హెూదా గురించి విశిష్టమైన తీర్మానం ఆమోదించబడింది. ఆ రోజును ఏటా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని 1994లో యునెస్కో ప్రకటించింది. ఏటా ఒక ప్రత్యేక నినాదంతో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవానికి యునెస్కో ఒక తాజా నినాదాన్ని ఎంపిక చేసింది. అది యువ టీచర్ల చేతిలో ఈ వృత్తి భవిష్యత్తు. అదే సందర్భంలో విశాలమైన విద్యారంగాన్ని అనేక కోణాల నుంచి పరిశీలించాల్సి ఉంది. విద్యారంగంలో ఉపాధ్యాయుల, విద్యార్థుల, తల్లిదండ్రుల స్థితిగతులతోపాటు అంతర్జాతీయంగా జరుగుతున్న అనేక పరిణామాలు, విధానాల ప్రభావం వలన నాణ్యమైన విద్య అందుతుందా? గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ స్థానానికి విలువలు కాపాడబడుతున్నాయా? విద్యారంగం ఒత్తిడులకు గురవుతుందా? వంటి అనేక ప్రశ్నలు చర్చనీయాంశాలుగా ఉన్నాయి. నేడు విశ్వవ్యాప్త విద్యారంగం, విశాల ప్రయోజనాలు, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయుల పాత్ర, బాధ్యత, స్థానం గురించి చర్చించుకునే రోజు.

మాతృదేవో భవ.. పితృదేవోభవ.. ఆచార్య దేవో భవ అని తల్లిదండ్రుల తరువాత గురువులనే ప్రత్యక్ష దైవంగా భావిస్తుంటారు. తల్లిదండ్రులు పిల్లలను కనడం.. పెంచడం వరకే బాధ్యత. ''గురుబ్రహ్మ.. గురువిష్ణు... గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః'' అంటూ గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పోల్చుతూ గురువు గొప్పతనాన్ని తెలియ జేస్తుంది ఈ శ్లోకం.. అభివృద్ధి పథంలో నడిచే ప్రతి సమాజంలో గురువుల పాత్ర తప్పక వుంటుంది. ఒక తరం అభివృద్ధి చెందాలన్నా, దేశ భవిష్యత్తును మార్చే ఒక తరం రూపు దిద్దుకోవాలన్నా అదంతా కేవలం గురువుల పాత్రనే అని చెప్పక తప్పదు. వారు పాఠ్యాంశాలను బోధించడంతోనే సరిపెట్టుకోరు. ప్రపంచ గమనాన్ని అవగతం చేయడం ద్వారా విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధిస్తారు. ఆ ఆశయ సాధన దిశగా దిశానిర్దేశం చేస్తారు. ప్రతి గురువూ తన వ్యక్తిత్వం ద్వారా విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తారు. అలాంటి గురువు ఎప్పటికీ విద్యార్థుల మనసుల్లో దేవుడుగా నిలిచిపోతారు. మట్టి లో మాణిక్యా లను వెలికితీసి రత్నాలుగా మలి చేది... బండ రాయిని రమణీయమైన శిల్పా లుగా చెక్కేది... అజ్ఞాన తిమిరంలో విజ్ఞాన జ్యోతులు వెలిగించేది... సమాజ స్థితి గతులను అధ్యయనం చేసి నవతరానికి ప్రగతిబాటను పరిచేది... ఒక్క ఉపాధ్యాయుడే. అందుకే ఆయ నకు అంతటి గౌరవం. గురు వుగా అత్యున్నత పీఠం. తన శిష్యులను ఉన్నత శిఖరాలకు నడిపించి... తాను మాత్రం నేలపైనే వుండి వారి ఎదుగు దలకు సోపానమౌతాడు. మార్గదర్శకమౌతాడు.



మనం మాట్లాడే మాటలలో గురువు శక్తి వుంటుందని, మనం మాట్లాడే శక్తిలోను గురువు ప్రభావం ఉంటుందని, మనలోని అజ్ఞాన అంధకారాన్ని పోగొట్ట డానికి కూడా గురువే ఆధారమని, లోకంలో ఏ పని చెయ్యా లన్నా గురువే ఆదర్శమని, అందువల్ల గురువు లేనిదే ఏ శక్తీ లేదని అర్థం.. మనో మేధోపరమైన, జాతిపరమైన, సంస్కృతి పరమైన, శాస్త్ర సంబంధమైన వారసత్వాన్ని ఒక తరం నుంచి మరో తరా నికి అందించే వాటిని విద్యాలయాలు అంటారు మన మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్యాలయాలు బండిలాంటివి అయితే వాటిని నడిపించే యిరుసులు మన గురువులు అని అన్నారు. ఒక తరం తరలించాలన్నా, విలువల పతనంతో అంతరిం చాలన్న అది గురువుతోనే. ఏ దేశంలోనూ దక్కని గౌరవం ఉపాధ్యాయులకు మన సమాజంలో దక్కుతుంది.

**నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం**

జీవితంలో విజయం సాధించాలని కోరుకునే వారు ఉండరు. కానీ కొందరే విజయ తీరాన్ని చేరగలరు. అనుకున్న లక్ష్యం చేరడం సులవు కాదు.... అలాగని అసాధ్యము కాదు. ఓ సామాన్యుడు విజేతగా మారిన ప్రతి నేపథ్యం వెనుక ఓ గురువు ఉంటాడు. గురువు అంటే నడిపించే నాయకుడు.. ప్రేరణగా నిలిచే మార్గదర్శకుడు. నరేంద్రుడు అనే సామాన్యమైన ఒక యువకుడిని భారత జాతికే స్ఫూర్తిగా నిలిపి, ప్రపంచ యవనికపైన వివేకనందుడిగా నిలిపి మన అందరి మదిలో ఉన్నత స్థానంలో నిలిపింది అతడి గురువు రామకృష్ణ పరహంస. గురువు గొప్పతనం అలాంటింది..

గురువు, దేవుడు ఎదురైతే నేను ముందుగా గురువుకే వందనం చేస్తానంటాడు కబీర్. గురువు గొప్పతనం అంతటిది. గురువు లేని విద్య గుడ్డి విద్యగా భావించి ఏకలవ్యుడు సైతం గురువు ప్రతిమ సాక్షిగా విలువిద్య నభ్యసించాడు. ఒక ఇంజనీర్ ... ఒక డాక్టర్... ఒక లాయర్... నిర్లక్ష్యం వహిస్తే సమాజానికి కొంత నష్టమే వాటిల్లుతుంది. ఓ ఉపాధ్యాయుడు అలా చేస్తే ఓ భావితరం నష్టపోతుంది. మారుతున్న కాలం మాస్టార్ రూపు రేఖలను, విలువలని మార్చేస్తుంది. బడే గుడి.. పిల్లలే దేవుళ్లు అనే ప్రేమాభిమానాలు నానాటికి సన్నగిల్లు తున్నాయి. అక్కడక్కడ జరిగే కొన్ని సంఘటనలు, ఉపాధ్యాయుడి ప్రవర్తన సభ్యసమా జాన్ని బాధిస్తున్నాయి. అయినా మా మంచి ఉపాధ్యా యు డుకు అభినందనాలు అంటూ పిల్లలు అక్షర సుమాలు వెదజల్లుతూనే ఉన్నారు.

కంప్యూటర్‌లు, వీసీ డీలు, ప్రయోగ శాలలు, ఎల్‌సీడీలు, ప్రొజె క్టర్‌లు ఇలా అత్యాధునిక పరికరాలు ఎన్ని అందు బాటు లోకి వచ్చిన గురువు చెప్పిన మాటలే మనకు అనుభావాల మూటలు మిగులుస్తాయి. పుస్తకంలో పాఠాలే కాదు... జీవితంలో నేర్వాల్సిన గుణపాఠాలు నేర్చుకోవాలంటే గురువు వద్దకు చేరాలి. ఏ వృత్తికి లేని ఇతివృత్తం ఉపాధ్యాయ రంగానిది. ఏ వ్యక్తికి లేని శిష్యకోటి పరివృత్తం ఉపాధ్యాయు నికి మాత్రమే సొంతం.

లోకంలో తండ్రి- కొడుకుల సంబంధం, అట్లాగే భార్యా భర్తల, తల్లీకొడుకుల సంబంధం వలె గురు- శిష్య సంబంధం కూడా స్థిరమైనది, పవిత్రమైనది. గురువు శిష్యునికి విద్యా బుద్ధులను నేర్పించడమే కాకుండా అతడు తనను మించిపోయేంతగా అభివృద్ధి చెందాలని, ఆకాశమే హద్దుగా ఎదగాలని, చివరకు తాను కూడా శిష్యుని చేతిలో పరాజయం పొందేంతగా శిష్యుని శ్రేయస్సును గురువు కాంక్షిస్తాడు. శిష్యుడు కూడా తనకు పునర్జన్మ వంటిదైన జ్ఞానజన్మను ప్రసాదించిన గురువు పట్ల కాలపరిమితి లేకుండా జీవితమంతా కృతజ్ఞతాభావాన్ని కలిగియుండడమే కాకుండా, గురువు ప్రశస్తిని లోకానికి తెలియజెప్పే రీతిలో ప్రవర్తిస్తాడు.

గురువు అంటే బోధకుడు కాదు.. మీ అనుభూతిలో లేని దాన్ని మీకు మేధాపరంగా బోధించలేము. మిమ్మల్ని వేరేస్థాయి అనుభూతిలోకి తీసుకువెళ్ళ మాత్రమే అది మీకు బోధించగలం. ఒక వ్యక్తి అనుభవాన్ని ఒక దశ నుండి వేరొక దశకు తీసుకుపోవాలంటే అతనికంటే తీవ్రం, శక్తివంతం అయినస్థాయిలో ఉన్న పరికరం లేకసాధనం అవసరం అవుతుంది. ఆ సాధనం లేదా పరికరాన్నే 'గురువు' అని పిలుస్తున్నాం. దీనివల్లే గురుశిష్య సంబంధం అతిముఖ్యమై నదిగా, పవిత్రమైనదిగా భావించబడుతుంది. ఎవరైతే శక్తిపరంగా మీకంటే ఉన్నత స్థాయిలో ఉంటారో, వారే అలా మిమ్మల్ని అలా ముందుకు తీసుకెళ్ల గలరు. వేరెవ్వరికీ అది సాధ్యం కాదు. విద్యావ్యవస్థ శరవేగంగా మారిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి గొప్ప గురువుల అవసరం నేటి సమా జానికి ఎంతోవుంది. అయితే... గతంలో మాదిరిగా ఇప్పుడు ఉపాధ్యాయులు -విద్యార్థుల మధ్య సంబంధాలు కొనసా గడంలేదు. వారిపట్ల గురుశిష్య సంబంధాలు మాయమై పోయి, డబ్బు సంబంధాలను మాత్రమే మిగుల్చుతున్నా యి. అయితే మనం పురోగమనంలో ఉన్నామా, తిరోగ మనంలో ఉన్నామా అనే ఆశ్చర్యకరమైన సందిగ్ధావస్తలో ఉన్న మాట నిజం.

సమాజంలో, తల్లితండ్రులలో విద్య వ్యవస్థ మీద ఉన్న నమ్మకం క్రమంగా సడలి పోతున్నది. నేటి మన కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు పిల్లలను యాంత్రికంగా తయారు చేస్తున్నాయి. మార్కులు ర్యాంకులే పరమావధిగా కావడం వల్ల ఉపాధ్యాయుల పట్ల చూపించాల్సిన విధేయత, గౌరవాభిమానాలు కూడా తగ్గు ముఖం పట్టాయి. ప్రభుత్వాలు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడమే దీనికి కారణం. కార్పొరేట్ స్కూళ్లకు తివాచీలు పరిచి స్వాగతం పలుకుతూ... ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యార్థులు లేరనే నెపంతో పాఠశాలలను మూసివేయడం, ఉపాధ్యాయ నియామకాలు నిలిపివే యడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ''జీతం పుచ్చుకోవటం వల్ల ఉపాధ్యాయులు సేవకులు అవుతున్నారు, వేతనం ఇస్తుండటం చేత విద్యార్థులు రాజులవుతున్నారు'' అన్న కందుకూరి వీరేశలింగం మాటలను విద్యార్థులు, గురు వులు, తల్లిదండ్రులు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన తరు ణమిది. బతకలేక బడి పంతులు అనే నానుడి ఒకప్పుడు, కానీ ఇప్పుడు బతక నేర్చిన వాడే బడిపంతులు. దీపం తాను వెలుగుతూ ఉంటే తప్ప మరో దీపాన్ని వెలిగించలేదు. అలాగే ఉపాధ్యాయుడు కూడా నిరంతరం నేర్చుకుంటూ ఉంటే తప్ప భావితరాలను ప్రభావితం చేయలేడు. అలాగే... విద్యా వృక్షానికి పట్టిన అజ్ఞానమనే చీడను నాశనము చేసి, భవిష్యత్తరాలకు విజ్ఞాన జ్యోతులు వెలిగించి, రేపటి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే.

-కాళంరాజు వేణుగోపాల్
8106204412

# భూతాపం తగ్గేదెలా?



ఇది రుతుపవన వర్షాధారంతో కూడుకుని ఉంది. అనూహ్యమైన వాతావరణ మార్పుల వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. సేద్యంలో సంక్షోభం దేశవ్యాప్తంగా ఆహార భద్రతతోపాటు ప్రజల జీవనోపాధి పైనా ప్రభావం చూపుతోంది. ఐపీసీసీ నివేదికలో పేర్కొన్నట్లు భూతాపంతో కరవు విస్తరిస్తోంది. ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగితే ఏడాదిలో కరవుకాలం రెండు నెలలు, రెండు డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగితే నాలుగు నెలలు ఉంటుంది. భారతదేశ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం ఉష్ణోగ్రతను రెండు డిగ్రీల సెంటిగ్రేడ్ దాటకుండా చేయగలిగినా పంట దిగుబడి తగ్గి 8.4 శాతం ఆదాయం తగ్గుతుందని అంచనా వేశారు. 2006 నాటి పరిశోధనల ప్రకారం ఒక సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే వరి 5.4 శాతం, గోధుమలు 8.1 శాతం, మొక్కజొన్న 10.4 శాతం, జొన్న 18 శాతం, వేరుశెనగ 8.7 శాతం దిగుబడి తగ్గుతాయి. భూతాపం వల్ల 2020 నాటికి దేశంలో వర్షపాతం సహజ మార్పుల దశదాటి ఆకస్మిక మార్పుల దశకు చేరుతుంది. వాతావరణ మా ర్పులవల్ల వ్యవసాయం పై ప్రతికూల ప్రభావం పడి వచ్చే పదిసంవత్సరాలలో రైతన్నల ఆత్మహత్యలు 6.8 శాతం పెరగవచ్చునని ఒక అంచనా. భూతాపం వల్ల ఉద్భవించే ఉష్ణోగ్రత ప్రపం చంలోని అన్ని ప్రాంతాల ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతుంది. 1986 - 2015 మధ్యకాలంలో వడగాడ్పులపై అధ్యయనం చేసిన ఐపీసీసీ వెలువరించిన నివేదిక ప్రకారం ప్రపంచంలోని చాలా నగరాలు 2040 నాటికి వేసవిలో బయటకు అడుగు పెట్టలేని పరిస్థితికి చేరతాయని అంచనా. ఉష్ణోగ్రత పెరగడంవల్ల గాలి వీచే వేగం పెరుగుతుంది కనుక మహావృక్షాలు సైతం నేలకొరుగుతాయి. అడవులలో అతి త్వరగా నిప్పు వ్యాప్తికి ఈ గాలులు తోడ్పడడంవల్ల తక్కువ కాలంలోనే ఎక్కువ విస్తీర్ణ అడవులు బుగ్గిపాలు అవుతాయి. ధరిత్రికి ఊపిరితిత్తుల్లా, దైవమాతగా పర్యావరణవేత్తల మన్ననలు అందుకుంటున్న అమెజాన్ అడవులు భూమిపైన ఉన్న 30 శాతం వృక్ష, జంతుజాలానికి, 10 శాతం జీవ వైవిధ్యానికి నెలవైనవి. అటువంటివి నేడు నిరంతరాయంగా దహించి పోవడానికి వడగాడ్పులే కారణం. ప్యారిస్ ఒప్పందాన్ని యథాతథంగా అమలు పరిచినా ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు పెరిగితే ప్రపంచంలోని అన్ని నగరాలు ప్రజలు తీవ్రవడగాడ్పులకు లోనవుతారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ 2017 ఏప్రిల్ నివేదిక ప్రకారం వర్తమాన దేశాలలో సాధారణ ఉష్ణోగ్రత ఒక్కరోజు 35 డిగ్రీలు దాటితే ఆ ఏడాది మరణాలు 0.74 శాతం పెరుగుతాయి. భారతదేశంలో మరణాల రేటు నగరాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాలలో మూడురెట్లు అధికమని ఈ అధ్యయనం వెల్లడించింది. వివిధ కారణాల వల్ల పొట్ట చేతపట్టుకుని పల్లెపట్టు నుంచి రోజూ పట్టణాలకు, నగరాలకు తరలివస్తున్న లక్షలమందికి వేడిగాడ్పులు ముమ్మరిస్తే నీడపట్టున కాసేపు సేదతీరే కనీస సౌకర్యాలు లేనేలేవు. సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ మించితే మైదాన ప్రాంతాల్లో, 30 డిగ్రీల సెల్సియస్ దాటితే కొండలు, పర్వత సానువుల్లో వడగాడ్పులు వీస్తాయి. మనదేశంలో మరణాలకు కారణమవుతున్న ప్రకృతి విపత్తుల్లో వడగాడ్పులది మూడవ స్థానం.

భూతాపం వల్ల జరిగే నష్టాలు విజ్ఞాన శాస్త్రానికి కూడా అంతుబట్టడం లేదు. భూగోళం పైన ఉన్న సముద్ర మట్టంపై జరిగిన పరిశోధనలు వెల్లడించిన సత్యాలు భవిష్యత్తు ప్రణాళికలను తప్పు పడుతున్నాయి. శతాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టం 40 సెం.మీ. పెరిగింది. మరో వంద సంవ త్సరాల్లో నీటిమట్టం 60 సెంటీ మీటర్లు అధికమయ్యే సూచన లున్నాయని ఈ పరిశోధన విశ్లేషిం చింది. భూతాపం వల్లనే సముద్ర మట్టాలు ఏటా 1.5 మి.మీ. నుంచి 10.మి.మీ వరకు పెరుగుతున్నాయని పరిశోధనలలో తెలిసింది.



వాతావరణ మార్పుపై అంతర ప్రభుత్వ నిపుణుల సంఘం ప్రత్యేక నివేదిక ప్రకారం భూతాపం పెరుగుదల హిందూకుష్ హిమాలయ పర్వత (హెచ్‌కేహెచ్) ప్రాంతంలోని హిమనీ నదాలను అగ్నిజ్వాలై హరించే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలోని 64 శాతం హిమనీ నదాలను 2100 నాటికి మానవాళి కోల్పోయే మహావిషాదం కనుచూపు మేరలో ఉన్నట్లు ఈ సంఘం పేర్కొంది. హిందుకుష్ పర్వతశ్రేణులు, అత్యంత ఎత్తయిన టిబెట్ పీఠభూమి ప్రపంచంలోనే అత్యధిక తాజా జలసంపదకు ఆలవాలంగా ఉన్నాయి. నీటిపారుదల వ్యవస్థల ద్వారా ఈ ప్రాంతం ప్రత్యక్షంగా 12 కోట్ల ప్రజలకు ప్రాణాధారంగా ఉంది. భారత్, చైనా, నేపాల్, బాంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్గానిస్తాన్‌లలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో 130 కోట్ల ప్రజలకు పరోక్షంగా సాయపడుతోంది. భూతాపం ఇదే రేటుతో పెరిగితే. 2100 సంవత్సరం నాటికి హిమనగరాల ఘనపరిమాణం 36 నుంచి 64 శాతం వరకు తగ్గిపోవచ్చునని నివేదిక హెచ్చరించింది. దీనివల్ల సముద్రమట్టాలు పెరిగి రేవు పట్టణాల్లోని 15 కోట్ల ప్రజలకు వరద ముంపు ప్రమాదం తప్పదని, మన ఆర్థిక రాజధాని ముంబైకి ఈ ముప్పు పొంచిఉందని పేర్కొంది. అమెరికాలోని నేషనల్ ఓషనిక్ అండ్ అట్మా స్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ తాజా అంచనాల ప్రకారం 2090 నాటికి కూడా కరగదు అనుకున్న కెనడా, ఆర్కిటిక్ మహాసముద్ర ప్రాంతంలోని పెర్మాఫ్రాస్ట్‌లు 70 ఏళ్ల ముందుగా ఈ ఏడాది నుంచే కరగడం ప్రారంభమైంది. గ్రీన్‌లాండ్‌లోని మంచు కరిగే రేటు ముందు కన్నా రెండున్నర రెట్లు ఎక్కువైందని తెలిపింది. భూతాపం వల్ల మంచు ఫలకాలు, హిమనీ నదాలు కరిగిపోయి సముద్ర మట్టాలు పెరిగితే ప్రపంచ పర్యాటకుల స్వర్గధామాలైన అన్నిదీవులు జల సమాధవుతాయని పేర్కొంది.

భూతాపం వల్ల ఏర్పడే ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆహార ఉత్పత్తిపై ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ అంచనా ప్రకారం 2005- 2015 లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సేద్యానికి 6,43,000 కోట్ల డాలర్ల నష్టం కలిగిందని వెల్లడించింది. విపత్తుల వల్ల వ్యవసాయం, ఆహార ఉత్పత్తులకు వాటిల్లుతున్న నష్టాల్లో సగభాగం ఆసియా దేశాలకు సంబంధించే ఉంటున్నాయని పేర్కొంది. కొకోవా చాక్లెట్ తయారీలో విరివిగా ఉపయోగిస్తున్నారు. సారవంతమైన నేల, తగినంత తేమ, ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న భూమధ్యరేఖ ప్రాంతంలో మాత్రమే ఈ పంట పండుతుంది. కానీ అధిక ఉష్ణోగ్రత కారణంగా వచ్చిన మార్పుల వల్ల భూమధ్యరేఖకు ఇరువైపులా ఉన్న ప్రాంతం పొడిబారి 2050 నాటికి కోకొవా దిగుబడి గణనీయంగా తగ్గిపోవడానికి ఆస్కారం ఉందని 'జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా విభాగం' హెచ్చరించింది. బ్రిటన్‌లో, రాయల్ బొటానికల్ గార్డెన్స్ పరిశోధకులు రానున్న 20 సంవత్సరాలలో భూతాపం కారణంగా కాఫీ గింజల రకాలు మాయమవుతాయని చెబుతున్నారు.

ఇప్పటికే మాంద్యంతో మూలుగుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వాతావరణ మార్పులు అతలాకుతలం చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం భూతాపం 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరిగితే 2030 నాటికి ప్రపంచ ఆర్థిక నష్టం దాదాపుగా 170 లక్షల కోట్ల డాలర్లుగా ఉంటుంది. ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో వేసవికాలం, వర్షాకాలం అనకుండా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై అనూహ్యమైన ప్రభావం చూపుతున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యు.హెచ్.ఓ) అంచనాల ప్రకారం సాధారణ మరణాల కంటే అదనంగా ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో నాలుగు లక్షల మరణాలు వాతావరణ మార్పుల వల్ల సంభవించనున్నాయి.

సెప్టెంబర్ 23న ఐక్యరాజ్య సమితి వాతావరణ శిఖరాగ్ర సదస్సు జరిగిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి, అగ్రశ్రేణి వాతావరణ సంస్థలను ఊటంకిస్తూ రూపొందించిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2015- 19 మధ్యకాలం అత్యంత ఉష్ణమయం. ఐదేళ్ళుగా రికార్డుల్లోకి ఎక్కబోతున్నాయని పేర్కొంది. పారిశ్రామికీకరణ ముందునాటి (1850- 1900)తో పోలిస్తే గడచిన ఐదేళ్ల కాలంలో ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉన్నట్లు తెలిపింది. 2011- 15 కాలంతో పోలిస్తే 0.2 డిగ్రీల సెల్సియస్ మేర ఇవి ఎక్కువని వివరించింది. 2018లో కార్బన్ డయాక్సైడ్ రెండు శాతం మేర పెరిగిందని, రికార్డు స్థాయిలో 37 బిలియన్ టన్నులకు ఈ వాయు పరిమాణం చేరిందని పేర్కొన్నది. గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించుకుంటామని ప్రపంచ దేశాలు హామీ ఇచ్చినప్పటికీ ఈ పరిస్థితి తలెత్తడం గమనార్హం అని పేర్కొన్నది.

-డా॥ శెట్టెం ఆంజనేయులు
9490057161

సంపాదకీయం

# స్వచ్ఛతవైపు పల్లె అడుగులు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 30 రోజుల ప్రణాళిక స్వచ్ఛతవైపు పల్లెలు పరుగెడుతున్నాయి. గాంధీజీ చెప్పినట్లుగా గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యం అన్నట్లు, గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పల్లెలు చల్లగా ఉంటాయని అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడీ సైతం గాం ధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటు కావాలనే సంకల్పంతో 'స్వచ్ఛభారత్' కార్యక్రమం, తన మొదటి ప్రాధాన్యత తీసుకొని దేశంలో అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, మున్సిపాలి టీలలో, కార్పొరేషన్‌లలో వ్యర్థప దార్థాలైన తడి, పొడి చెత్త సేకరణకు ప్రాధాన్యం ఇస్తూ స్వచ్ఛత వైపు పరుగులు తీస్తున్న జిల్లాలను, పట్టణాలను గుర్తించి ప్రతియేటా గాంధీ జయంతి రోజున అవార్డులు అందించడం, ర్యాంకులు ప్రకటించడం అభినంద నీయం. మన రాష్ట్ర ప్రభుత్వం సైతం 30 రోజుల ప్రణా ళిక కార్యక్రమం తీసుకోవడం వలన గ్రామస్థాయి అధికారి నుండి కలెక్టర్ స్థాయి అధికారి వరకు ఆయా గ్రామాలలో ప్రజా ప్రతినిధులను, ప్రజలను చైతన్యపరుస్తూ గ్రామాలు పరిశుభ్రతవైపు పరుగులు పెట్టిస్తున్నారు. ముఖ్యంగా పిచ్చిమొక్కల తొలగింపు, సానిటేషన్, సైడ్ కాలువల మరమ్మతులు శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు తొలగింపు, పాత బావులను పూడ్చడం, గ్రామ రహదారులలో గుంతలు పూడ్చ డం, మొక్కల పెంపకం (హరితహారం) చేపట్టి వాటికి కంచె ఏర్పాటు చేయడం వంటి పనులు ఒక ఉద్యమం లాగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా పల్లెలు పరిశుభ్రంగా ఉంటున్నాయని ఇలా ఉంటే ప్రజలు అనారోగ్యాల పాలు కాకుండా ఉంటారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పనిని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుంటే పల్లెలు, ప్రగతి వైపు పయనిస్తాయని చెప్పవచ్చును. గ్రామంలో సర్పంచ్‌తోపాటు, వార్డు మెంబర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజనుల సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశ కార్య కర్తలు, దాతలు, ఎన్ఆర్ఐ లచే ప్రతిపనికి 15 మంది తో కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే, ఉదాహ రణకు రోడ్లపై చెత్తవేసినా, మరుగు దొడ్లు ఉపయోగిం చక, బహిరంగ కాలకృత్యాలు తీర్చుకున్నా, రోడ్లపై జంతువులను ఉంచినా, ఇళ్ళముందు పిచ్చిమొక్కలు, చెత్త ఉంచినా అపరాధ రుసుం విధిస్తే ఇంకా అభివృద్ధికి బాటలు వేయవచ్చు.

-సామంతుల సదానందం
చింతలపల్లి, మొగుళ్ళపల్లి

# అ.ని.చ. పటిష్టంగా ఉండాలి

దళితులు, ఆదివాసీలపై అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకోవడం ముదావహం. గత ఏడాది ఆ చట్టంలోని నిబంధనలు నిందితుల పట్ల కఠినంగా ఉన్నాయని సుప్రీం భావించి, అందుకు అనుగుణంగా తీర్పునిచ్చింది. అయితే ఆ తీర్పు వల్ల బాధితులు మరింతగా నష్టపోయే అవకాశం ఉండడంతో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. కేంద్రం పాత నిబంధనల్ని కొనసాగిస్తూ పార్లమెంటులో చట్టం చెయ్యడమే కాకుండా సదరు తీర్పుని పునస్సమీక్షిం చాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరింది. తుది తీర్పు రిజర్వు లో ఉంది. దరిమిలా మంగళవారం నాడు గతంలో తానిచ్చి న తీర్పుని వెనక్కి తీసుకొంటున్నట్టు ప్రకటించడం బాధిత వర్గాలకు ఊరట. దేశంలో దళితులపై సగటున పదిహేను నిమిషాలకు ఒక అత్యాచారం జరు గుతూ వస్తోంది. గత పది సంవత్సరాల్లో దాడులు అరవైఆరు శాతం పెరగ్గా, అత్యాచారాలు రెట్టింపై నాయి. అంటరానితనం వార్తలు మీడియాలో నిత్యమూ దర్శనమిస్తున్నాయి. అధికారిక లెక్కలే యిలా వుంటే, ప్రపంచం దృష్టికి రాని, నమోదుకాని ఉదంతాలు ఇంకెంత తీవ్రమో చెప్పలేం. ఈ అత్యాచారాల్ని అడ్డు కొనే మార్గాల్లో కఠిన చట్టాలుండడం కీలకం. కొంతమేరకు ఉపయోగ పడుతున్న చట్టాల్ని ఏదో కారణాన పదును కోల్పోయేలా చేస్తే పరిస్థితులు మరింతగా దిగజారుతాయి. నేరం చేసే వాళ్లకు ప్రోత్సాహాన్నిస్తాయి. ఆ ప్రమాదాన్ని నివా రించేలా సుప్రీం వ్యవహరించడం హర్షణీయం. నమోదైన అత్యాచార కేసుల్లో శిక్ష వరకూ వచ్చేవి అత్యల్పం. నమోదు మొదలు తుది తీర్పు వరకూ బాధితుల కు ఎదురయ్యే అవ రోధాలెన్నో. సాధారణంగా బాధితుడి కన్నా, నిందితుడు బల మైనవాడు, పలుకుబడి కలవాడు అయ్యుంటాడు. ఆ వ్యక్తికి ఎదురు నిలబ డడమే కష్టమైన పరిస్థితిలో 'అతణ్ణి వెంటనే అరెస్టు చెయ్యరాదు, నమోదుకు ముందు ప్రాథమిక దర్యాప్తు చెయ్యాలి, పై అధికారుల అనుమతి పొందాలి, అరె స్టు చేసినా ముందస్తు బెయిల్‌కి అర్హుడు' తరహా అవకాశాలుంటే అవి బాధితుడి పట్ల అన్యాయం చేసినట్టే. అలాంటి అవకాశాల్ని నిందితుడికి లేకుండా చెయ్య డంలోనే బాధితుడికి తొలి భరోసా ఉంది. సమానత్వం, అంటరానితనం నిషేధం లాంటి రాజ్యాంగ హక్కులపై సమాజానికి ఒక సందేశం ఇమిడి ఉంది. తప్పుడు కేసుల్లో అమాయకులు శిక్షించబడకుండా ఇప్పటికే నేరస్మృతిలో తగు చట్టాలున్నాయి. ఆ వంకతో చట్టం పదును తగ్గించడం అంటే అసలు చట్టం ఉద్దేశా న్ని, స్ఫూర్తినీ నీరుగార్చడమే. బెత్తం చూపిస్తూనే, క్రమశిక్షణ అలవర్చడం ప్రభు త్వానికే కాదు, పౌరసమాజానికీ ముందున్న కార్యం.

-డా.డి.వి.జి.శంకరరావు,
9440836931

# మణిరత్నం సహా 49 మంది ప్రముఖులపై ఎఫ్ఐఆర్

- మూకస్వామ్యంపై ప్రధానికి లేఖ రాసినందుకు..
- మోడీ ప్రభుత్వంపై రాహుల్ ఆగ్రహం
- ప్రశ్నిస్తే జైల్లో పెడుతున్నారని విమర్శలు

**న్యూఢిల్లీ :** దేశంలో పెరిగిపోతున్న అసహనం..మూక దాడులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదంటూ ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ రాసిన ప్రముఖులపై బీహార్‌లోని సదార్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రముఖులు రాసిన బహిరంగ లేఖ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేవిధంగా ఉందని న్యాయవాది సుధీర్ కుమార్ ఓఝూ జులై 27న పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మెజిస్ట్రేట్ కోర్టు.. 49 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆగస్టు 20న కోర్టు ఆదేశాలిచ్చింది. ముజఫర్‌పూర్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సూర్యకాంత్ తివారీ ఆదేశాలతో ఎఫ్ఐఆర్ నమోదుకావడం గమనార్హం. వీరిలో చరిత్రకారుడు రామచంద్ర గుహ, సినీ ప్రముఖులు శ్యామ్ బెనగల్, అదూర్ గోపాలకృష్ణన్, సుభా ముద్గల్, సుమిత్రా సేన్, మణిరత్నం, రేవతి, అపర్ణాసేన్, కొంకణసేన్‌లతో పాటు పేర్లు తెలపని 40 మంది ఉన్నారు. బహిరంగ లేఖ రాసిన వారిపై రాజద్రోహం, జాతీయ సమైక్యతను దెబ్బతీయడం మొదలైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో మూకదాడులు పెరిగిపోయాయని వారు లేఖలో పేర్కొనడం భారత్ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని న్యాయవాది ఓజా కోర్టుకు తెలియజేశారు. 49 మంది ప్రముఖులు ప్రధానికి రాసిన బహిరంగ లేఖ అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉందని వివరించారు. ఈనేపథ్యంలో కోర్టు ప్రముఖులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బీహార్ పోలీసులను ఆదేశించింది.

### జాతీయసమైక్యతను దెబ్బతీయొద్దు

ప్రముఖులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై న్యాయవాది సుధీర్ కుమార్ ఓజా మాట్లాడుతూ.. ప్రధానికి బహిరంగ లేఖ రాసే హక్కు ప్రతీ భారతీయ పౌరుడికిఉంది.కానీ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా... సున్నిత అంశాలను బహిరంగంగా వెల్లడించడం ప్రజల్లోకి చెడు సంకేతాలను పంపుతుంది. మూక దాడులను తమ ఆందోళనను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఎన్నో మార్గాలున్నాయి. మూకస్వామ్యంపై ప్రభుత్వం అభిప్రాయాన్ని తెలుసుకోకుండా ఇలాంటి చర్యలు సరికాదు. అని అన్నారు. ఓజా గతంలోనూ వివిధ అంశాలపై రాజకీయ ప్రముఖులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, నితీష్ కుమార్, రాజ్‌థాక్రే, అరవింద్ కేజ్రీవాల్, ఆధ్మాత్మిక గురువులు ఆశారాం బాపు, నిర్మల్ బాబా వంటి వారిపై కేసులు నమోదు చేయించారు.

### మోడీది నిరంకుశ పాలన

కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో నిరంకుశవాదం కొనసాగుతోందన్న రాహుల్..మూకదాడులపై ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాసిన ప్రముఖులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై గర్హనీయమన్నారు. ప్రధాని మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా ఏదైనా మాట్లాడితే జైల్లో పెట్టేస్తున్నారని విమర్శించారు. మోడీ హయాంలో నిరుద్యోగం తాండవిస్తోందని రాహుల్ ఆరోపించారు. కేరళలోని వయనాడ్‌లో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. ఇదేం రహస్యం కాదు. ప్రపంచానికి కూడా తెలుసు. మనం రోజురోజుకూ నియంతృత్వ పాలనలోకి వెళ్తున్నాం. అని అన్నారు. దేశంలో ప్రస్తుతం భావజాల పోరాటం నడుస్తోందని.. దేశాన్ని ఒకే ఒక వ్యక్తి పాలిస్తేనే అలాంటి ఆలోచనలు వస్తాయని ఆరోపించారు. భిన్న భాషలు, సంస్కృతీ సాంప్రదాయాలు కలిగిన భారత్‌లో ప్రజలు వివిధ రకాల అభిప్రాయాలను కలిగి ఉంటారని అన్నారు. మోడీ హయాంలో ఆర్థిక వ్యవస్థ భ్రష్టుపట్టిందని.. ఈ పరిస్థితులకు కారణమైనా మోడీ వెంటనే ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 125000 కోట్ల పన్ను చెల్లింపులను కేవలం 15 మందికే లబ్ధిచెందేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశమంటే 15 మంది కార్పొరేట్లనా.. అని రాహుల్ ప్రశ్నించారు.

# 'ఆధార్' డేటాపై సమీక్ష!

- యూఐడీఏఐ పనితీరుపై నిఘా
- థరూర్ నేతృత్వంలో పార్లమెంటరీ ప్యానెల్

**న్యూఢిల్లీ :** ఆధార్ కార్డుల విషయంలో దేశ ప్రజల వ్యక్తిగత డేటా భద్రత విషయమై యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) పనితీరును సమీక్షించాల్సిందిగా లోక్‌సభ సచివాలయం శుక్రవారం నిర్ణయించింది. కాంగ్రెస్ నేత శశిథరూర్ నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానెల్ యూఐడీఏఐ పనితీరు గురించి లోతుగా తెలుసుకోనుంది. ఆధార్ కార్డు ద్వారా వ్యక్తిగత సమాచారం భద్రతపై ఆది నుంచి ఎన్నో సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ కూడా చాలా సార్లు ఆధార్ డేటా లీక్ కావడంపై మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. దేశ ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత ఆధార్ డేటాకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించినట్టు ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా చెబుతూ ఉంది. శశిథరూర్ నేతృత్వంలోని కమిటీ ప్రజల వ్యక్తిగత డేటా, భద్రత, గోప్యత గురించి తెలుసుకోనుంది. అదేవిధంగా యూఐడీఏఐ పనితీరుపై కూడా ప్యానెల్ సమీక్షించనుంది.

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

పౌరుల హక్కులు పరిరక్షించడం, సామాజిక లేదా ఆన్‌లైన్ న్యూస్ మీడియా దుర్వినియోగం కాకుండా నివారించడం, డిజిటల్ వ్యవస్థలో మహిళల భద్రత వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు లోక్‌సభ సచివాలయం పేర్కొంది. ప్రతీ ఒక్కరి అన్ని విషయాలు ఆధార్‌తో అనుసంధానించడానికి కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఆధార్ కార్డుతో లింక్ చేయని పాన్ కార్డు ఉండి కూడా ఎలాంటి ఉపయోగం ఉండదని చెబుతోంది. ఇలాంటి నేపథ్యంలో ఓ వ్యక్తికి సంబంధించిన అన్ని వ్యవస్థలను ఆధార్‌తో అనుసంధానించి ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

# రష్యా ఫ్రీ 'ఈ-వీసా'

- పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం
- 96 గంటల్లోనే అన్ని అనుమతులు
- అక్టోబర్ 1న ప్రారంభించిన పుతిన్

**రష్యా :** పర్యాటకులను ఆకర్షించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఐరోపా టూర్‌కు వెళ్లాలని అందరికీ ఉంటుంది. కానీ అక్కడి నిబంధనలు, వీసా వంటి ఎన్నో విషయాలు వారిని అక్కడికి వెళ్లనీయకుండా వెనక్కి లాగుతుంటాయి. వ్లాదిమిర్ పుతిన్ ఈ విషయంలో తీసుకున్న నిర్ణయం అందరినీ యూరప్ టూర్ వెళ్లేందుకు సిద్ధం చేస్తోంది. ఈ విషయమై ఓ పర్యాటకురాలు నార్మా గార్కా మాట్లాడుతూ.. తన కుమార్తెతో కలిసి యూరప్ టూర్ వెళ్లాలని చాలా ఆశ ఉండేదని తెలిపింది. ఫ్రాన్స్‌కు వెళ్లేందుకు వీసా అవసరం లేదని, టర్కీ పర్యటనకు సంబంధించి పత్రాలు కంప్యూటర్ ద్వారా పొందానని వివరించింది. రష్యా విషయంలో మాత్రం తన పాస్‌పోర్టు, ఇతర పత్రాలు 500 కిలోమీటర్ల దూరంలోని మెక్సికో సిటీలోని ఎంబసీకి సమర్పించేందుకు కొరియర్‌ను నియమించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రీపెయిడ్ విమాన టికెట్లు, హోటల్ రిజర్వేషన్లు అన్నీ పంపించి, 160 డాలర్లు చెల్లించిన కొన్ని వారాలకు అనుమతి లభించిందని తెలిపింది.

### 53 దేశాల పౌరులకు సౌకర్యం

పర్యాటకులను ఆకర్షించే విషయంలో వ్లాదిమిర్ పుతిన్ ఈ ప్రక్రియను మరింత సులభతరం చేశారు. 53 దేశాల ప్రజలు రష్యాను సందర్శించేందుకు కేవలం 96 గంటల్లోనే అన్నీ అనుమతులు పొందేలా ఈ-వీసా పద్ధతిని అక్టోబర్ 1 నుంచి తీసుకొచ్చారు. ఓ ప్రత్యేకమైన యాప్ ద్వారా ఈ ప్రక్రియను ఎంతో సులువుగా పూర్తి చేసుకోవచ్చు. ఫీజు కూడా 50 డాలర్ల కంటే తక్కువే ఖర్చు కావడం విశేషం. ఎంతో కఠిన నిబంధనలు ఉన్న సౌదీ అరేబియా లాంటి దేశం కూడా పర్యాటకులను ఆకర్షిస్తున్న సమయంలో రష్యా తీసుకున్న ఈ నిర్ణయం సందర్శకులను మరింత పెరిగేందుకు దోహదపడుతుంది.

# ఇటు నిరసనలు.. ..అటు జోష్!



- మహాపోరులో సీనియర్లకు దక్కని టికెట్లు
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులకు షాక్
- ముగిసిన నామినేషన్ల స్వీకరణ గడువు
- వినోద్ తావ్డే, బావాంకులే, పురోహిత్‌కు చుక్కెదురు
- ప్రకాష్ మెహతా అనుచరుల వీరంగం
- పరాగ్ షాకు టికెటివ్వడంపై ఆగ్రహం
- నామినేషన్ వేసేందుకు వచ్చిన షా కారు ధ్వంసం



వినోద్ తావ్డే



రాజ్ పురోహిత్



చంద్రశేఖర్ బావాంకులే

**ముంబై :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు గడువు శుక్రవారంతో ముగిసింది. నేడు (శనివారం) నామినేషన్ల పరిశీలన, 7వ తేదీన ఉప సంహరణ, అక్టోబర్ 21న ఎన్నికలు, 24న ఫలితాలతో ఎన్నికల సరళి పరిసమాప్తమవుతుంది. అయితే టికెట్ ఆశించి భంగపడ్డ వాళ్లలో బీజేపీ సీనియర్ నేతలు చాలా మంది ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులకు ఈసారి టికెట్లు దక్కలేవు. ఎన్నికల్లో పాల్గొనే విషయంలో టికెట్ రాబట్టుకోవడంలో కీలక నేతలందరూ విఫలమైనట్టు స్పష్టమైంది. నాల్గో జాబితాలో విద్యా శాఖ మంత్రి వినోద్ తావ్డే, విద్యుత్ శాఖ మంత్రి చంద్రశేఖర్ బావాంకులే, మరో అమాత్యుడు రాజ్ పురోహిత్ కు స్థానం దక్కలేదు. ఇద్దరు మాజీ మంత్రులు ఏక్‌నాథ్ ఖాడ్సే, మరో సీనియర్ నాయకుడు ప్రకాష్ మెహతాకు కూడా చుక్కెదురైంది. మహారాష్ట్ర బీజేపీలో ఏక్‌నాథ్ ఒకప్పుడు నెంబర్ 2 నేతగా వ్యవహరించారు.

### ముగ్గురు ముంబై చీఫ్‌లకు నిరాశే..

విశేషం ఏమిటంటే.. తావ్డే, పురోహిత్, మెహతాలు ముంబై బీజేపీ యూనిట్‌కు అధ్యక్షులుగా పని చేశారు. బీజేపీ అభ్యర్థి పరాగ్ షాకు వ్యతిరేకంగా మెహతా ఘట్‌కోపర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం చేసే అవకాశం ఉంది. తావ్డే ఆశించిన బోరివాలీ సీటును సునీల్ రాణేకు కేటాయించడం జరిగింది. మాజీ మంత్రి పురోహిత్ ఆశించిన కొలాబా నియోజకవర్గం టికెట్ రాహుల్ నార్వేకర్‌కు అప్పగించారు. బావన్‌కులేకు కాంప్టీ (నాగ్‌పూర్) నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. చివరి నిమిషం వరకు ఆయనకు సీటు కేటాయించలేదు. ఆ తరువాత అనూహ్యంగా ఆయన భార్య జ్యోతికి టికెట్ కేటాయించగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన అభిమన్యు పవార్ ఔసా (లాతూర్) నుంచి నామినేషన్ వేశారు. మాజీ సీఎం నారాయణ్ రాణే కుమారుడు నితీష్ రాణే బీజేపీలో చేరకముందే నామినేషన్ దాఖలు చేయగా.. శుక్రవారం వాటిని కంకవళి నియోజకవర్గం నుంచి ఫైనల్ చేశారు.

### 75 ఏళ్లు పైబడిన నిబంధనకు బ్రేక్

75 ఏళ్ల స్పీకర్ హరిభావు బగాడే... ఫులాంబ్రీ (ఔరంగాబాద్) నుంచి అనూహ్యంగా పోటీ చేయనున్నారు. తావ్డే, పురోహిత్, ఖడ్సేలపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో పక్కనపెట్టినట్టు తెలుస్తోంది. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించడంలో విఫలమైనందుకు చంద్రశేఖర్ బావాంకులేకు టికెట్ దక్కలేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. టికెట్ ఆశించి కాంగ్రెస్, ఎన్‌సీపీ నుంచి బీజేపీలో చేరి.. ఆ తరువాత భంగపడ్డ వారు పార్టీకి తలనొప్పిగా మారే అవకాశా లు ఉన్నాయి. పుణెలాంటి కొన్ని ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని మిత్రపక్షశివసేన కార్యకర్త లు ఇప్పటికే బెదిరింపులకు దిగారు. 8 స్థానాల్లో ఏ ఒక్కటీ శివ సేనకు కేటాయించలేదు.

### పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం: తావ్డే, ఖాడ్సే

కీలక నేతలు ఏక్‌నాథ్ ఖాడ్సే, వినోద్ తావ్డేలకు టికెట్ కేటాయించకపోడంపై స్పందించారు. తాము పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. బీజేపీ, శివసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుంటామని తావ్డే చెప్పుకొచ్చాడు. పార్టీ విడిచి పెట్టి వెళ్లేది లేదన్నారు. టికెట్ ఎందుకు ఇవ్వలేదో ఆలోచించాల్సిన సమయం కాదన్నారు. ఖడ్సే మాట్లాడుతూ.. తన కూతురు రోహిణికి టికెట్ వచ్చిందని, కూటమి అభ్యర్థిగా ఆమెను ముక్తాయినగర్ నియోజకవర్గం నుంచి గెలిపించాలని కార్యకర్తలను కోరారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోనని తేల్చి చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో కూతురు రోహిణిని గెలిపించుకుని నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. కొత్త వ్యక్తి పరిచయం చేస్తే బాగుంటుందన్న కారణంగానే తాను తప్పుకుంటున్నట్టు వివరించారు.

### పరాగ్ కారుపై మెహతా అనుచరుల దాడి

ఘట్‌కోపర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మెహతా అనుచరులు టికెట్ పొందిన పరాగ్ షా కారుపై శుక్రవారం ఉదయం దాడికి పాల్పడ్డారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన షా కారుపై మెహతా మద్దతుదారులు 11.15 నిమిషాలకు దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. 2014లో మెహతా ఘట్‌కోపర్ ఈస్ట్ నుంచి పోటీ చేసి గెలుపొందాడు. టికెట్ కేటాయించకపోవడంపై షాకు వ్యతిరేకంగా మెహతా అనుచరులు నినాదాలు చేశారు. మెహతాకు టికెట్ రాకుండా షా కుట్ర పన్నారని ఆరోపించారు. నిరసనకారులను మెహతా శాంతింపజేసేయకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

## గడ్కరీ ఆశీర్వాదంతో..

- దేవేంద్ర ఫడ్నవీస్ నామినేషన్
- భారీ రోడ్ షోతో బల నిరూపణ

**నాగ్‌పూర్ :** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నాగ్‌పూర్ సౌత్-వెస్ట్ నియోజకవర్గం నుంచి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. దీనికి ముందు వేలాది మంది కార్యకర్తలతో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఫడ్నవిస్, ఆయన సతీమణి అమృతా ఉదయం నాగ్‌పూర్ ఎంపీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇంటికి వెళ్లారు. గడ్కరీ, ఆయన భార్య ఆశీర్వాదాలు తీసుకున్న తరువాత ఫడ్నవీస్ నామినేషన్ వేసేందుకు రోడ్‌షో ద్వారా బయలుదేరి వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బీజేపీ జెండాలు, కార్యకర్తలతో గడ్కరీ వెంట ఎన్నికల కార్యాలయానికి వెళ్లి ఫడ్నవీస్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. వీరి వెంట మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల్ కూడా ఉన్నారు. మహారాష్ట్ర, నాగ్‌పూర్ ప్రజలందరూ తనను తప్పకుండా ఆశీర్వదిస్తారని భావిస్తున్నా అని ఫడ్నవీస్ తెలిపారు. బీజేపీ హయాంలో మహారాష్ట్ర ఎంతో అభివృద్ధి చెందిందని, భారీ మెజార్టీతో పార్టీ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఫడ్నవీస్‌పై కాంగ్రెస్ నుంచి ఆశీష్ దేశ్‌ముఖ్ పోటీ చేస్తున్నారు. ఎన్‌సీపీ నేత అజిత్ పవార్‌తో పాటు పలువురు ప్రముఖులు నామినేషన్ దాఖలు చేశారు.



# మేం చిత్తుగా ఓడిపోతాం..!



- మహా అయితే 3 లేదా 4 చోట్ల గెలుస్తాం
- ముంబైలో డిపాజిట్లు కూడా దక్కవు
- సొంత పార్టీపై కాంగ్రెస్ నేత సంజయ్ విమర్శలు

**ముంబై:** కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను సూచించిన వారికి పార్టీ టికెట్ ఇవ్వకపోడంపై ఆయన విలేకరుల సమా వేశం నిర్వహించి మరీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముంబైలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని చెప్పుకొచ్చారు. అతి కష్టం మీద మూడు లేదా నాలుగు స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందుతారని జోస్యం చెప్పారు. తాను సూచించిన అభ్యర్థులకు టికెట్ ఇచ్చి ఉంటే భారీ విజయాన్ని కాంగ్రెస్ నమోదు చేసేదన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లబోనని తేల్చి చెప్పారు. కొన్ని స్థానాల్లో పార్టీకి డిపాజిట్లు కూడా రావని, రాష్ట్రంలోని పరిస్థితులను పరిగణలోకి తీసు కోకుండా ఇష్టారీతిన టికెట్లు కేటాయించారని మండి పడ్డారు. అభ్యర్థుల ఎంపికబట్టే పార్టీ అన్నీ స్థానాల్లో ఓడిపోతుందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. నలుగురు బలమైన అభ్యర్థుల పేర్లు సూచించి.. టికెట్లు ఇవ్వాలని మల్లికార్జున ఖర్గేకు సూచించానని, కానీ ఆయన తన మాటలు లెక్క చేయలేదని, తాను చెప్పిన వారిలో ఎవరికీ టికెట్లు ఇవ్వలేదని తెలిపారు. రాహుల్ గాంధీకి సన్నిహితంగా ఉన్న వారందరినీ చెక్ పెట్టేం దుకు సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండి పడ్డారు. అభ్యర్థుల గురించి పూర్తి వివరాలు తెలుసు కోకుండా గుడ్డిగా టికెట్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాలను పట్టించుకోని పక్షంలో త్వరలోనే తాను కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలుగుతాన ని తేల్చి చెప్పారు. స్థానికంగా ఉన్న సీనియర్ నేతలకు తెలియకుండా టికెట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సార్లు ఎంపీగా, ముంబై కాంగ్రెస్ చీఫ్‌గా పని చేశానని, ఇక్కడి రాజకీయ పరిస్థితులు తనకు బాగా తెలుసు అని, వాటిని లెక్కజేయకుండా పార్టీ వ్యవహరించిందని మండిపడ్డారు. శివసేనలో 15 ఏళ్ల పాటు కొనసాగిన తరువాత నిరుపమ్ కాంగ్రెస్‌లో చేరారు.

# పాక్ తప్ప పొరుగు దేశాలన్నీ మిత్రులే..

- ఉగ్రవాదాన్ని వదిలితేనే పాక్‌తో చర్చలు
- స్పష్టం చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ తప్ప మిగతా పొరుగు దేశాలన్నీ భారత్‌కు మిత్రదేశాలేనని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై అమెరికాలో సైతం చర్చలు జరిగిన అంశంపై స్పందిస్తూ.. ఏ దేశంలోనైనా మార్పు జరిగితే అంతర్జాతీయ వేదికల్లో చర్చలు సాధారణమే అని వివరించారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ ఎకనామిక్ సమ్మిట్‌లో జై శంకర్ మాట్లాడుతూ.. ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా వివిధ వేదికల్లో కాశ్మీర్ అంశం చర్చకు వచ్చిందని... కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు.. భారత్ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేశామన్నారు. కాశ్మీర్ అంశంపై స్పందిస్తూ.. 370 భారత రాజ్యాంగంలోని తాత్కాలికమైన ఆర్టికల్. జమ్ము కాశ్మీర్‌ను ఒక రాష్ట్రంలో ఏర్పాటు చేసే క్రమంలో నాటి నేతలు చేసిన తప్పిదాలు ఇందుకు కారణం. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని సరిచేస్తున్నాం. అని తెలిపారు. దక్షిణాసియా దేశాల మధ్య సహకారంపై స్పందిస్తూ.. ఇండియన్ సబ్ కాంటినెంట్‌లో చాలా వరకు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలే ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితులు మారి దక్షిణాసియా దేశాలు ఆర్థిక పురోగతికి పరస్పరం సహకరించుకోవాలన్నదే ప్రధాని మోడీ సంకల్పమని చెప్పుకొచ్చారు.



### వ్యాపారులతో పాక్ ఆర్మీ చీఫ్ భేటీ

పాకిస్థాన్‌లో ఆర్థిక వ్యవస్థ దివాలా చేసిందన్న ప్రచారం అంతర్జాతీయంగా పాకుతున్న నేపథ్యంలో ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ క్వమర్ బజ్వా పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలతో భేటీ అయి తాజా పరిస్థితులపై చర్చించారు. రావల్పిండిలో జరిగిన ఈ భేటీలో పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు.. పెట్టుబడులు, ఇతర దేశాల నుంచి రుణాల మంజూరు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రధానంగా పాకిస్థాన్ ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వంపై వ్యాపార వర్గాల్లో విశ్వాసాన్ని పెంపొందించడం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు పాక్ పత్రిక డాన్ పేర్కొంది.

### సొంత మీడియాపై పాక్ మంత్రి అసహనం

పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ ఖురేషీ మరోసారి తన అసహనాన్ని వెల్లగక్కారు. కాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేయగా.. తమకు 58 దేశాల మద్దతు ఉందని చేసిన ప్రకటనను ఓ విలేఖరి సూటిగా వేసిన ప్రశ్నకు ఖురేషీ నాలక కరుచుకుని అసహనం వ్యక్తం చేశారు. యూఎన్‌హెచ్ఆర్సీలో 47 సభ్యదేశాలు ఉండగా.. పాకిస్థాన్ తమకు 58 దేశాల మద్దతు ఉందని వాదించడం ఆ దేశ వితండ వాదానికి నిదర్శనమని ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ జర్నలిస్ట్ వేసిన ప్రశ్న పాక్ విదేశాంగ మంత్రి అసహనానికి కారణమైంది.



# తొలి ప్రైవేట్ రైలు కూత

**లక్నో:** దేశంలోనే తొలి ప్రైవేట్ రైలు తేజస్ ఎక్స్‌ప్రెస్ పట్టాలెక్కింది. లక్నో నుంచి న్యూఢిల్లీకి వారంలో ఆరు రోజుల పాటు(మంగళవారం తప్ప) సేవలందించే ఈ రైలును ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ జెండా ఊపి ప్రారంభించారు. తేజస్ ఎక్స్‌ప్రెస్ రైలు ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రస్తుతం ఢిల్లీ- లక్నో మధ్యప్రయాణ సమయం ఆరుగంటల 40 నిమిషాలు పడుతుండగా.. తేజస్ రైలు ద్వారా 15 నిమిషాల సమయం ఆదా అవుతుంది. రోజు ఉదయం 6.10 నిమిషాలకు లక్నో నుంచి ప్రారంభమయ్యే తేజస్ రైలు.. మధ్యాహ్నం 12.25 గంటలకు ఢిల్లీ చేరుకుంటుంది. ఢిల్లీలో మధ్యాహ్నం 3.35 బయలుదేరి రాత్రి 10.05 గంటలకు లక్నో చేరుకుంటుంది. పారిశ్రామిక వేత్తలు ప్రత్యేక కార్యక్రమాలకు ఈ రైలు ఎంతగానో దోహదపడనుంది. ఈ సందర్భంగా యోగి ఆదిత్య నాథ్ మాట్లాడుతూ.. దేశంలో ఇది తొలి కార్పొరేట్ రైలు. ఈ రైలులో వెళ్తున్న తొలి ప్రయాణికులకు నా శుభాకాంక్షలు. ఆగ్రా, లక్నో, వారణాసిల మీదుగా కార్పొరేట్ రైలు ప్రయాణం సాగేలా ఎక్స్‌ప్రెస్ వేను రూపొందించాం. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది లోపు అన్ని రూట్లలో రైలు ప్రయాణం సాగుతుంది. అని అన్నారు. దేశంలోనే తొలి కార్పొరేట్ రైలును ఉత్తర్ ప్రదేశ్ నుంచి ప్రారంభించేలా ప్రోత్సహించిన ప్రధానిమోదీ ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేట్ రైలును పర్యావరణ హితంగా రూపొందించారు.

## అయోధ్య విచారణకు ఈనెల 17 డెడ్‌లైన్

**న్యూఢిల్లీ:** అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదానికి సంబంధించిన కేసు విచారణ అక్టోబర్ 17లోగా ముగించను న్నట్టు సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 37వ రోజు విచారణ ముగింపు సందర్భంగా వాదనల చివరి దశకు షెడ్యూల్‌ను నిర్ణయించింది. ఈ వివాదానికి సంబంధించి ముస్లిం పక్షాలు అక్టోబర్ 14న వాదనలు పూర్తి చేస్తాయని అనంతరం అక్టోబర్ 16లోగా హిందూ పార్టీలు తమ స్పందన తెలియ జేసేందుకు రెండు రోజులు అనుమతి ఇస్తామని ధర్మాసనం తెలిపింది. అక్టోబర్ 17న విచారణ ముగించడానికి చివరి రోజు అని సీజేఐ తెలిపా రు. న్యాయమూర్తులు ఎస్ఏ బోబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్‌భూషణ్, ఎస్ఏ నజీర్లతోకూడా రాజ్యాంగ ధర్మాసనం కూడా అక్టోబర్ 18న విచార ణ ముగించడానికి తుది గడువుగా నిర్ణయించింది. నవంబర్ 17న సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్నందున నవంబర్ నెలలో అయోధ్య కేసులో తుదితీర్పు వెలువడనుంది.

# పాత్రధారులెవరు.. సూత్రధారులెవరు?

- నీట్ కుంభకోణంపై మద్రాస్ హైకోర్టు సీరియస్
- తమిళనాడులోనే కాకుండా దేశవ్యాప్తంగా స్కాం ప్రభావంపై ఆరా
- కేంద్రానికి నోటీసులు
- ఈనెల 15లోగా పూర్తి వివరాలివ్వాలని ఆదేశం

**చెన్నై:** డిగ్రీ స్థాయి మెడికల్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించే నీట్ పరీక్షలో భారీ కుంభకోణం తెరతీయడంపై మద్రాసు హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ కుంభకోణం లింకులు ఒక్క తమిళనాడులోనే దేశ వ్యాప్తంగా ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తూ... కేంద్ర ప్రభుత్వం వివరణ కోరింది. నీట్ కుంభకోణంపై పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి అందించాల్సిందిగా కేంద్ర ఆరోగ్య, మానవ వనరుల శాఖలను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. తమిళనాడులో నీట్ కుంభకోణంపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొనడంతో మద్రాసు హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. కేవలం ఐదుగురి విద్యార్థుల అరెస్ట్‌తో కేసు ముగియదని.. కుంభకోణం లింకులు దేశ వ్యాప్తంగా ఎక్కడెక్కడున్నాయో ఆరా తీయాలని కేంద్ర ఆరోగ్య, మానవ వనరుల శాఖలను ఆదేశించింది. ఎంబీబీఎస్ సీట్లను అక్రమంగా సంపాదించేందుకు లక్షల రూపాయలు చేతులు మారినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు తీవ్రతను గుర్తించిన హైకోర్టు ఈ కుంభకోణంలో పాత్రదారులెవరు.. సూత్రదారులెవ రనేది ఈనెల 15లోగా తమకు తెలియజేయాలని ఆదేశించింది. నీట్ కుంభకోణంలో ఎవరెవరికి సంబంధాలున్నాయో తేల్చేందుకు క్రైం బ్రాంచ్ పోలీసులు..కర్నాటక, మహారాష్ట్ర లకు ప్రత్యేక టీంలను పంపించింది.

### ఐదుగురు విద్యార్థులు అరెస్ట్

నీట్ అడ్మిషన్ కుంభకోణంలో ఐదుగురు విద్యార్థు లు, వారి తల్లిదండ్రుల ప్రమేయం ఉందని తేలడంతో దేశ వ్యాప్తంగా స్కామ్ ప్రభావాన్ని ఆరాతీయాలని సూచించింది. థేని ప్రభుత్వ మెడికల్ కాలేజీ డీన్ ఏకే రాజేంద్రకు గతనెల 11,13 తేదీల్లో వచ్చిన రెండు ఈ మెయిల్స్ ద్వారా ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఎంబీబీఎస్ విద్యార్థి కేవీ ఉదిత్ సూర్య తనకు బదులు మరో వ్యక్తితో పరీక్ష రాయించి సీటు సంపాదించినట్లుగా ఈ మెయిల్స్‌లో ద్వారా తెలియడంతో కాలేజీ డీన్ మొదట అంతర్గత విచారణకు ఆదేశించారు.

# డికాక్, ఎల్గర్ శతకాలు



## టీమిండియాకు దీటుగా బదులిస్తున్న సఫారీలు

## సౌతాఫ్రికా 385/8 • అశ్విన్‌కు ఐదు వికెట్లు

**విశాఖపట్నం:** భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణా ఫ్రికా దీటుగా స్పందిస్తోంది. ముందు బ్యాటింగ్ చేసిన టీమిండి యాలో ఓపెనర్లు మయాంక్ అగర్వాల్, రోహిత్ శర్మలు చిరస్మ రణీయ బ్యాటింగ్‌తో సత్తా చాటుకుంటే.. సమాధానంగా దక్షిణాఫ్రికా జట్టులో ఓపెనర్ ఎల్గర్ (160; 287 బంతుల్లో 18 ఫోర్లు, 4 సిక్సలు), వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ (111; 163 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సలు) శతకాలతో మెరిశారు. దీంతో పర్యాటక సౌతాఫ్రికా జట్టు శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసి భారత్‌కు దీటైన జవాబిచ్చింది. ప్రస్తుతం సౌతాఫ్రికా భారత్ స్కోరుకు 117 పరుగుల దూరంలో మాత్రమే వెనుకబడి ఉంది. మరోవైపు టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (5/128) కీలక సమయంలో వికెట్లు తీసి మరోసారి జట్టుకు అండగా నిలిచాడు. పేసర్లకు సహకరించని పిచ్‌పై అశ్విన్‌తో పాటు మరో స్పిన్నర్ రవీంద్ర జడేజా (2/116) రాణించాడు. ఓవరాల్‌గా తొలి టెస్టులో బ్యాట్స్‌మెన్ హవా జోరుగా సాగుతోంది.

### డుప్లెసిస్ దూకుడు..

శుక్రవారం 39/3 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించిన సౌతాఫ్రికాకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ టెంబ బవుమా (18)ను ఇషాంత్ శర్మ అద్భుతమైన బంతితో బలిగొన్నాడు. దీంతో సఫారీ జట్టు 63 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వచ్చిన కెప్టెన్ డుప్లెసిస్ ఓపెనర్ డీన్ ఎల్గర్‌తో కలిసి సఫారి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇబ్బంది పెడుతున్న భారత బౌలర్లను వీరిద్దరూ సమర్థంగా ఎదుర్కొంటూ సింగిల్స్, డబుల్స్‌తో స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ఎల్గర్ సమన్వయంతో ఆడుతుంటే డుప్లెసిస్ మాత్రం దూకుడుగా ఆడుతూ అవకాశం దొరికినప్పుడు చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ పరుగుల వేగాన్ని పెంచాడు. అనంతరం లంచ్ విరామానికి సఫారీ జట్టు 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. లంచ్ తర్వాత మరింత చెలరేగిన డుప్లెసిస్ 91 బంతుల్లో హాఫ్ సెంచరీ పూరించాడు. మరోవైపు ఎల్గర్‌తో కలిసి ఐదో వికెట్‌కు కీలకమైన 115 పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తి చేశాడు. ఇక ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అశ్విన్ తెలివైన బంతితో విడదీసి భారత్ శిబిరంలో ఆనందాన్ని నింపాడు. భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన డుప్లెసిస్ (55; 103 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అశ్విన్ బౌలింగ్‌లో పుజారాకు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. దీంతో సఫారీ జట్టు 178 స్కోరు వద్ద ఐదో వికెట్ కోల్పోయింది.



### ఆదుకున్న ఎల్గర్, డికాక్..

రెండు వందల పరుగులలోపే సగం జట్టు పెవిలియన్‌కి చేరి కష్టాల్లో ఉన్న దశలో సఫారీ జట్టును డీన్ ఎల్గర్, క్వింటన్ డికాక్‌లు బాధ్యతాయుత బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. సంయమనంతో ఆడిన వీరిద్దరూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటు స్కోరుబోర్డును ముందుకు సాగించారు. ఇద్దరు ధాటిగా ఆడుతూ ఆరో వికెట్‌కు 73 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ దశలోనే కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న ఓపెనర్ ఎల్గర్ 175 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లతో శతకాన్ని సాధించాడు. దాదాపు 9 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సెంచరీ సాధించిన బ్యాట్స్‌మన్‌గా ఎల్గర్ నిలిచాడు. చివరిసారి 2010లో హాషిం ఆమ్లా భారత్‌పై శతకం చేశాడు. ఇప్పుడు చాలా కాలం తర్వాత ఎల్గర్ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. ఒకవైపు ఎల్గర్ మరోవైపు డికాక్ చెలరేగి ఆడడంతో స్కోరుబోర్డుపై వేగంగా పరుగులు వచ్చి చేరాయి. డికాక్ కూడా 79 బంతుల్లో 7 ఫోర్లు, ఒక భారీ సిక్స్ సహాయంతో అర్ధ శతకాన్ని నమోదు చేసుకున్నాడు. ఈ జోడీని విడదీయడానికి భారత బౌలర్లు ఎన్నో ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. వీరు 156 బంతుల్లో 100 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా పూర్తి చేసుకోవడంతో సఫారీ జట్టు 300 పరుగుల మార్కును దాటింది. అనంతరం కొద్ది సేపటికి రవీంద్ర జడేజా అద్భుతమైన బంతితో వీరిద్దరి భాగస్వామ్యానికి తెరదించాడు. కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన ఎల్గర్ (160) చివరికి వెనుదిరిగాడు. దీంతో 164 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం డికాక్ తనదైన మార్కు షాట్లతో చెలరేగి ఆడుతూ 149 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సలతో సెంచరీ సాధించాడు. ఆ తర్వాత మరో 11 పరుగులు జోడించిన డికాక్ (111) అశ్విన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫిలాండర్ (0)ను కూడా అశ్విన్ ఔవుట్ చేసి సఫారీలకు మరో షాకిచ్చాడు. దీంతో శుక్రవారం మూడో రోజు ఆటముగిసే సమయానికి సౌతాఫ్రికా 118 ఓవర్లలో 358/8 స్కోరు చేసింది. ప్రస్తుతం ముత్తుసామీ (12 బ్యాటింగ్), కేశవ్ మహరాజ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో అశ్విన్ ఐదు వికెట్లు పడగొట్టగా.. జడేజా రెండు, ఇషాంత్ ఒక వికెట్ దక్కించుకున్నారు.

**స్కోరు బోర్డు:**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 502/7 (డిక్లేర్డ్).**

**సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (సి) పుజారా (బి) రవీంద్ర జడేజా 160, మార్క్‌రమ్ (బి) అశ్విన్ 5, డి బ్రూన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) జడేజా 0, టెంబ బవుమా (ఎల్బీ) ఇషాంత్ శర్మ 18, డు ప్లెసిస్ (సి) పుజారా (బి) అశ్విన్ 55, క్వింటన్ డికాక్ (బి) అశ్విన్ 111, ముత్తుసామీ (బ్యాటింగ్) 12, ఫిలాండర్ (బి) అశ్విన్ 0, కేశవ్ మహరాజ్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు: 17, (మొత్తం 118 ఓవర్లలో) 385/8.

**వికెట్ల పతనం:** 1-14, 2-31, 3-34, 4-63, 5-178, 6-342, 7-370, 8-376.

**బౌలింగ్:** ఇషాంత్ శర్మ 14-2-44-1, షమీ 15-3-40-0, రవిచంద్రన్ అశ్విన్ 41-11-128-5, జడేజా 37-4-116-2, హనుమ విహారి 9-1-38-0, రోహిత్ శర్మ 2-1-7-0·

## అభిమాని అత్యుత్సాహం

**విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో:** విశాఖ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌మ్యాచ్ సందర్భంగా మూడోరోజు శుక్రవారం ఒక అభిమాని అత్యుత్సాహం చూపించాడు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ చేస్తుండగా హఠాత్తుగా మైదానంలోకి ఒక అభిమాని పరిగెత్తుకుంటూ వచ్చి ఆటగాళ్లతో సెల్ఫీలకు ప్రయత్నించాడు. తక్షణమే భద్రతా సిబ్బంది ఆ యువకుడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించడంతో తిరిగి స్టేడియం బయటకు పరుగులు తీశాడు. ఈలోగా పోలీసు సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. అభిమానులు ఆటగాళ్లతో సెల్ఫీలు తీసుకోవడానికి ఇటువంటి ప్రయత్నాలు చేస్తుండడంతో ఒక్కొక్కసారి అవి ఇబ్బంది కరంగా మారుతున్నాయి. కొందరు ఆటగాళ్లతో కరచాలనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.





## సఫారీలకు ఓదార్పు విజయం

### భారత్‌తో మహిళల టి20 సిరీస్

**సూరత్:** మహిళల టి20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం భారత్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో సౌతాఫ్రికా 105 పరుగులతో ఘన విజయం సాధించింది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన సఫారీ జట్టు చివరి మ్యాచ్‌లో ఓదార్పు విజయంతో సిరీస్‌ను ముగించింది. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా మహిళలు 3-1తో కైవసం చేసుకున్నారు. రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. శుక్రవారం జరిగిన చివరి మ్యాచ్‌లో సఫారీ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్లు లిజెలె లీ (87), కెప్టెన్ సునె లూస్ (62) విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన టీమిండియా 17.3 ఓవర్లలో 70 పరుగులకే ఆలౌటైంది. డిక్లార్క్ మూడు వికెట్లు తీయగా.. ఇస్మాయిల్, ఆనె బోచ్ చెరో రెండు వికెట్లతో విజృంభించారు.

## బెంగళూరుకు జైపూర్ ఝలక్




**పంచకుల:** ప్రొ కబడ్డీ సీజన్-7 లో భాగంగా శుక్ర వారం బెంగ ళూరు బుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 41-34 స్కోరుతో విజయం సాధిం చింది. ఏడో స్థానంలో కొనసాగుతున్న జైపూర్ ఈ విజ యం తమ ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరచుకు న్నది. జైపూర్ జట్టులోని దీపక్ నర్వాల్ సూపర్ టెన్ నమోదు చేశాడు. దీపక్ 18సార్లు రెయిడిం గ్‌కు వెళ్లి 16 పాయిం ట్లు సాధిం చాడు. నీలేష్ సలూంకె 9, విశాల్ 5, సందీప్ ధూల్ 4, అమిత్ హుడా 3 పాయింట్లు సాధించారు. బెంగ ళూరు జట్టులో పవన్ షెరావత్ సూపర్ టెన్(14) సాధించాడు. సుమీత్ 7, అంకిత్, బంటి చెరి మూడు పాయింట్లు సాధించారు. రెయిండిం గ్‌లో(27-23), టాకిలింగ్‌లో(12-8) జైపూర్‌దే పైచేయి. ఇరు జట్లు ఒక్కొక్కసారి ఆలౌటయ్యాయి.

### తీరు మారని టైటాన్స్

ఈ సీజన్‌లో తెలుగు టైటాన్స్ మరో పరాజయాన్ని మూటగట్టుకుంది. శుక్రవారం హర్యానా స్టీలర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20 పాయింట్ల తేడాతో(32-52) టైటాన్స్ ఓటమిపాలైంది. టైటాన్స్ జట్టులో సిద్ధార్థ్ దేశాయ్(12), ఫరాద్(10)సూపర్ టెన్స్ సాధించినా జట్టును గెలిపించలేకపోయారు. రాకేష్ 4, ఆకాష్ చౌదరి 3 పాయింట్లతో సహకరించారు. హర్యానా జట్టులో వికాస్ కండోలా 13 పాయింట్లతో జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. తక్కిన ఆటగాళ్లలో వినయ్ 8, రవికుమార్, ప్రశాంత్ కుమార్ చెరి 7, సునీల్ 4 పాయింట్లతో సహకరించారు. రెయిడింగ్‌లో(31-23), టాకిలింగ్‌లో(12-8) స్టీలర్స్‌కు టైటాన్స్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. దానికితోడు మూడుసార్లు ఆలౌటయింది. శనివారం యుపి యోధా, ఢిల్లీ దబాంగ్‌తో...గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, పట్నా పైరేట్స్‌తో తలపడతాయి.

## ఇండియన్ పేసర్స్ గెలుపు



**ముంబై:** ఇండియాలో ఎన్‌బీఏ జట్ల బాస్కెట్‌బాల్ పోరు తొలి మ్యాచ్‌లో ఇండియన్ పేసర్స్ 132-131 స్కోరుతో శాక్రమెంటో కింగ్స్‌పై గెలుపొందింది. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 118-118తో సమంగా నిలవడంతో అయిదు నిమిషాల అదనపు సమయంలో విజేతను తేల్చారు. మ్యాచ్ ఆరంభంనుంచి శాక్రమెంటో ఆధిక్యం ప్రదర్శించినా చివరి క్వార్టర్‌లో పేసర్స్ జోరు పెంచి స్కోరు సమం చేసి అదనపు సమయంలో విజయాన్నందుకున్నది. పేసర్స్ జట్టులో టి.వారెన్ 30, డొమంటాస్ శాబ్సన్ 21 పాయింట్లు సాధించగా, శాక్రమెంటో జట్టులో హారిసన్ బార్నెస్ 21, మార్విన్ బాగ్లే 12 పాయింట్లు సాధించారు. ఈ జట్ల మధ్య ఆదివారం రెండో మ్యాచ్ జరుగనుంది.

## జొకో సునాయాస విజయం



**టోక్యో:** జపాన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ లో ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ ఆటగాడు లూకాస్ పొలీని 6-1, 6-2 స్కోరుతో చిత్తుగా ఓడించాడు. భుజం గాయంతో బాధపడు తున్న జొకోవిచ్ ఈ విజయంతో బాగానే కోలుకున్నట్టు అవగతమౌతోంది. జొకో సెమీఫైనల్లో డేవిడ్ గాఫిన్ (బెల్జియం), చంగ్ హేయన్(దక్షిణ కొరి యా)ల మధ్య విజేతతో తలపడతాడు. జొకో ఎనిమిది ఏస్‌లను సంధించాడు. అంతేగాక మ్యాచ్‌లో ఒక్కసారికూడా డబుల్‌ఫాల్ట్ చేయలేదు. వీరిరువురూ ముఖాముఖి మూడుసార్లు తలపడగా అన్ని మ్యాచ్‌లలో జొకోదే విజయం. ఇతర మ్యాచ్‌లలో జాన్ మిల్మన్(ఆస్ట్రేలియా) జపాన్‌కు చెందిన టారొ డేనియల్‌పై 6-4, 6-0తో, రీలే ఒపెల్కా(అమెరికా) జపాన్ క్వాలిఫయర్ యసుత క యుచియమపై 6-3, 6-3తో గెలుపొందారు.

## క్వార్టర్స్‌లోనే ముగిసిన పోరు



**బీజింగ్ :** తిరిగి అంతర్జాతీయ టెన్నిస్ వేదికపై సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్న బ్రిటన్ ఆటగాడు ఆండీ ముర్రే చైనా ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెను తిరిగాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ పోరులో ముర్రే 2-6, 6-7(3) స్కోరుతో వరుస సెట్లలో టాప్ సీడ్ డొమినిక్ థీమ్ చేతిలో ఓడిపోయాడు. గత జనవరిలో తుంటి గాయా నికి శస్త్ర చికిత్స చేయించుకున్న 32 ఏళ్ల ముర్రే రెండు గంటల వ్యవధిలో పరాజయం చవిచూశాడు. తొలి సర్వీసు గేమ్‌నే కోల్పోయిన ముర్రే ఆపై కోలుకోలేకపోయాడు. ప్రేక్షకులు మద్దతు తెలుపుతున్నా ముర్రే పూర్వపు ప్రతిభను ప్రదర్శించలేకపోయాడు. కాగా థీమ్ సెమీస్‌లో రష్యా నాలుగో సీడ్ ఆటగాడు కరెన్ ఖచనొవ్‌ను సెమీస్‌లో ఢీకొంటాడు. కచనొవ్ ఇటలీకి చెందిన ఫాబియో ఫొగ్నినిపై మూడు సెట్ల పోరులో గెలుపొందాడు. మహిళల విభాగంలో ప్రపంచ నంబర్ వన్ ఆష్లే బార్టీ ఒక సెట్ కోల్పోయినా పుంజుకుని 4-6, 6-4, 6-3తో పెట్రా క్విటోవాపై గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. సెమీస్‌లో బార్టీ నెదర్లాండ్స్‌కు చెందిన కికి బెర్టెన్స్‌ను ఢీకొంటుంది.

# చాంపియన్లు కౌల్, కాటరినా

## ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్







**దోహా:** అథ్లెట్లకు సవాల్‌వంటి మల్టీ ఈవెంట్ పోటీలైన డెకథ్లాన్, హెప్టాథ్లాన్ పోటీలలో నికొలాస్ కౌల్(జర్మనీ), కాటరినా జాన్సన్-థాంప్సన్ స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. పది అంశాలతో కూడిన పురుషుల డెకథ్లాన్ పోటీలో జర్మనీ అథ్లెట్ నికొలాస్ కౌల్ మొత్తం 8691 పాయింట్లు సాధించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. చివరగా జరిగిన 1500మీ. పరుగును నికొలాస్ 4ని. 15.70 సెకండ్లలో పూర్తి చేయడం అతనికి బాగా కలిసొచ్చింది. ఎస్తోనియాకు చెందిన మైసెల్ యుబొ 8604 పాయింట్లతో రజతం, కెనడాకు చెందిన డామియన్ వార్నర్ 8529 పాయింట్లతో కాంస్యం గెలుచుకున్నారు. 21 ఏళ్ల కౌల్ డెకథ్లాన్ టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు. ఎనిమిది అంశాలతో కూడిన మహిళల హెప్టాథ్లాన్ టైటిల్‌ను బ్రిటన్‌కు చెందిన కాటరినా జాన్సన్ థాంప్సన్ 6981 పాయింట్లు సాధించి గెలుచుకుంది. బెల్జియంకు చెందిన నఫి సాటొ థియామ్‌నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నా కాటరినా గత 32 ఏళ్లలో అత్యధిక వ్యత్యాసంతో టైటిల్‌ను దక్కించుకుంది. థియామ్ 6677 పాయింట్లతో రజతం, ఆస్ట్రియాకు చెందిన వెరినా ప్రీనర్ 6560 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకున్నారు.

మహిళల 400మీ. పరుగు స్వర్ణాన్ని బహ్రెయిన్‌కు చెందిన సల్వా ఇద్ నాసర్ దక్కించుకుంది. సల్వా 48.14 సెకండ్లలో గమ్యాన్ని చేరి తన అత్యుత్తమ టైమింగ్(49.08సె.)ను మెరుగుపరచుకుంది. అంతేగాక గత 34 ఏళ్లలో ఈ అంశం లో ఇదే అత్యుత్తమ టైమింగ్. రియో ఒలింపిక్ చాంపియన్ షానె మిల్లర్ ఉబో(బహమాస్) 48.37 సెకండ్లతో రజతంతో సంతృప్తిచెందింది. జమైకాకు చెందిన షెరిక జాక్సన్ 49.47 సెకండ్లతో కాంస్యం గెలుచుకుంది.

మహిళల షాట్‌పుట్ స్వర్ణాన్ని చైనాకు చెందిన లి జియావొ గాంగ్ దక్కించుకుంది. లి జియావొ 19.94 మీ. దూరం షాట్‌పుట్ విసిరి అగ్రస్థానంలో నిలిచింది. ఆమెకు గట్టి పోటీ ఇచ్చిన జమైకా అథ్లెట్ డేనియల్ థామస్ డాడ్ 19.47మీ.తో రజతంతో సరిపెట్టుకుంది. జర్మనీకి చెందిన క్రిస్టినా స్వానిట్జ్ 19.17మీ.తో కాంస్య పతకం గెలుచుకుంది.

### భారత్‌కు నిరాశే

గురువారం నాటి పోటీల్లో భారత్‌కు చెందిన తేజిందర్‌పాల్ సింగ్, జిన్సన్ జాన్సన్ తమతమ అంశాల్లో క్వాలిఫయింగ్ రౌండ్‌తోనే వెనుతిరిగి తీవ్రంగా నిరాశ పరిచారు. పురుషుల షాట్‌పుట్‌లో తేజిందర్ పాల్ సింగ్ 20.43మీ.తో తన విభాగంలో ఎనిమిదో స్థానంలో నిలిచి పోటీనుంచి నిష్క్రమించాడు. అయితే తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరచుకున్నాడు. పురుషుల 1500మీ. పరుగులో జిన్సన్ జాన్సన్ 3ని. 39.86సె.తో గమ్యాన్ని చేరి తన హీట్‌లో పదో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించలేకపోయాడు.

# జమున శుభారంభం




## మహిళా బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్

**టోక్యో:** ప్రపంచ మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ జమున బొరొ(54కి.గ్రా.) శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పోరులో జమున మంగోలియాకు చెందిన మిచిద్మ ఎర్డెనెదలాయ్‌ను 5-0తో చిత్తుగా ఓడించింది. ఆరంభంలో నిదానించిన జమున పోరు సాగేకొద్దీ ఆధిపత్యం ప్రదర్శించి తిరుగులేని విజయాన్నందుకుంది. అస్సాం రైఫిల్స్ ఉద్యోగిని అయిన 22 ఏళ్ల జమున తదుపరి ప్రిక్వార్టర్స్‌లో అయిదో సీడ్, అల్జీరియాకు చెందిన ఔదాద్ సఫొను ఎదుర్కొంటుంది. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన సఫొకు తొలి రౌండ్‌లో బైలభించింది. ఈ టోర్నీలో తొలిసారి పాల్గొంటున్న జమున తొలి పోరులో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకుంది. ఫామ్‌ను అందిపుచ్చుకున్న తరువాత ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించింది. జమున పంచ్‌లు ప్రత్యర్థిని బలంగా తాకడంతో పలుమార్లు పాయింట్లు దక్కాయి. చివరి మూడు నిమిషాలలో జమునను ప్రతిఘటించడం మంగోలియా బాక్సర్ తరంకాలేదు. ఈ చాంపియన్‌షిప్‌లో 57 దేశాలకు చెందిన 224మంది మహిళా బాక్సర్లు వివిధ విభాగాలలో పోటీపడుతున్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ అత్యుత్తమంగా 2006లో నాలుగు స్వర్ణాలు సహా మొత్తం ఎనిమిది పతకాలు గెలుచుకుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
శనివారం 5 అక్టోబర్ 2019



# ఎడారిలో...

రాజస్థాన్ అనగానే మనకు గుర్తొచ్చేది ఏడారులు, ఇసుక దిబ్బలే. అయితే ఇక్కడి అమ్మాయిలు తమ జీవితాల్లోని కష్టనష్టాలనే ఎడారులను ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తున్నారు. అందుకు నిదర్శనంగా నిలుస్తున్న ఇద్దరు యువతులను గురించి-

# విరబూసిన ఆత్మవిశ్వాసం!

## రాజస్థాన్ నేషనల్ పార్కులో ఫారెస్టు గార్డులుగా అమ్మాయిలు

రాజస్థాన్‌లోని సుదాసరి అనే ఏడారి నేషనల్ పార్క్... బస్టర్డ్ అనే అంతరించి పోతున్న పక్షిజాతికి నిలయంగా ఉంది. ఈ పార్కు జైసల్మీర్ నగరానికి అరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పార్కులో తిరిగే బస్టర్డ్, ఇతర జాతుల పక్షులకు రక్షణగా తమ విధులను నిర్వహిస్తున్నారు పుష్ప, పుష్ట. వీరిద్దరూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివారు. దేశంలోనే అత్యంత తక్కువ నిష్పత్తిలో ప్రతి వెయ్యిమంది మగవారికి 888 మంది మాత్రమే ఆడవారు ఉన్న రాజస్థాన్‌లో...ఈ ఇద్దరు యువతులు మనుషులు తిరగని ఎడారి ప్రాంతంలో ఫారెస్ట్ గార్డులుగా పనిచేయటం విశేషమే. తమ జీవితాలను మరింత సౌకర్యవంతంగా మెరుగ్గా మార్చుకునేందుకు వారు ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ఈ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నారు.

మనుషుల అలికిడే లేని నిర్జన ప్రాంతంలో ఇద్దరు మహిళలు గార్డులుగా పనిచేయటం సాహసంగానే చెప్పాలి. పైగా నేటికీ బాల్యవివాహాలు, ఆడ భ్రూణ హత్యలకు పెట్టింది పేరుగా ఉన్న రాజస్థాన్‌లో...ఇద్దరు యువతులు ఒంటరిగా ఊరు అనేది లేని అడవిలో నివసిస్తున్న దృశ్యాలు ఆశ్చర్యకరంగానే అనిపిస్తాయి. పుష్ప పుష్ట నివసిస్తున్న విశాలమైన ఎడారి ప్రాంతంలో మట్టి గుడిసెలు, గొడలకు పెచ్చులు ఊడిపోయి అవసాన దశలో ఉన్నట్టుగా ఉన్న అటవీ శాఖకు సంబంధించిన ఒక ఆఫీసు కనబడతాయి. అక్కడ పనిచేసే సిబ్బంది, అప్పుడప్పుడు చలికాలంలో వచ్చే సందర్శకులకోసం ఆ ఆఫీసు పనిచేస్తుంది. పేర్లు ఒకేలా ధ్వనిస్తున్న పుష్ప పుష్టల వయసు కూడా దాదాపు ఒక్కటే. అయితే వారి జీవిత కథలు మాత్రం వేరు.

### భర్త మరణంతో...బయటకు వచ్చి....

పుష్పా షెఖావత్ వయసు 24. ఒక బిడ్డకు తల్లయిన ఈమె వితంతువు. భర్త రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కసుంబి అనే చిన్న పల్లెటూరు ఆమె సొంత ఊరు. ఇప్పటికీ సతి ఆచారాన్ని ఆదర్శంగా భావించే మనుషులున్న రాజస్థాన్‌లో వితంతువులు రెండవ వివాహం చేసుకోవటం అనేది చాలా తక్కువ. భర్త మరణించేనాటికి చదువుకుంటున్న పుష్ప...ఆ తరువాత డిగ్రీ, పిజి పూర్తి చేసింది. ఎంతో శ్రమకోర్చి ఈ ఉద్యోగాన్ని సంపాదించుకుంది. అయితే ఆమె ఈ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవటం వలన తన కొడుకుని వదిలి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. బిడ్డని తన తల్లిదండ్రుల వద్ద ఉంచి పుష్ప ఈ ఉద్యోగం చేస్తోంది. ఫారెస్ట్‌లో జాబ్ చేస్తూ... నగరానికి చాలా దూరంగా ఉండటం, రవాణా సదుపాయాలు తక్కువ కావటం వలన పుష్ప... ఇంటికి వెళ్లి కొడుకుని చూడాలంటేనే రెండురోజులు పడుతుంది. రెండవ పెళ్లి చేసుకోకపోవటం గురించి మాట్లాడుతూ...'నా కొడుకు పెద్దయ్యాక ఇష్టపడకపోవచ్చు. రాజస్థాన్‌లో ఆడవారి జీవితం చాలా భిన్నంగా ఉంటుంది. సినిమాల్లో చూపించినట్టుగా ఉండదు. నా తల్లిదండ్రులు చదువుకోలేదు. నాకు కొడుకన్నా ఉన్నాడు కదాని వారు సంతోషిస్తున్నారు.' ఫోన్‌లో కొడుకు ఫొటోలు చూసుకుంటూ చెప్పుకొచ్చింది పుష్ప. రాజస్థాన్‌లో వితంతువు లకు చాలా కట్టుబాట్లు ఉంటాయి. ఆమె బయటకు వచ్చి ఉద్యోగం చేయడానికి అనుమతి లభించడమే గొప్పవిషయంగా భావించాలి.

### ఉద్యోగం వచ్చే వరకు పెళ్లి వద్దని...

రెండవ అమ్మాయి పుష్టా పవార్ వయసు 25. ఆమె ఒక రైతు కూతురు. పోఖరాన్ వద్ద ఉన్న బల్లార్డ్ అనే గ్రామం ఆమెది. పుష్టకు కొత్తగా పెళ్లయింది. జీవితం పట్ల ఎన్నో కలలు కంటున్న నవ వధువు ఆమె. ఉద్యోగం కారణంగా ఆమె తన భర్తకు దూరంగా ఉంటోంది. ఫోన్‌లో నెట్ వర్క్ ఉంటే...కుటుంబ సభ్యులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. భర్త తరచుగా ఆమె వద్దకు వస్తుంటాడు. పుష్ట తల్లిదండ్రులు ఇద్దరూ చదువురానివాళ్లే అయినా వారు తమ పిల్లలందరినీ చదివించారు. పుష్టతో పాటు ఆమె తోబుట్టువులు అందరూ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. 'నా తండ్రి వ్యవసాయం చేస్తారు. ఈ రోజుల్లో రైతుగా బతకటం ఎంత కష్టమో ఆయనకు తెలుసు. మా గ్రామంలో చాలామంది అమ్మాయిలకు 18ఏళ్లు రాకముందే పెళ్లిళ్లు అయిపోతుంటాయి. కానీ నేను మాత్రం ఉద్యోగం వచ్చేదాకా పెళ్లి చేసుకోకూడదని బలంగా నిర్ణయించుకుని అలాగే చేశాను' అంటున్న పుష్ట... తన ఆశయాన్ని ఈ ఉద్యోగం ద్వారా సాధించింది.

### కనీస వసతులతో...

ప్రభుత్వం వీరికి కల్పించిన వసతి మట్టి ఇళ్లు. ఎలాంటి వినోద సాధనాలు ఉండవు. అయితే వారిద్దరూ మంచి స్నేహితులయ్యారు. ఇద్దరూ ఒకే గుడిసెలో ఉంటారు. కలిసి వండుకుంటారు. పనిలో కూడా కలిసిమెలసే ఉంటారు. తమ పర్యవేక్షణలో ఉన్న ప్రాంతంలో ఎలాంటి దురాక్రమణలు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపైన ఉంది. అలాగే పక్షులకు ఎల్లప్పుడూ నీళ్లు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే పై అధికారులకు తెలియపరచాలి.

'ఇది కష్టమైన ఉద్యోగమేమీ కాదు. కానీ ఊళ్లకు దూరంగా ఉండటానికి చాలామంది ఇష్టపడరు. ఎండాకాలం ఇక్కడ ఉష్ణోగ్రత యాభై డిగ్రీలకు చేరుతుంది. ఇసుక తుఫాన్లు వస్తే...మా ఇల్లంతా అడుగులోతు ఇసుక పేరుకుంటుంది. అన్నిరకాల ఆహారాలు దొరకవు. మేము ఎక్కువగా పప్పు ధాన్యాలు, బ్లాక్ టీ మీదే ఆధారపడతాం.' అంటూ వివరించింది పుష్ట. ఇక్కడ పనిచేసే సిబ్బంది అందరూ కలిసే ఆహారం తినడానికి ఇష్టపడతారు. ఆడవాళ్లకి సాధారణంగా రాత్రి డ్యూటీలు వేయరు. ఆ మేరకు సౌకర్యం పొందినందుకు గాను వారు వంట చేస్తుంటారు. చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులతో స్నేహంగా ఉండాలని ఉన్నా...వారి పశువులను అడవిలోకి రాకుండా ఆపటం వలన తమని వారు శత్రువులుగా చూస్తారని...తమకు పాలుసైతం అమ్మరని పుష్ప తెలిపింది.

### ఒంటరితనం బాధే...

ఒంటరిగా ఉండటం బాధే అయినా ఎప్పుడూ తమని తాము ఏదో ఒకపనితో బిజీగా ఉంచుకునేందుకు వీరు ప్రయత్నిస్తుంటారు. పోటీపరీక్షలకోసం చదువుతూ...జీవితంలో మరింత ముందుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్న ఈ ఇద్దరు యువతులు... ఆత్మవిశ్వాసం ఉంటే ఎడారి జీవితాల్లో కూడా ఆనంద కుసుమాలు విరబూస్తాయని నిరూపిస్తున్నారు.



# నింద మంచిదికాదు...జాగ్రత్త!

నింద...అంటేనే నిజం కానిది...కానీ అది అనుమానానికి దారి తీస్తుంది. అవమానపరుస్తుంది. దాంపత్య జీవనం దెబ్బతినడానికి బాటలు వేస్తుంది. ప్రతి చిన్నచితక విషయానికి మీ భాగస్వామిపై నిందలు వేయడం మొదలు పెట్టారంటే మీ బంధానికి మీరే తూట్లు పొడుచుకుంటున్నారని అర్థం. అందుకే నింద వేసే ముందు సమస్య లోతుల్లోకి తొంగి చూడాలి.. ఎందుకంటే మన కళ్లు మనల్ని మోసం చేయవచ్చు... నేను చూశాను ... కాబట్టి అదే నిజం అనుకుని చీటికి మాటికి నిందలు వేయడం సరైంది కాదని గుర్తించాలి. మరి నిందలు వేసే ప్రవర్తన వల్ల దాంపత్యం బీటలు వారుతుందని ఎలా గుర్తించాలి? అని ఆలోచిస్తున్నారా? గుర్తించడం కష్టమైన పని ఏమీ కాదు.. దానికి సంబంధించిన సంకేతాలు ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం!



✓ సోషల్ మీడియా వల్ల ఎంత మంచి జరుగుతుంతో... అంత చెడూ పొంచి ఉంటుంది. అందుకే సామాజిక మాధ్యమాల విషయాలు వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విషయానికి వస్తే ..మీకు దాంపత్య జీవితమే ప్రధానం, సోషల్ మీడియా పరిచయాలు,చాటింగ్‌లు ముఖ్యం కాదని మీరు భాగస్వామితో చెప్పారే అనుకోండి.... మీరు చెప్పింది సరైందని భావించిన మీ భాగస్వామి... మీమాటకు గౌరవమిచ్చి, మీరు చెప్పింది నమ్మి, పెళ్లికి ముందు తాను వాడిన డేటింగ్ యాప్స్ మొత్తం స్మార్ట్ ఫోన్ నుంచి తొలగించి వేస్తారు. కానీ చెప్పిన మీరు మాత్రం రహస్యంగా .. వాటితో కాలక్షేపం చేస్తున్నారు అనుకోండి... అలాచేస్తున్న మీకు....మీ భాగస్వామి కూడా చేస్తున్నారేమో అనే సందేహం మీ బుర్రను తొలుస్తుంది. అందుకే మీ భాగస్వామి ప్రొఫైల్‌ను రహస్యంగా తనిఖీ చేస్తుంటారు. ఏమాత్రం చిన్న సందేహం కల్గినా అతనిపై లేదా ఆమెపై నిందలు వేస్తారు.కాని ఇక్కడ నమ్మబలికింది మీరు.... మోసపూరిత స్వభావంతో కన్నింగ్‌గా ప్రవర్తిస్తుంది మీరు. కాని నిందలు వేస్తుంది మీ భాగస్వామి మీద. అలా చేస్తున్నారంటే..ఏదో ఒక రోజు మీ కన్నింగ్ స్వభావం బయపడుతుంది. అప్పుడు కూలేది మీ దాంపత్యమే. ఇలాంటి స్వభావంతో వేసే నిందలు, ప్రవర్తించే తీరు... మీ దాంపత్యం బీటలు వారుతుందనడానికి సంకేతంగా గుర్తించండి.

✓ మనిషి అన్నాక చిన్న చిన్న తప్పులు చేయడం సహజం..దాంపత్యంలోనూ అవి దొర్లుతుంటాయి. అలాంటి వాటి వల్ల సమస్య తలెత్తితే నిజాయితీగా తప్పు అంగీకరించి సర్దుకోవాలి. అలా కాకుండా సమస్య ఎవరి వల్ల తలెత్తినా.. వేలు మీ భాగస్వామివైపు చూపించి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు అనుకోండి. అది మీ దాంపత్యాన్ని ఎక్కడో ఒక చోట విడదీస్తుంది. మీరు మాత్రం మంచిగా ఉన్నారు,..మీ భాగస్వామి వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని చూపేవిధంగా.. ప్రవర్తిస్తున్నారంటే మీ సంసార నావకు మీరే తూట్లు పొడుచుకుంటున్నారని అర్థం. మీ తప్పును కప్పి పుచ్చుకుని మీ భాగస్వామి మీద నిందవేయాలని చూసే మీ స్వార్థ పూరిత స్వభావమే మీ దాంపత్యానికి గొడ్డలి పెట్టు.

✓ మీ భాగస్వామి గురించి మీరు చెడుగా ఆలోచిస్తున్నారా? ఎల్లప్పుడు అతనిని లేదా ఆమెని అనుమానిస్తూ అవమానిస్తున్నారా? అయితే మీరు వాస్తవానికి, నిందకు తేడా గ్రహించలేక..నిత్యం సందేహాలతో సతమతం అవుతున్నట్లు లెక్క. ఆ స్థితిలో ఉన్నారంటే మీరు నింద, నిజం, సందేహాల విషవలయంలో చిక్కుకున్నారని గుర్తించాలి. అలాంట మానసిక స్థితిలోని మీ ప్రవర్తన...మీ సంసారాన్ని మీరే నాశనం చేసుకునేలా చేస్తుంది. తస్మాత్ జాగ్రత్త!

# క్యాల్షియం విషయంలో... పాలకంటే...ఇవి మేలు!



**జున్ను :** ఇందులో క్యాల్షియం అత్యధికంగా ఉంటుంది. మొక్కలనుండి లభించే క్యాల్షియం కంటే పాల ఉత్పత్తుల ద్వారా లభించే క్యాల్షియంని మన శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. 28గ్రాముల జున్ను నుండి... మనకు రోజువారీ అవసరమైన క్యాల్షియంలో 33శాతం సమకూరుతుంది.

**పెరుగు :** ఇందులో మన ఆరోగ్యానికి మేలు చేసే మంచి బ్యాక్టీరియాతో పాటు క్యాల్షియం కూడా ఎక్కువగా ఉంటుంది. ఒక కప్పు పెరుగులో మనకు రోజువారీ అవసరమైన క్యాల్షియంలో 30శాతం లభిస్తుంది. కొవ్వు తక్కువగా ఉన్న కప్పు పెరుగులో మనకు రోజువారీ అవసరమైన క్యాల్షియంలో 45శాతం అందుతుంది.





**గింజల్లో :** వాము, గసాలు, నువ్వులు, సబ్జా గింజలు...వీటిలో కూడా మనకు క్యాల్షియం ఎక్కువగా లభిస్తుంది. ఒక్క టేబుల్ స్పూను గసాల్లో 126 మిల్లీగ్రాముల క్యాల్షియం ఉంటుంది. ఇది మనకు అవసరమైన రోజువారీ క్యాల్షియంలో 13శాతం. ఈ గింజల్లో క్యాల్షియమే కాకుండా ఖనిజాలు, విటమిన్లు సైతం పుష్కలంగా ఉంటాయి.

**సార్డిన్ చేపలు :** సార్డిన్ అనే చిన్నచేపలనుండి కూడా క్యాల్షియం ఎక్కువగా లభిస్తుంది. వీటి ముల్లులు కూడా తినేందుకు వీలుగా ఉండటం వలన వీటిలో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. 92 గ్రాముల చిన్న చేపల్లో మనకు రోజువారీ అవసరమైన క్యాల్షియంలో 35శాతం దొరుకుతుంది. వీటిలో మన మెదడుకి గుండెకు మేలుచేసే ప్రొటీన్లు, ఒమేగా ఫ్యాటీ ఆసిడ్లు సైతం ఉంటాయి.





**బాదంపప్పు:** బాదంపప్పులో అన్ని నట్స్‌లో కంటే ఎక్కువగా క్యాల్షియం ఉంటుంది. సుమారు 28గ్రాముల బాదం పప్పు నుండి మనకు అవసరమైన 8శాతం క్యాల్షియం లభిస్తుంది. వీటిలో పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, మెగ్నీషయం, మాంగనీస్, విటమిన్ ఇ సైతం ఉన్నాయి. వీటిని తినటం వలన బిపి తగ్గుతుంది. అలాగే మెటబాలిక్ డిజార్డర్లు వచ్చే రిస్క్ సైతం తగ్గుతుంది.

**పిల్లలకు పాలు అత్యంత పోషకాహారమని, పాలుతాగితేనే ఎముకలు బలంగా ఉండి వాళ్లు బాగా పెరుగుతారని...తల్లిదండ్రులు భావిస్తుంటారు. నిజమే.... క్యాల్షియం మనకు అత్యవసరమైన పోషకమే. మన శరీరం సవ్యంగా పనిచేయాలంటే క్యాల్షియం తగినంత ఉండాలి. క్యాల్షియం లేకపోతే ఎముకలకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. వయసు పెరుగుతున్నపుడు క్యాల్షియం అవసరం మరింతగా పెరుగుతుంది. ఎందుకంటే పెరుగుతున్న వయసులో మన శరీరం తక్కువ క్యాల్షియంని శోషించుకుంటుంది. క్యాల్షియం అనగానే మనకు గుర్తొచ్చేది పాలే అయినా పాలతో పాటు పలు రకాల ఆహారాల్లో ఇది మనకు మరింత ఎక్కువగా లభిస్తుంది. ఒక సగటు మనిషి రోజువారీ తీసుకోవాల్సిన క్యాల్షియం 1000 మిల్లీ గ్రాములు కాగా 50 ఏళ్లు దాటిన తరువాత 1200 మిల్లీగ్రాముల వరకు క్యాల్షియం అవసరం అవుతుంది.**



**పప్పు ధాన్యాలు:** వీటిలో ప్రొటీన్లు, జింక్, మెగ్నీషియం, పొటాషియంతో పాటు క్యాల్షియం సైతం పుష్కలంగా ఉంటుంది. కొన్నిరకాల చిక్కుడు గింజలనుండి క్యాల్షియం మరింత ఎక్కువగా లభిస్తుంది. గింజ నాలుగుపలకలుగా ఉండే గోవాబీన్స్‌లో క్యాల్షియం మరింత ఎక్కువగా ఉంటుంది. ఒకకప్పు ఉడికించిన ఈ రకం బీన్స్‌లో మనకు అవసరమైన క్యాల్షియంలో 24శాతం, ఒక కప్పు తెలుపు బీన్స్‌లో 13శాతం లభిస్తుంది.



**ఫిగ్ లేదా అంజీర:** ఎండిన అంజీరలో మన ఆరోగ్యానికి అవసరమైన క్యాల్షియం, పీచుతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. 28గ్రాముల అంజీరని తీసుకుంటే మనకు అవసరమైన క్యాల్షియంలో 5శాతం లభిస్తుంది. వీటి ద్వారా పొటాషియం, విటమిన్ కె సైతం ఎక్కువే లభిస్తుంది.

ప్రొటీన్ ద్వారా 26 గ్రాముల ప్రొటీన్ పౌడర్‌లో మనకు రోజువారీ అవసరమైన క్యాల్షియంలో 20శాతం లభిస్తుంది. రోజూ ఒకసారి ప్రొటీన్ డ్రింక్‌ని తీసుకోవటం వలన మంచి మోతాదులో క్యాల్షియంని పొందవచ్చు. ఇంకా సోయాపాలు, ముదురు ఆకుపచ్చని ఆకుకూరల నుండి కూడా పాలకంటే ఎక్కువగా క్యాల్షియంని పొందవచ్చు.

# దినఫలాలు

**మేష రాశి**
ఉత్సాహంతో చేపట్టిన పనులు చకచకా పూర్తి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో కష్టసుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృషభ రాశి**
కొత్త వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. పాత బాకీలు వసూలవుతాయి. ప్రముఖుల నుంచి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగులు ఇంక్రిమెంట్లు, పదోన్నతులు పొందుతారు.

**మిథున రాశి**
పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కర్కాటక రాశి**
ఎంతగా కష్టపడినా ఫలితం కనిపించదు. వ్యవహారాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమై ఊరట చెందుతారు.

**సింహ రాశి**
నూతన పరిచయాలు పెరుగుతాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. దూరప్రాంతాల నుంచి శుభ వార్తలు అందుకుంటారు.

**కన్యా రాశి**
వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా కుటుంబసభ్యుల సహాయసహకారాలు అందుకుంటారు. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**తులా రాశి**
ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. బంధువుల నుంచి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఉద్యోగ, వివాహయత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చిక రాశి**
ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు ఉంటాయి. స్వల్ప ధన లాభం.

**ధనూరాశి**
దూర ప్రాంతాల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. విందువినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. జీవిత భాగస్వామి సలహాపై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మకర రాశి**
పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో పాల్గొని విజయం సాధిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. భూ గృహాలు కొనుగోలు చేస్తారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభ రాశి**
ఋణాలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. అనుకోని విధంగా లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

**మీన రాశి**
చిన్ననాటి మిత్రుల నుంచి వ్యాపారపరమైన విలువైన సమాచారం అందుకుంటారు. శ్రమ తప్ప ఫలితం ఉండదు. దూర ప్రాంత ప్రయాణాలు లాభిస్తాయి. ఆకస్మిక ధన లాభం పొందుతారు.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

## నేటి అవతారం
# సరస్వతి



(గత సంచిక తరువాయి భాగం)

బ్రహ్మరూపంలో ఉన్న రజోగుణధారి అయిన పరమపురుషుని శక్తి 'సరస్వతి'. రసముతో కూడినది సరస, సరసము కలది సరస్వతి. రసము అనగా రుచి (కోరిక). కోరికకు మూలం సరస్వతి కావున ఆ కోరికను గెలిచిన నాడే పురుషుడు పూర్ణుడవుతాడు. కోరికను గెలవడానికి కావాల్సిన జ్ఞానాన్ని ప్రసాదించే తల్లి కావున జ్ఞానసరస్వతిగా వ్యవహరిస్తారు. జ్ఞానమును శ్వేతవర్ణంతో పోలుస్తారు కావున ఈమె ''కుందేందు తుషార హార ధవళా'' అనగా మల్లె, చంద్రుడు, మంచు వలె తెల్లని అకారము కలదని అర్థం. తెల్లని పద్మముపై ఆసీనురాలై తెల్లని వస్త్రం ధరించి వీణ, పుస్తకం, జపమాల కలిగి ఉంటుంది. జ్ఞానాన్ని ప్రసాదించే విద్యకు ప్రతీక పుస్తకము. అలాగే, జ్ఞానంతో కలిగే ఆనందానికి ప్రతీక వీణ. వీణ పలికించే సప్తస్వరములే ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి. ఇంద్రియాలను ఆనందింప చేయాలంటే కావాల్సిన జ్ఞానం జపము, తపములతో కలుగుతుంది. జపమాల, పద్మాసనం జపతపాలకు సూచిక. ఈమె బ్రాహ్మీముహూర్తం (సూర్యోదయం కంటే ముందున్న అరుణోదయం) నుండి మధ్యాహ్న కాలం వరకు ఆవిర్భవించిన సమయముగా చెబుతారు. సరస్వతి ప్రకాశమయ రూపము కలిగి ఉంటుంది. కావున ఈమెను 'తార'గా వ్యవహరిస్తారు.

**హిరణ్య గర్భః సమవర్తతాగ్రే**
**భూతస్య జాతః పతిరేక ఆసీత్**
**సదాధార పృథ్వీం ద్యాముతేమామ్**
**కస్మై దేవాయ హవిషావిధేమ**

ఇది హిరణ్యగర్భుడైన బ్రహ్మస్తుతి. విశ్వాధిష్ఠాత అయిన ఈ హిరణ్యగర్భుని శక్తిని తార లేదా సరస్వతిగా వ్యవహరిస్తారు. ప్రకాశ సమయంలో అవతరించిన తల్లి కావున తార అని అంటారు. జ్ఞానానికి, ఆనందానికి, ఉనికికి, సరస్వతి మూలం కావున ఈమెను మూలా నక్షత్రం నాడు ఆరాధిస్తారు.

సరస్వతి దేవికి ఇష్టమైన నైవేద్యం పూర్ణాలు, భక్ష్యాలు, పానకం, నువ్వుండలు.



డా॥ కందాడై రామానుజాచార్య

# శ్రీదేవీ వైభవం

పూర్ణ శక్తి అయిన జగన్మాత సాత్త్విక, రాజస, తామసిక దివ్య గుణాలకు ప్రతీకలే సరస్వతీ, మహాలక్ష్మి, మహాకాళి. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలు ధవళ, అరుణ, కృష్ణవర్ణాలతో ప్రకాశిస్తున్న దివ్య మూర్తులివి. ఆ పూర్ణ శక్తి నుంచి అంశమాత్ర శక్తుల్ని స్వీకరించి తమ ఉనికినీ, మనికినీ, కర్మలనీ నిర్వహిస్తున్నారు దేవతలు.

జగన్మాత ముగ్గురు అమ్మల మూలపుటమ్మ. బ్రహ్మ విష్ణు శవాత్మిక. సృష్టి, స్థితి, లయకారిణి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తి స్వరూపిణి. ఆమెయే మూల ప్రకృతి. జగన్మాతను, ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుంచి నవమి వరకు శరన్నవరాత్రులలో ఆరాధిస్తారు. తొమ్మిది రోజుల్లోను, శక్తి ఆరాధన రాత్రి సమయానికే పరిమితమని శాస్త్రాలు అంటున్నాయి. అందుకే శరన్నవరాత్రులుగా వ్యవహరిస్తారు. జగన్మాత ఆరాధనలను 'రాత్రి వ్రతం' అంటారు. రాత్రి దేవినే మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాలలో ఆరాధిస్తారు. తొమ్మిది రోజులను నవ అహోరాత్రాదులుగా పగలు, రాత్రి అనే భేదం లేకుండా పూజిస్తారు. నవ శబ్దం పరమేశ్వరునికి, రాత్రి శబ్దం పరమేశ్వరికి ప్రతీకగా చెప్పబడుతోందని నిర్ణయ సింధు తెలుపుతోంది. ఈ విధంగా నవరాత్రి ఉత్సవాలు పార్వతీ పరమేశ్వరుల, శివశక్తుల, ప్రకృతీ పురుషుల ఆరాధనగా చెప్పబడుతోంది.



నవరాత్రులలో జగన్మాతను మొదటి మూడు రోజులు మహాకాళిగా, తరువాత మూడు రోజులు మహాలక్ష్మిగా , చివరి మూడు రోజులు మహాసరస్వతిగా ఆరాధిస్తారు. అసురులందరినీ తుదముట్టించి విజయం సాధించిన మాతను అపరాజితగా, శ్రీరాజరాజేశ్వరిగా దశమినాడు ఆరాధిస్తారు. అదే విజయ దశమి.

దేవీ వైభవాన్ని ద్విగుణీకృతం చేస్తూ, మొదటి మూడు రోజులు మహాకాళికి కౌమారి, మాహేశ్వరి, వారాహి తోడుగా ఉంటారు. తరువాతి మూడు రోజులు మహాలక్ష్మి, వైష్ణవి, ఇంద్రాణి, చివరి మూడు రోజులు బ్రాహ్మీ, నారసింహీ, చాముండీ సహాయంగా ఉంటారు. వీరు మహాలక్ష్మీ సరస్వతులతో పాటు దనుజులను హతమారుస్తారు. వీరు జగన్మాత అంశలుగా ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులకు ప్రతీకలు.

ఈ ముగ్గురమ్మలు విశ్వకారణమైన దిగ్యగుణాలకు సంకేతాలు. ఆయా గుణాలకు ప్రతీకలుగా ధవళ, అరుణ, కృష్ణవర్ణాలతో శోభిల్లుతూ ఉంటారు.

జదగంబ సమస్త దేవతలకు శక్తినిచ్చే తల్లి. జగన్మాతను ఆరాధిస్తే దేవతలందరినీ ఆరాధించినట్లే. దేవీ శక్తి అంశమాత్రం చేతనే తమ ఉనికినీ, మనికినీ కాపాడుకుంటున్నారు దేవతలందరూ. బ్రాహ్మీ, వైష్ణవీ, మాహేశ్వరి, కౌమారి, ఇంద్రాణి, వారాహీ, నారసింహీ సప్త మాతృకల నామాలు. శైలపుత్రీ, బ్రహ్మచారిణీ, చంద్ర ఘంటా, కూష్మాండా, స్కందమాతా, కాత్యాయినీ, కాళరాత్రి, మహాగౌరీ, సిద్ధిదాత్రి. వీరు నవ దుర్గలు. మధు కైటభులు, మహిషాసురుడు, శుంభ నిధంభులు వారి వారి పరివారాన్ని అంతమొందించడంలో జగన్మాత నుంచి ఆవిర్భవించిన శక్తి రూపాలు.

ఆదిపరాశక్తియే లలితా త్రిపుర సుందరి. మణిద్వీపంలో కొలువై ఉన్నది. భండాసురుని వంటి రాక్షస సమూహాన్ని నిర్జించిన పరదేవత.

రాక్షస సంహారానంతరం విజయిమై, అపరాజితగా శ్రీరాజరాజేశ్వరిగా, దుర్గగా దశమినాడు సమస్త జీవకోటి చేత పూజలందుకుంటున్నది. దేశీయులందరూ విజయ దశమిగా వ్యవహరిస్తూ, దేవీ వైభవాన్ని నెమరు వేసుకుంటూ ఆనందాబ్ధిలో మునకలు వేస్తారు. దేవీ ఆరాధనలో అందరూ ఆమె అనుగ్రహానికి పాత్రులమవుదాం.

ఏ. సీతారామారావు

## చింతన
# ఇతిహాస పురాణాలలో దసరా



శ్రీమద్రామాయణ, భారత, భాగవతాల మేలు కలయిక దసరా. ఇతిహాసాలు, పురాణాలకు దసరా పండగకీ సంబంధం ఉంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినాడు దీక్ష వహించి, కలశ స్థాపన గావించి, దేవిని ఆహ్వానించడంతో ఈ దసరా పండగ ఆరంభమవుతుంది. ఒక్కో రోజున ఒక్కో విధంగా అమ్మవారిని కొలుసార్తనే విషయం తెలిసిందే. అష్టమినాడు బతుకమ్మను పూజించే ప్రాంతీయాచారం కూడా ఉంది. నవమి నాడు చండీ, లక్ష్మీ పూజలు చేసి హోమాదులతోను, విశేష పూజలతోను దేవీ నవరాత్రి దీక్షను పరిసమాప్తి గావిస్తారు.

దశమినాడు నైవేద్యానంతరం ఉద్వాసన చెప్పి విగ్రహాలను ఊరేగింపుగా తీసికెళ్లి నదీ జలాలలో నిమజ్జనం చేస్తారు. దీనినే మహాపూజ అనీ, ప్రస్థానమనీ, గౌరమ్మ నీళ్లాట అనీ అంటారు. ఈ రోజుల్లోనే కన్యలను పూజిస్తారు. ముత్తయిదువులను అఖండ సౌభాగ్యానికై పూజిస్తారు. మంగళ గౌరిగా భావించి పూజిస్తారు. అమ్మవారు లోహుడనే రాక్షసుని చంపి, ఖండాలుగా చేయగా, అవి లోహములైనవని ఆమె చేయి పడి మనుషులకు ఉపయోగకరంగా మారిన ఆ లోహాలతో చేసిన ఆయుధాలను పూజిస్తారు. ఈ పూజలను ఆ నాటి రాజులు ఎంతో భక్తి శ్రద్ధలతో 'లోహాభిస్మారక పూజ' అనే పేరుతో జరిపేవారు. ప్రభువులకూ, ప్రజలకూ మధ్య అవగాహన ఏర్పడేందుకు గాను ఈ దసరా రోజుల్లో వీరులకు పరాక్రమంలోనూ, శౌర్య బల ప్రదర్శనలలోనూ, పోటీలు నిర్వహించేవారు. కేవలం వీర పూజలే కాక నట గాయకుల ప్రదర్శనలూ, సన్మానాలూ ఉండేవి. వీటి వలన ప్రజలకు ప్రభువుల యెడ భక్తి గౌరవాలూ, ప్రజల పట్ల ప్రభువులకు ప్రేమానురాగాలు పెంపొందేవి. ఆ రోజుల్లో శ్రీకృష్ణదేవరాయలు పండిత గోష్టులను, భువన విజయం పేరిట నిర్వహించేవారు. మైసూరులో ఈ దసరా ఉత్సవాలను నేటికీ అత్యంత వైభవంగా నిర్వహిస్తూనే ఉన్నారు.

పితృవాక్యపాలకుడు, ధర్మ స్వరూపుడైన శ్రీరామచంద్రుడు ఈ రోజునే రావణునిపై దండెత్తి పోగా ఆ ధర్మ మూర్తికి జంతువులూ, పక్షులూ, సాగర భూచరాలు, దేవతలు, ఋషులు, చివరకు శత్రు వర్గం వాడైన విభీషణుడు కూడా సహాయం అందించి విజయానికి తోడ్పడ్డారు.

ముఖ్యంగా హనుమంతుడు, సుగ్రీవుడు, అంగదుడు వంటివారు చేసిన సహాయాన్ని సంస్మరించుకోవడానికా అన్నట్టు దసరా పండగల్లో పిల్లలు కోతి బొమ్మలను చేతికి ధరించి వేడుక చేసుకునేవారు. దశమినాడు సీమోల్లంఘనం సంప్రదాయం. అనగా పొలిమేరను దాటడం. దానినే రామాయణానికి అన్వయిస్తూ శ్రీరామచంద్రుడు సముద్రాన్ని దాటడానికి తానున్న ప్రదేశం పొలిమేరలు దాటి లంక వరకూ వెళ్ళాడని చెబుతారు. ఆ రోజున మైదానాల్లో రావణుని బొమ్మను నిలపడం దానిపై రామ వేషధారుల చేత బాణం వేయించడం చేస్తారు. అంటే పొలిమేర దాటి వెళ్లిన రాముడు లంకకు చేరి రావణుని సంహరించడానికి దానిని ప్రతీకగా పేర్కొంటారు.

ఇక పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలను శమీ వృక్షంపైదాచి ఉంచారు. ఉత్తర గోగ్రహణ సమయంలో అర్జునుడు శమీ వృక్షంపై ఉన్న తమ ఆయుధాలను దింపించి కౌరవులపై విజయం సాధించాడు. ఆ రోజు విజయ దశమి. అర్జునుడు కూడా ఆ రోజున విజయం సాధించాడు. ఈ కథ కారణంగా విజయదశమి రోజున శమీ వృక్షాన్ని పూజించి, దాని ఆకులు శిరస్సున ధరించి, దైవ మందిరంలో ఉంచే ఆచారం వచ్చిందని చెబుతారు. దీన్నే జమ్మి కొట్టడం అంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకూ మహిషాసురుని, రక్తబీజుని, శుంభనిశుంభులను, దేవి వివిధ రూపాలు ధరించి సంహరించింది. ఆదిశక్తి, కాళి, దుర్గ, భ్రామరి, రక్తదంతి, మాతంగి, శాకంబరి, నందిని, లక్ష్మి సరస్వతులు తొమ్మిది రూపాలు ధరించడం చేత నవదుర్గలుగా పిలవబడుతున్నారు. లక్ష్మీదేవిని ఆరాధించే వైష్ణవులను, పార్వతీ దేవిని ఆరాధించే శైవులను, అమ్మవారిని కొలిచే శాక్తేయులను త్రివేణీ సంగమం వలె సమన్వయపరుస్తున్న పండగ దసరా. నాస్తికతపై ఆస్తికత జయధ్వజపతాకయే దసరా.



డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

# బ్రహ్మోత్సవ సంరంభం

బ్రహ్మోత్సవాల్లో నేడు శ్రీవారు హనుమంత, స్వర్ణ రథ, గజ వాహనాలపై దర్శనమిచ్చి భక్తులను అనుగ్రహిస్తారు.



హనుమంత వాహనం



స్వర్ణ రథం



గజ వాహనం

## సంగీత ఝరి సరస్వతి

సంగీతం సరస్వతి మయం
సర్వోన్నత సంప్రదాయం
రసమయి రమణీయ కమనీయం
స్వరోన్నత రాగాలాపనం
తీయని రుచుల సంగీతం
సంగీతం సరస్వతీ మయం
సంగీతం ఘన వాగ్గేయకార
గీర్వాణం మహనీయ సవనం
తందన తాన శబ్దపూర్వకం
సరస్వతీ సమ్మోహనం
నవరసభరితం
సంగీతం సరస్వతి మయం
స్వరరాగ సుధారసభరితం
లయ విన్యాసం మృదంగ నాదం
శ్రుతిగతి సంగమనం సంగీతం
స్వర సమ్మేళనం వాగ్దేవీ వరం
సంగీతం సరస్వతి మయం

- రాళ్ళపల్లి రామసుబ్బారావు
9998269665

# బుడిబుడి అడుగులు



విద్యాధర్ ప్రభుత్వ కార్యాలయంలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. అతినికి భార్య ఇద్దరు మగపిల్లలు. ఒక ఆడపిల్ల. పెద్ద కుమారుడు భీమేష్ డిగ్రీ పూర్తి చేసుకుని ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి ఒక మగపిల్లవాడు కలిగాడు. ఆ పిల్లవాడికి ఏడాది వయస్సు ఉంటుంది. విద్యాధర్ చిన్న కుమారుడు. చిన్న కుమార్తె చదువు కుంటున్నారు. అందరూ కలిసి ఒక ఇంట్లో నివసిస్తున్నారు. విద్యాధర్ ప్రతి రోజూ కార్యాలయం నుండి ఇంటికి రాగానే స్నానపానాదులు పూర్తి చేసుకుని ఏడాది వయస్సున్న తన మనుమడు సాకేత్‌తో కాలక్షేపం చేస్తుంటాడు. సాకేత్ బుడిబుడి అడుగులు వేస్తూ తాత విద్యాధర్ చేసే గారాబానికి మురిసిపోయేవాడు. తాతా మనుమడు ఒక ప్రత్యేక ప్రపంచంలోని వెళ్లిపోయి అలౌకికానందాన్ని పొందుతుంటారు. ఇంట్లోవారికి ఇవేవి పట్టవు. రాత్రి ఎవరు ఎవరితో మాట్లాడుకోవడానికి అవకాశమే ఉండేది కాదు. చిన్నారి సాకేత్‌ను ఎవరూ పట్టించుకునే వారు కాదు. తాత విద్యాధర్ ఒక్కడే తన మనుమడు సాకేత్‌తో ఎన్నో కబుర్లు చెబుతుంటే మాటలు రాని ఆ చిన్నారి ఆనందంతో పరవసించిపోయి ఊకొడుతూ ఉండేవాడు. తన మనుమడి నవ్వు చూసి విద్యాధర్ మురిసిపోతుంటాడు. ఇవేవి మిగిలిన కుటుంబ సభ్యులకు పట్టేవి కావు. విద్యాధర్ భార్య, చిన్న కుమార్తె, పెద్ద కోడలు రాత్రిపూట టివికి అతుక్కుపోయి సీరియల్స్ చూస్తుంటారు. పెద్ద కుమారుడు ఇంటికి రాగానే సెల్‌ఫోన్ తీసుకుని వాట్సాప్‌లో లీనమయ్యేవాడు. చిన్న కుమారుడు కళాశాల నుండి రాగానే తన ల్యాబ్ టాప్‌లో ఫేస్ బుక్‌లో స్నేహితులతో చాటింగ్ చేస్తూ కాలక్షేపం చేసేవాడు.

ఒక రోజు విద్యాధర్ కుటుంబ సభ్యులను మందలించాడు.

మీరంతా మీమీ పనుల్లో లీనమై పోతున్నారు. చిన్నారి సాకేత్‌తో ఎవరూ సరిగ్గా మాట్లాడటం లేదు. చిన్న పిల్లలతో మనం గారాబం చేస్తూ ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండాలి. మనం మాట్లాడిన మాటలు పిల్లల మెదడుకు తాకుతాయి. ఆ మాటలు విని పిల్లలు బదులు మాట్లాడే ప్రయత్నం చేస్తారు. అప్పుడే వాళ్లకు త్వరగా మాట్లాడటం వస్తుంది. మనం ఎటువంటి మాటలు పిల్లలకు వినిపించకపోతే వాళ్లు మూగవాళ్లయ్యే ప్రమాదం ఉంది. మన ఇంటి పిల్లవాడికంటే టీవీ సీరియళ్లు, వాట్సాప్‌లు, ఫేస్ బుక్‌లు ఎక్కువకాదు కదా? అని సున్నితంగా చెప్పాడు విద్యాధర్. ఆ రోజు నుండి కుటుంబ సభ్యులలో పెనుమార్పు వచ్చింది. కొద్దిసేపు ఆధునిక సాంకేతికత విజ్ఞానంతో కాలక్షేపం చేసినప్పటికీ చిన్నారి సాకేత్‌తో మాటలు చెప్పడం వల్ల అనతికాలంలోనే ఆ చిన్నారి అన్ని మాటలు నేర్చుకుని బదులివ్వడం మొదలుపెట్టాడు. ప్రతి ఒక్కరూ చేయిపట్టుకుని బుడిబుడి అడుగులు వేయించడంతో సాకేత్ పరుగులు తీసే నడక నేర్చుకున్నాడు.

- షేక్ అబ్దుల్ హకీం జాని
9949429827



## సైన్స్ సంగతులు

# ఇసుకులో తాడన బలం తక్కువే!



కదిలే వస్తువుకు ద్రవ్యవేగం ఉంటుంది. వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధాన్నే ద్రవ్య వేగం ఉంటుంది. వస్తువు ద్రవ్యరాశి వేగాల లబ్ధాన్నే ద్రవ్యవేగం అంటారు. ఎవరన్నా పడ్డాం అంటే అర్థం ఏమిటంటే ఎక్కువ ద్రవ్యవేగం నుంచి దాదాపు శూన్య ద్రవ్య వేగాన్ని పొందడమన్నమాట. ఎందుకంటే మన క్రిందపడ్డప్పుడు ఇక ఏ మాత్రం ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. అటువంటి పరిస్థితి ఉందంటే వేగం శూన్యమయినట్టే అర్థం.

తాడనబలం అంటే ద్రవ్యవేగంలో కలిగే మార్పులు ప్రమాణకాలంలో ఎంత అన్నవిషయం. అంటే పడే వస్తువు నేల మీద అతితక్కువ వ్యవధిలో అత్యంత ఎక్కువ తాడనబలాన్ని కలిగి ఉంటుంది. కానీ న్యూటన్ మూడో నియమం ప్రకారం నేల మీద పడే వస్తువు లేదా వ్యక్తి కలిగించే బలానికి వ్యతిరేక దిశలో అంటే బలం తిరుగుదిశలో వ్యక్తి మీద లేదా వస్తువు మీద కలగడం వల్ల ఆ బల ప్రభావంలో వస్తువు పగిలిపోవడమో లేదా వ్యక్తికి గాయాలు కావడమో జరుగుతుంది.

ఇసుకులో మనిషి పడినప్పుడు దాని ప్రభావం తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఇసుక లూజుగా, రేణువుల కుప్పగా ఉండటం వల్ల పడే వస్తువు లేదా వ్యక్తి వేగం క్రమేపీ తగ్గుతుంది కానీ ఒక్క ఉదుటున కాదు. ఇలా క్రమేపీ వేగం లేదా ద్రవ్య వేగం తగ్గడం వల్ల తాడన బలం కూడా తక్కువేనన్న మాట. ఈ సూత్రం ప్రకారమే కుషన్ కుర్చీల మీద, స్పాంజీ పరుపుల మీద మనకు హాయిగా అనిపిస్తుంది.

# ఎత్తుగా పెరుగుతుంది



టేకు చెట్టు 80 నుంచి 100 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని కలప బరువు తక్కువగా, పటిష్టంగా ఉంటుంది. ఇది ఎక్కువకాలం మన్నికగా ఉంటుంది. వీటి ఆకులు కూడా పెద్దగా ఉంటాయి. అన్ని కలపల్లో టేకు కలప ధర ఎక్కువగా ఉంటుంది. టేకు కలప రెండు వేల సంవత్సరాల నుంచి ఉన్నట్టు పలు రికార్డులు సూచిస్తున్నాయి. భారత్, బర్మా, థాయ్‌లాండ్ ప్రాంతాల్లో ఇది విరివిగా దొరుకుతుంది. ఫిలిప్పీన్స్ ద్వీపం, జావా మలాయా ద్వీపాల్లో కూడా దొరుకుతుంది. టేకు చెట్టును 100 సంవత్సరాల తర్వాత కూడా టేకు కలపను వినియోగించుకోవచ్చు. ఇంతకు మునుపు టేకు చెట్టును ప్రభుత్వం మాత్రమే పెంచేది. కానీ ప్రస్తుతం సామాన్య ప్రజలు కూడా టేకు చెట్టును పెంచుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.

# పారాషూట్ తయారీ




చాలా సులభతరమైన పారాషూట్ తయారుచేయండి.

## కావాల్సిన పదార్థాలు

ప్లాస్టిక్ కవర్ / బ్యాగ్
స్ట్రింగ్
సిసర్స్
స్కాచ్ టేప్
మీకు నచ్చిన ఆకారంలో తయారు చేసుకోవచ్చు.

## చేయాల్సిన విధానం


1


5


2


3


4

1. గుండ్రని ఏ వస్తువునైనా తీసుకుని దానిపైనా గుండ్రని గీత గీసి ఆ ప్రకారం కత్తిరించండి
2. ఎనిమిది పాయింట్ల మీద మార్క్ చేయండి. సర్కిల్ చివర్లో ఈ పాయింట్లు ఉండాలి. ఒకదాని కొకటి సమానంగా గ్యాప్ ఉండే విధంగా జాగ్రత్తపడాలి.
3. ఎనిమిది దారాలు కూడా సమాన దూరంలో ఉండాలి. ప్రతీది 50 సెంటీమీటర్ల పొడవు ఉండాలి. ప్రతీ దారం చివర్లో మార్క్ చేసిన పాయింట్ల వద్ద కట్టాలి.
4. వదులుగా ఉన్న చివర్ల వద్ద దారాలు ముడివేయాలి. రాయికట్టిన టేపును దీనికి కట్టాలి.

ఎప్పుడైతే యాక్షన్ ఫిగర్ లేదా స్టోన్‌ను పై నుంచి క్రిందికి వేసినట్లయితే పారాషట్ ఓపెన్ అవుతుంది. మెల్లిమెల్లిగా క్రిందికి దిగిపోతుంది.

## ఆలోచించండి

వస్తువు క్రిందికి దిగుతున్నప్పుడు గురుత్వాకర్షణ శక్తి తగ్గిపోతుంది. పారాషట్ వస్తువుకు అటాచ్ అయితే మాత్రం వదిలినప్పుడు పారాషూట్ ఓపెన్ అవుతంది. దీంతో ఉపరితలం వైశాల్యం పెరుగుతుంది. దీనివల్ల గాలి దీనిక్రింది ఉండిపోతుంది. దీనివల్ల వస్తువు క్రిందికి దిగే సమయంలో పారాషూట్‌కి గాలి అడ్డుపడి మెల్లిమెల్లిగా దిగిపోతుంది.

## పారాషూట్ ఉపయోగాలు

పారాషూట్ ఉపయోగాలు చాలా ఉన్నాయి. ఎవరైనా ఎత్తయిన ప్రాంతాల్లో ఉన్నప్పుడు ప్రమాదవశాత్తు క్రిందికి దిగాల్సి వస్తే పారాషూట్ ఉపయోగిస్తారు. సైనికులు ఎక్కువగా దీనిని వినియోగిస్తుంటారు. ఫైటర్ జెట్స్ కూడా దీనిని విరివిగా ఉపయోగిస్తాయి.



# ఇంద్రజిత్తు కుంభకర్ణుల వధ

బాలల రాగరామాయణం

వానరులాధన్వంతరి
వాస్తవాన్ని గుర్తించీ
తక్షణమే సంజీవిని
లక్ష్మణునికి వలయుననగ
హనుమంతుడు హిమగిరులకు
అమాంతంగ ఎగిరి తెచ్చె!
మరణం రీతిపడిపోయిన
లక్ష్మణునికి తెలివి వచ్చె!
అది తెలిసిన ఇంద్రజిత్తు
అంతము చేయగ నెంచె
కానీ లక్ష్మణుని కరకు
టమ్ము తోడ కడకు చచ్చె!
అదిగాంచిన రావణుండు
హతాశుడై సగము చచ్చె!
గుట్టలాంటి
దేహముతో
మట్టు పెట్టవానరులను
కుంభకర్ణుడే తెంచె!
కుడ్యము లా ఎదురు నిలిచె!
విస్తుపోయి వానరులే
విగత జీవులై పొనగ
భారీకాయుని రాముడు
బ్రహ్మాస్త్ర ము తోడ కూల్చె!
అదిగాంచిన కపి సేనకు
ఆనందమ్మే హెచ్చె!
క్రుద్ధుడైన రావణుడే
యుద్ధరంగమునకు
వచ్చె!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్ :9246541699

# పజిల్ స్పైడర్ స్కోప్

ఎడమ వైపు బ్లాంక్‌లో ఈ బొమ్మ విడిభాగాలున్నాయి. ఒకసారి ఈ బొమ్మ చూడండి. కంప్లీట్ చేసి రంగులేయండి.





# నేనెవర్ని?



☞ నేనెప్పుడూ ఎప్పుడూ మీతో ఉంటా, పెరుగుతుంటా కానీ తరగను. మరి నేనెవరో చెప్పగలరా?

☞ నేను రంగు రంగుల్లో ఉంటాను. గాలి పీలిస్తే పెద్దగా మారిపోతాను. గాలి ఎక్కువయ్యిందో చనిపోతాను. మరి నేనెవరో చెప్పగలరా?

## బొమ్మలో దాగిన రహస్యం

ఇక్కడ వేసవి నుంచి ఉపశమనం కలిగించే సాధనాలునన్నాయి. అవేంటో చెప్పుకోండి.




ఎన్టీఆర్,రామ్‌చరణ్

# కోకాపేట సెట్లో

ఆర్ ఆర్ ఆర్ చిత్రం షూటింగ్ తిరిగి హైదరాబాద్‌లో మొదలైంది. ఎన్టీఆర్,రామ్‌చరణ్ కథానాయకులుగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం కోసం ఇటీవల బల్గేరియాలో ఓ షెడ్యూల్‌ను పూర్తిచేసుకుని యూనిట్ తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. అక్కడ ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌తో పాటు కొన్ని ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించినట్లు సమాచారం. బల్గేరియా షెడ్యూల్లో ఎన్టీఆర్ మాత్రమే పాల్గొన్నారు. అదే సమయంలో రామ్‌చరణ్ తాను నిర్మాతగా తీసిన సైరా...చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో ఆయన లేని సన్నివేశాలను బల్గేరియాలో తీశారు. బుధవారం నుంచి హైదరాబాద్ పరిసరాల్లోని కోకాపేటలో నిర్మించిన సెట్లో తాజా షెడ్యూల్‌ను ఆరంభించారు. ఈ షెడ్యూల్లో ఎన్టీఆర్‌తో పాటు రామ్‌చరణ్, ఇతర ముఖ్యతారాగణం పాల్గొంటారని సమాచారం. చిత్రం ఆరంభంలో జరిగిన షెడ్యూల్‌ను కూడా కోకాపేట సెట్లో తీసిన సంగతి గుర్తుండే ఉంటుంది. మళ్లీ అక్కడే తాజా షెడ్యూల్‌ను మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఇద్దరు హీరోలు పాల్గొనే భారీ సన్నివేశాలను చిత్రీకరిస్తారని అంటున్నారు. ఇందులో కొమరం భీం పాత్రలో నటిస్తున్న ఎన్టీఆర్ ఇప్పటికే లాయిడ్ స్టీవెన్స్ ఆధ్వర్యంలో పాత్రకు తగ్గట్టుగా తన బాడీలాంగ్వేజ్‌ను తీర్చిదిద్దుకున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా...ఎన్టీఆర్ సరసనఎంపికచేసిన హాలీవుడ్ తార డైసీ ఈ చిత్రం నుంచి వైదొలగడంతో ఆమెకు బదులుగా వేరే కథానాయిక ఎంపికకు సంబంధించి రకరకాల పేర్లు వినిపించినప్పటికీ చిత్రబృందం ఇంకా ఎవరినీ ఖరారు చేసినట్లు ప్రకటించలేదు. ఇక ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన బాలీవుడ్ భామ అలియాభట్ నటిస్తుండగా...ఇతర ముఖ్యపాత్రల్లో అజయ్‌దేవ్‌గణ్, సముద్రఖని తదితరులు తారాగణం. వచ్చే ఏడాది జూలై 30న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


రాయ్‌లక్ష్మి

# అవన్నీ వదంతులే


షారుక్‌ఖాన్

కొత్త చిత్రాలను తాను అంగీకరించినట్లు వస్తున్న వార్తలలో వాస్తవం లేదని, అవన్నీ వదంతులేనని బాలీవుడ్ బాద్‌షా షారుక్‌ఖాన్ స్పష్టంచేశారు. తాజాగా ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయంపై స్పందిస్తూ...డాన్-3, ధూమ్-4, కిల్‌బిల్ రీమేక్ చిత్రాలు తాను చేయబోతున్నట్లు వస్తున్న వార్తలలో నిజం లేదని చెప్పారు. అయితే తాను చేయబోయే కొత్త చిత్రం రెండు, మూడు నెలల్లో ఓ కొలిక్కి రావచ్చునని, ఆ ప్రాజెక్టు అన్నివిధాల కుదిరిన తర్వాత తానే తెలియజేస్తానని ఆయన వెల్లడించారు. గత కొంతకాలంగా షారుక్ సినిమాలు అనుకున్నంతగా ప్రేక్షకులను ఆకట్టుకోవడం లేదు. తాను ఎన్నో అంచనాల మధ్య చేసిన సినిమాలు సైతం బాక్సాఫీసు వద్ద తగినంత కలెక్షన్లను రాబట్టలేకపోయాయి. జీరో, జబ్ హ్యారీ మెట్ సెజల్ వంటి చిత్రాలు ఆయనతో పాటు అభిమానులను నిరాశకు గురిచేశాయి. ముఖ్యంగా జీరో చిత్రం కోసం మరుగుజ్జు పాత్రలో కనిపించడం కోసం ఆయనెంతో కష్టపడ్డారు కూడా. అయినా ఫలితం దక్కలేదు. దాంతో తాను చేయబోయే ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులేస్తున్న ఆయన ఇప్పుడు కాస్త గ్యాప్ తీసుకున్నారు.

# ఇకపై పాత్రలు మరొక ఎత్తు!

ఇప్పటివరకు నేను చేసిన పాత్రలు ఒక ఎత్తు అయితే...ఇకపై చేయబోయే పాత్రలు మరొక ఎత్తు. ఇందుకోసం పాత్రల ఎంపికలో నూతన నిర్ణయాలు తీసుకుంటున్నాను. రొటీన్ పాత్రలు ఎంతకాలం చేసినా ప్రయోజనం ఏం ఉంటుంది?. అందుకే ప్రయోగాత్మక పాత్రలకు...ఇంకా నె గటివ్ పాత్రలూ చేయడానికి సంసిద్ధమయ్యా అని అంటున్నారు రాయ్‌లక్ష్మి. తెలుగుతో పాటు దక్షిణాది ఇతర భాషల చిత్రాలకు బాగా సుపరిచితమైన ఈ భామ ఆ మధ్య బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి చిత్రం తర్వాత తెలుగులో ఇంకే స్ట్రయిట్ చిత్రమూ ఆమె చేయలేదు. కాకపోతే తమిళంలో రూపొందిన నియా 2 చిత్రం తెలుగులో నాగకన్య పేరుతో అనువాదమైంది. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రంలో నాగకన్యగా ప్రేమ విషయంలో నెగటివ్ ఛాయలున్న పాత్రలో ఆమె కనిపించింది. ఇక బాలీవుడ్‌లో ప్రధాన పాత్రలో ఆమె నటించిన జూలీ 2 అనుకున్నంతగా ఆడలేదు. ఈ నేపథ్యంలో ఏ భాషలో అవకాశాలొచ్చినా నటిస్తూ వస్తున్న ఆమె తాజాగా కన్నడంలో ఝాన్సీ అనే చిత్రంలో టైటిల్ పాత్రలోనూ, తమిళంలో రూపొందుతున్న సిండ్రెల్లా చిత్రంలోనూ ప్రధాన పాత్రలోనూ ఆమె నటిస్తోంది. వీటి సంగతి ఇలావుంటే...ఓ యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కబోయే ఓ చిత్రాన్ని కూడా రాయ్‌లక్ష్మి అంగీకరించినట్లు వినిపిస్తోంది. 2015లో వెలుగులోకి వచ్చిన షీనాబోరా హత్య కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం గుర్తుండే ఉంటుంది.తన కుమార్తె షీనాను ఆమె తల్లి ఇంద్రాణీముఖర్జియానే హత్య చేసినట్లు అప ్పట్లో వార్తలొచ్చాయి. ఈ సంఘటనను ఆధారం చేసుకుని దర్శకుడు స్వరాజ్ ఓ కథను తయారు చేసినట్లు సమాచారం. ఇందులో ఇంద్రాణీ పాత్ర కోసం రాయ్‌లక్ష్మిని సంప్రదించగా...ఆ పాత్ర చేసేందుకు రాయ్‌లక్ష్మి అంగీకరించినట్లు సమాచారం.

# శీను వేణుల కథ



"వీళ్లు మంచి కిడ్నాపర్స్" అనేది ఉప శీర్షిక. ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. సి.కల్యాణ్, విద్యావేత్త రాజు, రామ సత్యనారాయణ అతిథులుగా పాల్గొన్నారు. పల్లెటూరి నేపథ్య చిత్రమిది. గొర్రెలు కాసే ఇద్దరు అమ్మాయిలు అపహరణకు గురవుతారని దర్శకుడు తెలిపారు. "ఆ అమ్మాయిలను హీరోలు ఎలా రక్షించారు అనేది కథాంశం" అని చెప్పారు.

అభిషేక్, ప్రజ్వల్ కుమార్, మధు ప్రియ, పూజిత ప్రధాన తారాగణంగా రవి ములకలపల్లి రూపొందిస్తున్న చిత్రం 'శీను వేణు'.

# గ్యాంగ్‌స్టార్ కథతో

పలాస ప్రాంతంలో 1978లో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి సమర్పణలో సుధా మీడియా పతాకంపై ధ్యాన్ అట్లూరి నిర్మించిన చిత్రమిది. కరుణ కుమార్ దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు పూరి జగన్నాథ్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాంగ్‌స్టర్ కథలంటే నాకు చాలా ఇష్టం. అందరు విమర్శిస్తున్నారని అలాంటి కథలు తీయడం లేదు. కానీ పలాస ట్రైలర్ చూస్తుంటే నాకు బాగా నచ్చింది. హీరో హీరోయిన్ బావున్నారు. ఇందులో ప్రతి క్యారెక్టర్ చాలా బావుంటుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నారు అని అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ "టీజర్‌ను పూరిగారు విడుదల చేయడం ఆనందంగా ఉంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని చెప్పారు. రక్షిత్, నక్షత్ర హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో రఘు కుంచె, తిరువీర్, జనార్ధన్, లక్ష్మణ్, శృతి, జగదీష్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి పాటలు: భాస్కరభట్ల, సుద్దాల అశోక్ తేజ, లక్ష్మీభూపాల, సంగీతం: అరుల్ విన్సెంట్, సంగీతం: రఘు కుంచె.






సాన్యా మల్హోత్రా

# పాత్రలా కనిపించేందుకు...

దంగల్ తార సాన్యా మల్హోత్రా తన కొత్త సినిమా శకుంతలాదేవి కోసం సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో శకుంతలాదేవి పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా...ఆమె కూతురు అనుపమా బెనర్జీ పాత్రలో సాన్యా కనిపించనుంది. ఈ సినిమాను అనూ మీనన్ రూపొందిస్తున్నారు. గణిత సామ్రాజ్ఞిగా ప్రపంచాన్ని తన ప్రతిభతో ఆశ్చర్యపరిచింది శకుంతలాదేవి. ఆమె జీవిత కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అనుపమా బెనర్జీ పాత్ర కోసం ఆమె పోలికలు తనలో తెచ్చుకునేందుకు సాన్యా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా తన వంకీల జుట్టును స్ట్రైట్ చేసుకుంటోంది. పాత్ర సన్నద్ధత గురించి సాన్యా మల్హోత్రా మాట్లాడుతూ...ప్రత్యేకత గల ఒక పాత్రగా మనం మారాలంటే ఆ పాత్రలా కనిపించడం ముఖ్యం. నిజ జీవిత పాత్రల్లో నటించినప్పుడు మేకప్ చాలా అవసరం. ఇక్కడే సగం పని పూర్తవుతుంది. నేను దంగల్ చిత్రంలో బబిత పాత్రలో నటించినప్పుడు జుట్టు చిన్నగా కత్తిరించుకుని ఆమె ఎలా ఉండేదో అలా మారాను. ఇప్పుడీ సినిమాలో అనుపమా బెనర్జీలా కనిపించేందుకు ప్రయత్నిస్తున్నా. కూతురితో శకుంతలాదేవి ఎలా ఉండేది అని తెలుసుకునేందుకు అనుపమా బెనర్జీని కలిశాను. ఆమె కొన్ని విషయాలు చెప్పింది. నేను శకుంతలాదేవి గురించి పుస్తకాలు చదవడం వల్ల మరికొన్ని విషయాలు తెలుసుకున్నాను. విద్యాబాలన్ గారిని మొదటి షెడ్యూల్ చిత్రీకరణకు ముందే సంప్రదించి, సలహాలు తీసుకున్నా. అని చెప్పింది.

# డిసెంబర్‌లో మళ్లీ పెళ్లి...


కేటీ పెర్రీ, ఓర్లాండో బ్లూమ్స్

చెల్లి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ అని యమలీల సినిమాలో విలన్ తోట రాముడు కవిత్వం రాస్తే, చెల్లికి మళ్లీ పెళ్లేంట్రా అంటూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతారు పాఠకులు. మళ్లీ మళ్లీ పెళ్లి మనకు విడ్డూరమేమో గానీ...నాగరికత విశృంఖలమైన ఆంగ్ల చిత్ర పరిశ్రమలో కొత్త కాదు. అక్కడ పెళ్లిళ్లు, సహజీవనాలు అలా జరిగిపోతుంటాయి, ఆ జంటలు విడిపోతూ ఉంటాయి. వీళ్ల జాబితాలో మరో కొత్త జంట చేరింది. ప్రముఖ గాయని కేటీ పెర్రీ, నటుడు ఓర్లాండో బ్లూమ్స్ పెళ్లి చేసుకోబోతున్నారు. గత ఫిబ్రవరిలో వీళ్ల నిశ్చితార్థం జరిగింది, తాజాగా తాము పెళ్లికి కూడా సిద్ధమని ప్రకటించారీ జంట. డిసెంబర్‌లో పెర్రీ, బ్లూమ్ వివాహం జరగనుందట. కేటీ పెర్రీకి ఈ కొత్త పెళ్లికి ముందు హాస్యనటుడు రస్సెల్ బ్రాండ్‌తో పెళ్లి జరిగింది. అతనితో విడిపోయిన తర్వాత జాన్ మేయర్ తో ఆమె సహజీవనం చేసింది. ఓర్లాండో ఏం తక్కువ తినలేదు. మిరాండా కేర్‌తో పెళ్లయి, విడాకులు తీసుకున్నాడు. ఈ దంపతులకు ఎనిమిదేళ్ల అబ్బాయి ఫ్లిన్ ఉన్నాడు. వివాహంతో తమ ప్రేమకు గట్టి పునాది వేసుకోవాలని అనుకుంటున్నాం అంటూ ఈ ఇద్దరు ఓ మీడియా ముఖాముఖిలో వెల్లడించారు.

# యుద్ధవీరుల చరిత్ర

మలయాళ స్టార్ మమ్ముట్టి భారతీయ సంస్కృతి సంప్రదాయాల గురించి తెలియజెప్పే కథా చిత్రంలో నటిస్తున్నారు. ఇది కేరళ రాష్ట్రంలో జరిగిన కథ. సినిమా పేరు 'మామాంగం'. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లో నవంబర్ 21న విడుదల చేస్తున్నారు.

జమోరిన్ పాలనలో చావెరుక్కళ్ యుద్ధ వీరుల చరిత్ర ఆధారంగా రూపొందిన చారిత్మాత్కం చిత్రమిది. అతి ప్రాచీనమైన కలరి విద్యలోని విశిష్టతను ఇందులో చూపిస్తున్నారు. ఎం.పద్మకుమార్ దర్శకత్వంలో వేణు కున్నపిళ్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి మమ్ముట్టి మాట్లాడుతూ "భారతదేశ సంస్కృతి విశిష్టమైనది. భాషలు మనల్ని విభజిస్తాయి. కానీ భాష వల్ల మన చరిత్ర వేరే వాళ్లకి తెలియకుండా పోకూడదు. కేరళ రాష్ట్ర చరిత్ర అంటే భారతదేశ చరిత్ర కూడా. సినిమా అనే మాధ్యమం ద్వారా అన్నీ భాషల


మమ్ముట్టి

ప్రేక్షకులను ఏకం చేసి, మనకి సంబంధించిన ఒక మంచి కథను చెప్పే ప్రయత్నం చేస్తున్నాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "1695లో జరిగిన ఒక నిజమైన కథతో,ఇంతకు ముందెన్నడూ చూడని విజువల్స్‌తో ఈ సినిమా తీస్తున్నాం. జమోరిన్‌ని చంపిన చావేర్ కథే ఈ సినిమా అని " చెప్పారు. "నవంబర్ 21న సినిమాను విడుదల చేస్తామని" నిర్మాత చెప్పారు. మమ్ముట్టితో పాటు ప్రాచి తెహెలన్, ఉన్ని ముకుందన్, మోహన్ శర్మ, అను సితార, మాళవికా మీనన్ తదితరులు నటిస్తున్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
☞ ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076